సోమవారం
26•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 288
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఏప్రిల్ 30 నాటికి
అర్హులందరికీ రేషన్ కార్డులు

పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:


అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

రాష్ట్రంలో అర్హులందరికీ ఏప్రిల్ 30 నాటికి తెల్ల రేషన్‌కార్డులు జారీచేస్తామని ఆర్థిక, పౌరసరఫరాల శాఖల మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రాష్ట్రంలోని పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అర్హులందరికీ రేషన్ ఇవ్వాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా తెల్ల రేషన్‌కార్డుల అంశంపై ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, సాయన్న, కౌసర్ మొయినుద్దీన్, చింతల రామచంద్రారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సవివరంగా సమాధానమిచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని జీహెచ్‌ఎంసీ ప్రాంతాల్లో 4,06,397 బోగస్ కార్డులను ఏరివేసినట్టు తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల కోసం ఇప్పటివరకు 2,56,704 దరఖాస్తులు అందాయని, ఇప్పటివరకు 89,723 దరఖాస్తులను పరిశీలించినట్టు తెలిపారు. ఇందులో అర్హత ఉన్న 77,100 దరఖాస్తులకు కొత్త కార్డులను జారీ చేసినట్టు వెల్లడించారు. ఇంకా 1,66,981 దరఖాస్తులు దర్యాప్తులో ఉన్నాయన్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత కొత్త కార్డులను జారీ చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం అక్రమాలను పూర్తిస్థాయిలో నిరోధించినట్టు స్పష్టంచేశారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిలో 3,896 మందిపై సెక్షన్ 6(ఏ), 175 మందిపై క్రిమినల్ కేసులు, 8 మందిపై పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు 20,480 మెట్రిక్ టన్నుల బియ్యం రికవరీ చేసినట్టు మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు.





సోమవారం జరుగనున్న రాములోరి కల్యాణానికి విద్యుత్ దీపాలతో దేదీప్యమానమైన భద్రాచలక్షేత్రం. (ఇన్‌సెట్) ఆదివారం స్వామివారి ఎదుర్కోలు ఉత్సవంలో ముస్తాబైన సీతమ్మవారు.

శ్రీసీతారాముల కల్యాణం చూతము రారండి..

భద్రాచల క్షేత్రంలోని మిథిలా స్టేడియంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసీతారాముల వివాహ వేడుక అంగరంగవైభవంగా జరుగనున్నది. ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేయనున్నారు.

వివరాలు 3వ పేజీలో

ఫెడరల్ ఫ్రంట్‌దే హవా!

2019లో ఫ్రంట్‌కే అధికారం

- విజన్, కమిట్‌మెంట్ ఉన్న నేత కేసీఆర్
- కేసీఆర్ ప్రతిపాదనతో ప్రాంతీయ పార్టీల్లో కొత్త ఊపు
- ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్‌జోగి
- సీఎం కేసీఆర్‌తో ఫోన్‌లో సంభాషణ
- రిజర్వేషన్లు, మద్దతుధరలపై రాష్ట్రాలకే అధికారాలు ఇవ్వాలి
- అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలి
- కేంద్ర పెత్తనాన్ని సహించేది లేదు
- దేశంలో బీజేపీకి ఎదురుగాలి
- ఎంపీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో భంగపాటు తప్పదు
- ఛత్తీస్‌గఢ్‌లో జనతాకాంగ్రెస్‌దే అధికారం
- ప్రతిపక్షంగా విఫలమైన కాంగ్రెస్
- ఎన్నికల నాటికి మరింత బలహీనం


హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్‌జోగి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఫెడరల్ ఫ్రంట్ గాలి వీస్తుందని ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, జనతాకాంగ్రెస్ అధినేత అజిత్‌జోగి వ్యాఖ్యానించారు. 2019లో కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రాంతీయపార్టీల బలోపేతంతో జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు గల్లంతవుతాయని అన్నారు. సమీప భవిష్యత్తు అంతా ఫెడరల్ ఫ్రంట్‌దేనని కుండబద్దలుకొట్టారు. విజన్, కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు.. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తీసుకొన్న ఫెడరల్ ఫ్రంట్ నిర్ణయంపట్ల దేశవ్యాప్తంగా మంచి స్పందన వస్తున్నదని తెలిపారు. ఆత్మవిశ్వాసం, ప్రజాబలం, నిర్ణయాత్మక శక్తి కలిగిన నాయకుడిగా కేసీఆర్ గుర్తింపు పొందారని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన అజిత్‌జోగి మీడియాతో మాట్లాడారు. జాతీయపార్టీలకు వ్యతిరేకంగా తెలంగాణ సీఎం కేసీఆర్ ముందుకు రావడంతో ఆయనకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తున్నదని తెలిపారు. దేశంలో బీజేపీ ఏకఛత్రాధిపత్యంపై అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీలు విసుగుచెంది తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నాయని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ.. తమ చెప్పుచేతల్లో పెట్టుకోవాలని చూస్తున్నతీరుపై పోరాటాలు తీవ్రమవుతున్నాయని జోగి అన్నారు. ప్రధాన ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్ తన పాత్రను సమర్థంగా పోషించకపోగా.. మరింతగా బలహీనపడుతున్నదని, పర్యవసానంగా బలమైన ప్రాంతీయపార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతున్నదని పేర్కొన్నారు. అన్ని ప్రాంతీయపార్టీల నాయకులను ఫ్రంట్ నేతలు కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ప్రాంతీయపార్టీలను ఏకం చేయడం ద్వారా రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

అణగదొక్కితే ఉప్పెనై లేస్తాం

ప్రాంతీయపార్టీలను అణగదొక్కాలని చూస్తే ఉప్పెనై లేస్తామని అజిత్‌జోగి హెచ్చరించారు. ఎంతోకాలంగా బీజేపీ అణిచివేత ధోరణిని ప్రాంతీయపార్టీలు

మిగతా 2వ పేజీలో

మీ చర్య స్వేచ్ఛను హరించేదిలా ఉంది

ఇష్టానుసారం బెంచ్‌లను ఎలా రద్దుచేస్తారు?



- సీజేఐ తీరును తీవ్రంగా తప్పుబట్టిన సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు
- రాజకీయ పార్టీల వ్యవహారంపై ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నిస్తూ ఘాటు లేఖ

5


నిజామాబాద్ జిల్లా ముప్కాల్ వద్ద బావిలో పడిన ఆటోను క్రేన్‌తో బయటికి తీస్తున్న దృశ్యం

మృత్యు బావి

బావిలో ఆటో బోల్తా పడి 11మంది జలసమాధి

- నిజామాబాద్ జిల్లా ముప్కాల్ వద్ద ఘోరం
- అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- పరిమితికి మించి ఆటోలో 19మంది ప్రయాణం
- మృతుల్లో ఆరుగురు చిన్నారులు, ఐదుగురు మహిళలు
- ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి
- సంఘటనపై ఆరా తీసిన మంత్రులు పోచారం, మహేందర్‌రెడ్డి
- పండుగవేళ పెను విషాదం

14

డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం 11మంది ప్రాణాలను బలిగొంది. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ నుంచి 19మందితో బయలుదేరిన ఆటో, ఐదు నిమిషాలకే వ్యవసాయ బావిలో బోల్తా కొట్టింది. ఈ దుర్ఘటనలో అమాయక ప్రజలు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి మృతుల కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటించారు.

కేసీఆర్‌ది సమన్యాయ పాలన

నేనెందుకు పోతాసార్.. హైదరాబాద్‌కి..

ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డితో కలిసి బుద్దారం చెరువు చూసేందుకు పోయిన. అక్కడ తెనుగు రాములు అనే రైతు మమ్మల్ని చూసి పొలంలో నుంచి వచ్చిండు. అతడిని యోగక్షేమాలు అడిగాక.. పొలం గురించి అడిగితే.. 'సార్, నేను ఇంతకాలం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో అడ్డాకూలీగా పనిచేసిన. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీళ్ల పుల్లు, కరెంటు పుల్లు.. అందుకే సొంతూరుకొచ్చి నాకున్న రెండెకరాల భూమి చేసుకుంటున్న' అని చెప్పాడు. మళ్లీ హైదరాబాద్ పోతావా అని అడిగితే.. 'నేనెందుకు పోతా సార్.. హైదరాబాద్‌కి..' అని అన్నాడు. ఇది తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పు. రాములు లాంటి వాళ్ల కోసమే తెలంగాణ రాష్ట్రం వచ్చింది.

– అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు

11

- ప్రాంతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు
- అన్నివర్గాలకు అందుతున్న అభివృద్ధి ఫలాలు
- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు
- టీఎస్‌పీఎస్సీ ద్వారా 108 నోటిఫికేషన్లు ఇచ్చాం
- శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు
- పలుశాఖలకు చెందిన ఆరు పద్దులు ఆమోదం


ఆదివారం శాసనసభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రాంతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రమంతటా సమన్యాయపాలన అందిస్తున్నారని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గతంలో ముఖ్యమంత్రులు సంకుచిత ధోరణితో ఆలోచించేవారని, పాలనలో పక్షపాతం చూపించేవారని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల పక్షపాతిగా వ్యవహరిస్తూ అందరికీ ఆదర్శవంతంగా నిలుస్తున్నారని చెప్పారు. ఆదివారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రజాప్రతినిధులు ఏ పార్టీవారైనా అక్కడి నియోజకవర్గ ప్రజలు కూడా తెలంగాణ బిడ్డలే అని భావించి

మిగతా 2వ పేజీలో

సీపీఎస్ రద్దు చేయాలి

- దేశంలో గుణాత్మక మార్పుకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టాలి
- బదిలీలపై నిషేధం ఎత్తివేయాలి
- ఆర్డర్ టు సర్వ్ రద్దుచేయాలి
- ఏపీలోని తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి రప్పించాలి
- సకల ఉద్యోగుల మహాసభలో ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి


ఆదివారం సరూర్‌నగర్ మైదానంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సకల ఉద్యోగుల మహాసభ వేదికపై జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, జేఏసీ సెక్రటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు వీ మమత, ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం చంద్రశేఖర్‌గౌడ్, ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ పీ మధుసూదన్‌రెడ్డి తదితర నాయకులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:

ప్రభుత్వ ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దుచేసి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో గుణాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టాలని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి కోరారు. ఎంతోకాలంగా రాష్ట్రంలోని ఉద్యోగులు ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ సతమతమవుతున్నందున తక్షణమే బదిలీలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఆదివారం సరూర్‌నగర్ మైదానంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సకల ఉద్యోగుల మహాసభను నిర్వహించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల,

మిగతా 12వ పేజీలో

హైదరాబాద్ దాహం తీరుస్తాం

- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు
- ప్రతి వ్యక్తికీ రోజుకు 150 లీటర్ల తాగునీరు
- ఔటర్ చుట్టూ కనెక్టివిటీ గ్రిడ్ నిర్మాణం
- శాసనమండలిలో మంత్రి కేటీఆర్




2

నేతన్నలకు రెండు కార్పొరేషన్లు

హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్‌కు వేర్వేరుగా.. రేపోమాపో ఉత్తర్వులు

నేతన్నలకు రెండు కార్పొరేషన్లు

- హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్‌కు వేర్వేరుగా..
- ఒకటి రెండురోజుల్లో ఉత్తర్వులు
- చేనేతకు అండగా సర్కారు నిర్ణయం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేతన్నలకు సర్కారు అండగా నిలుస్తున్నది. నేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నది. వారి సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. వాటి అమలు తీరును పర్యవేక్షించడానికి కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ (టీఎస్‌హెచ్‌సీ), తెలంగాణ స్టేట్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ (టీఎస్‌టీసీ) ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలుపగా.. సంబంధించిన ఉత్తర్వులు ఒకటి రెండురోజుల్లో వెలువడనున్నాయి. కార్పొరేషన్లకు ఇద్దరు చైర్మన్లు, ఎండీలను, పాలకవర్గాలను నియమించనున్నారు. రాష్ట్రంలో చేనేత, మరమగ్గాల మీద పనిచేసే కార్మికుల వివరాలను అధికారులు ఇప్పటికే జియోట్యాగింగ్ చేసి సిద్ధంగా ఉంచారు. వాటి ఆధారంగా కార్పొరేషన్ రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. నేత వృత్తి ద్వారానే కాకుండా అనుబంధ వృత్తుల్లో ఉన్నవారిని సైతం ప్రోత్సహించనున్నారు. చేనేత, మరమగ్గ కార్మికులకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించింది. నేతన్నల ఆత్మహత్యలు లేని తెలంగాణను చూడాలని, వారికి ఏడాదిలో దాదాపుగా ప్రతి రోజు పని లభించేలా ఏర్పాట్లుచేస్తున్నది. సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించి.. ఏ నెలలో ఏ శాఖకు అవసరమైన వస్ర్తాలు తయారుచేయాలో నిర్ణయించింది. వివిధ ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్ర్తాలన్నింటిని చేనేత, జౌళిశాఖ ద్వారానే కొనుగోలు చేస్తున్నారు. బతుకమ్మ చీరెలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమశాఖ గురుకులాల విద్యార్థులకు యూనిఫాం క్లాత్, వివిధశాఖల ఉద్యోగులకు అవసరమైన యూనిఫాం వస్ర్తాన్ని, వైద్యారోగ్యశాఖ దవాఖానల్లోని బెడ్ మెటీరియల్.. ఇలా ప్రభుత్వశాఖలకు అవసరమైన వస్ర్తాల తయారీతో నేతన్నలకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. చేనేత కార్మికులకు కూలి రేట్లను కూడా భారీగా పెంచింది. చేనేత వస్ర్తాల కొనుగోలుకు ప్రస్తుతమున్న టెస్కో.. ఇక హ్యాండ్లూమ్ కార్పొరేషన్‌కు అనుబంధంగా ఉండనుంది.

కాస్తులో ఉన్న రైతులకు హక్కులు కల్పించండి

పెద్దపల్లి జిల్లా కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం గ్రామాల భూమి సమస్యపై సీఎం కేసీఆర్ ఆదేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెద్దపల్లి జిల్లాలో దశాబ్దాల తరబడి భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. జిల్లాలో కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం గ్రామాల్లోని 462 ఎకరాల భూమిని 1950 నుంచి రైతులు సాగు చేసుకుంటున్నప్పటికీ రికార్డుల్లో దేవాదాయ భూములుగా వస్తున్నదని, దీనిని పరిశీలించి పరిష్కరించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. ఈ భూ వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని సీఎం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వాస్తవంగా దేవాదాయశాఖదిగా చెప్తున్న ఈ 462 ఎకరాల భూమిలో గ్రామాలు వెలిశాయని, చాలామంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని, రోడ్లు, స్కూళ్లు ఇతర నిర్మాణాలు కూడా జరిగాయని సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. 1950కి ముందు ఈ భూములన్నీ దేవాదాయశాఖ భూములుగా రికార్డుల్లో నమోదై ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో ఈ గ్రామా లు పర్యటించిన అధికారులు ఈ భూమికి ఎవరు హక్కుదారులనేది తేల్చలేకపోయారు. చాలామంది రైతులు ఈ భూ మిని సాగు చేసుకుంటూ కాస్తులో ఉన్నారు. కానీ, భూమిమాత్రం రికార్డులో దేవుడిమాన్యాలుగా ఉండటంతో అధికారులు ఈ సమస్యను పార్ట్ 'బీ' కింద చేపట్టడంకోసం పెండింగ్‌లో పెట్టారు. దశాబ్దాలుగా ఈ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు యజమాన్య హక్కులు కల్పించాలన్న ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్ వెంటనే సమస్యను పరిష్కరించాలని, కాస్తులో ఉన్న రైతులకు హక్కులు కల్పించాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో కాసులపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ సంబురాలు జరుపుకున్నారు.

ఫ్రాన్స్ వైమానిక సంస్థలో ఉద్యోగాలు


- పాలిటెక్నిక్ అభ్యర్థులు అర్హులు
- దరఖాస్తులకు తుది గడువు ఈ నెల 31
- టాస్క్ సమన్వయంతో కొలువుల భర్తీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతరిక్ష, విమాన, రక్షణ సేవల్లో ప్రపంచంలో పేరెన్నికగన్న ఫ్రాన్స్ వైమానిక సంస్థ సాఫ్రాన్ హైదరాబాద్‌లో ఏర్పాటుచేస్తున్న తన కొత్త ఉత్పత్తికేంద్రంలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. 55 శాతం మార్కులతో పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన, ప్రస్తుతం చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు వీటికి అర్హులు. ఈ పోస్టుల దరఖాస్తులకు గడువు తేదీని ఈ నెల 31గా నిర్ణయించింది. సాఫ్రాన్ సంస్థ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్, రాకెట్, ఏరోస్పేస్ కాంపోనెంట్ సంబంధించిన వాటిలో ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచింది. 2005లో ఏర్పడిన ఈ సంస్థ ప్రధాన కార్యాలయం పారిస్‌లో ఉన్నది. ఎయిర్‌క్రాఫ్ట్ వైరింగ్‌లో అంతర్జాతీయంగా పేరొందిన సాఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ సంస్థ శంషాబాద్ ఎయిర్‌పోర్టు పక్కన ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సిద్ధమైంది. ఎలక్ట్రికల్ వైర్ హార్నెస్ట్ అసెంబ్లింగ్ బండిల్స్ ఉత్పత్తిని త్వరలో ప్రారంభించనున్నది. ఈ కేంద్రంలో టెక్నిషియన్స్, ఇంజినీర్లు అవసరమున్న నేపథ్యంలో స్కిల్డ్ మ్యాన్‌పవర్ కోసం టాస్క్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నది. ఈ మేరకు సంస్థకు సంబంధించిన ఉద్యోగుల ఎంపిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. టాస్క్ ద్వారా ఉద్యోగులను ఎంపికచేసుకొని వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారని టాస్క్ సీఈవో సుజీవ్‌నాయర్ తెలిపారు. వివరాలకు https://www.task.telangana.gov.in/Placements/Safran_Electrical_and_Power_India_Pvt_Ltdలో చూడవచ్చని పేర్కొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.19 గంటలకు



సూర్యాస్తమయం: 6.24 గంటలకు


విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం నవమి తె. 5.56 వరకు, తదుపరి దశమి (మంగళవారం తె. 3.45 వరకు), నక్షత్రం: పునర్వసు మధ్యాహ్నం 12.56 వరకు తదుపరి పుష్యమి, అమృతఘడియలు: ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం 12.16 వరకు, రాహుకాలం: ఉదయం 7.50 నుంచి 9.20 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.58 నుంచి మధ్యాహ్నం 12.46 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.11 నుంచి 3.59 వరకు, వర్జ్యం: తె. 1.39 నుంచి 3.15 వరకు, తిరిగి రాత్రి 8.27 నుంచి 10.34 వరకు.

కాళేశ్వరం ప్యాకేజీ పనుల్లో వేగం పెంచాలి

- లింక్-7తో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు సస్యశ్యామలం
- ఏప్రిల్ 3, 4 తేదీల్లో ప్రాజెక్టు పనుల పరిశీలన
- నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- కాళేశ్వరం ప్యాకేజీ పనుల పురోగతిపై మంత్రి పోచారంతో కలిసి సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని లింకు -7కు చెందిన 20, 21, 22 ప్యాకేజీ పనులను వేగవంతం చేయాలని అధికారులను నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు ఆదేశించారు. పనులు పూర్తిచేస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సాగునీటి కరువు ఉండదన్నారు. ఆదివారం అసెంబ్లీ కమిటీహాల్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్యాకేజీ 20, 21, 22 పనుల పురోగతిపై మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు సమీక్షించారు. ఏప్రిల్ 3, 4 తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం, కాళేశ్వరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్టు వెల్లడించారు. ఈ మూడు ప్యాకేజీలను ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు ఎస్‌ఈని నియమించాలని ఉన్నతాధికారులకు సూచించారు. '21, 22 ప్యాకేజీల కింద కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ప్రతిపాదించిన నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరందించే కాళేశ్వరం పనుల్లో మరింత వేగంపెంచాలి. ఈ ప్యాకేజీల్లో ఆరు రిజర్వాయర్లను 8.50 టీఎంసీల స్టోరేజీ సామర్థ్యంతో నిర్మిస్తున్నాం. మధ్యప్రదేశ్‌లో విజయవంతమైన పైప్ ఇరిగేషన్ విధానాన్ని 20వ ప్యాకేజీలో ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నాం. 21వ ప్యాకేజీలో రెండులక్షల ఎకరాలను సాగులోకి తీసుకొస్తాం. 21వ ప్యాకేజీ పైప్ ఇరిగేషన్ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అగ్రిమెంట్ కుదుర్చుకుని వెంటనే పనులు ప్రారంభించాలి. ఇందల్వాయి, రామడుగు, కంజర, బొడ్డుమాముడి, ఏదుల చెరువులను కాళేశ్వరం నీటితో నింపే అంశాన్ని పరిశీలించాలి. ఆర్మూర్ నియోజకవర్గంలో హైడ్రాలజీ క్లియరెన్స్ ఉన్న లిఫ్ట్ పథకాలను ప్రభుత్వ ఆమోదానికి పంపించాలి. నిజాంసాగర్ దిగువన మంజీర నదిపై పెండింగ్‌లో ఉన్న నాగమడుగు ఎత్తిపోతల పథకం డీపీఆర్ సిద్ధంచేసి నివేదించాలి. జుక్కల్ నియోజకవర్గంలోని నాలుగుమండలాల్లో ఈ పథకం ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా 22 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన వరద కాల్వను రిజర్వాయర్‌గా మార్చుతున్నాం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్యాకేజీ 20, 21 కింద నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 1,06,311 ఎకరాలు, ఆర్మూర్‌లో 1876 ఎకరాలు, బాల్కొండ నియోజకవర్గంలో 71,262 ఎకరాలు, జగిత్యాల నియోజకవర్గంలో 20వేల ఎకరాలు సాగులోకి వస్తాయని చెప్పారు. ప్రాజెక్టు పరిధిలోని 20, 21, 22 ప్యాకేజీ కింద నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని, దీనికోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గతంలో 25 టీఎంసీలు కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ఆయకట్టు, రిజర్వాయర్లలో నీటినిల్వ సామర్థ్యానికి అనుగుణంగా మరో 10 టీఎంసీల కేటాయింపులు పెంచి, మొత్తం 35 టీఎంసీలకు అనుమతులు జారీచేస్తామని హరీశ్‌రావు ప్రకటించారు. ప్యాకేజీ 21, 22 పనులు నెమ్మదిగా సాగుతుండటంపై మంత్రులు అసంతృప్తి వ్యక్తంచేశారు. భూ సేకరణ, కొన్నిచోట్ల కాల్వలకు ఇం డ్లు అడ్డు వస్తుండటంతో పనులు నెమ్మదించాయని అధికారులు వివరించారు. కొంత కాల్వల ద్వారా కాకుండా అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా సాగునీరు అందిస్తున్నందున డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ కోసం భూ సేకరణ సమస్యలేదని, సమాంతరంగా పనులను ప్రారంభించాలని మంత్రులు సూచించారు. ప్రాజెక్టులోని క్షేత్రస్థాయి సమస్యలను స్థానిక ఎమ్మెల్యేలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, వేముల ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, గంప గోవర్ధన్, హన్మంతు షిండే, ఏనుగు రవీందర్‌రెడ్డి, సాగునీటిశాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆదివారం అసెంబ్లీ కమిటీహాల్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్యాకేజీ 20, 21, 22 పనుల పురోగతిపై మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్షిస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ దాహం తీరుస్తాం

- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు
- ప్రతి వ్యక్తికీ రోజుకు 150 లీటర్ల తాగునీరు
- ఔటర్ చుట్టూ కనెక్టివిటీ గ్రిడ్ నిర్మాణం
- ఆదర్శంగా ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్
- గడప దగ్గరికే విద్య, వైద్యం, పౌరసేవలు
- శాసనమండలిలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి లేకుండా శాశ్వతచర్యలు తీసుకొంటున్నామని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు స్పష్టంచేశారు. ఆదివారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా తాగునీటి సమస్యపై సభ్యులు జాఫ్రీ, ఎంఎస్ ప్రభాకర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు. నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండాచేసేందుకు ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ 'కనెక్టివిటీ గ్రిడ్' నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటర్ కనెక్టివిటీ గ్రిడ్ ద్వారా కృష్ణా, గోదావరి, మంజీరానీటిని కలిపి నగరంలో ఉన్న 21 లక్షల కుటుంబాలకు తాగునీటిని అందిస్తామని చెప్పారు. శామీర్‌పేట, చౌటుప్పల్ వద్ద పది టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను నిర్మిస్తామన్నారు. ఈ పనులకు సంబంధించిన టెండర్లు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతి వ్యక్తికి రోజుకు 150 లీటర్ల నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు. గోదావరి, సింగూరు, కృష్ణా, మంజీరా నుంచి మొత్తం 448 ఎంజీడీల నీటిని తీసుకొచ్చేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని మంత్రి కేటీఆర్ వివరించారు. జంటనగరాలకు తాగునీటి సరఫరా కోసం వినియోగించే విద్యుత్ భారాన్ని.. హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డుపై పడకుండా తగ్గించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. విద్యుత్ చార్జీలకు సంబంధించి ఇప్పటికే విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌ను సంప్రదించినట్లు చెప్పారు. మెట్రో వాటర్ బోర్డుకు నగరంలో సుమారు రెండువేల ఎకరాల స్థలాలు ఉన్నాయని, ఈ స్థలాలలో ప్రత్యేకంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేసే అంశాలను కూడా పరిశీలిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. రాబోయే రోజుల్లో నగరంలో సీవరేజ్ తొలిగింపును మానవ రహితంగా రోబోలతో చేయిస్తామని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.



ఆదివారం శాసనమండలిలో తాగునీటి సమస్యపై సభ్యులకు సమాధానమిస్తున్న మంత్రి కే తారకరామారావు

ఆదర్శంగా ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు

రాష్ట్రంలో ఆప్టిక్ ఫైబర్ కేబుళ్ల ప్రయోగం దేశానికే ఆదర్శంగా నిలువనున్నదని మంత్రి కేటీఆర్ మండలిలో చెప్పారు. మిషన్ భగీరథ రూపకల్పన సందర్భంగా 1.50 లక్షల కిలోమీటర్ల పైప్‌లైన్ వేస్తున్న నేపథ్యంలో, పైప్‌లైన్‌తో పాటు ఆప్టిక్ ఫైబర్ కేబుల్ వేయాలని నిర్ణయించామని వెల్లడించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కోటి ఇండ్లకు ఇంటర్నెట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి ఈ పనులు పూర్తవుతాయన్నారు. కోటి ఇండ్లకు ఇంటర్నెట్ కనెక్షన్ కల్పించడం ప్రపంచంలో ఏ దేశంలో జరుగలేదని, ఈ విషయంలో తెలంగాణ సరికొత్త రికార్డును సాధించనున్నదని చెప్పారు. రాబోయేరోజుల్లో దీనిద్వారా విద్య, వైద్యం, పౌరసేవలు ప్రజలకు అందుతాయన్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, ఐఐఎం లాంటి సంస్థల నుంచి శిక్షణ పొందే అవకాశం కూడా ఉంటుందని మంత్రి వివరించారు. కార్పొరేట్ దవాఖానల నుంచి టెలి మెడిసిన్ సేవలు పొందే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇంటినుంచే ప్రభుత్వ పౌరసేవలను పొందవచ్చని చెప్పారు. దీని ఏర్పాటుతో కేబుల్ ఆపరేటర్లు, ఎంఎస్వోలకు వచ్చే నష్టం లేదని, వీరితో కలిసి పనిచేస్తామని తెలిపారు. మహేశ్వరం మండలంలోని నాలుగు గ్రామాల్లో టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ఏర్పాటుకు రూ. 5050 కోట్లు వ్యయంగా నిర్ణయించామని, మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు తీసిన మార్గంలో కేబుల్ వేయాలనే నిర్ణయంతో రూ.1225 కోట్లు ఆదా అయినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలు రెండు రోజులు పొడిగింపు?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రెండు రోజులపాటు పొడిగించే అవకాశం ఉన్నట్టు సమాచారం. కొత్త పంచాయతీరాజ్ చట్టంతోపాటు ప్రైవేటు యూనివర్సిటీల బిల్లుకు సభ ఆమోదం తెలుపాల్సి ఉన్నందున ఈ పొడిగింపు ఉండనున్నట్లు తెలుస్తున్నది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈనెల 27తో అసెంబ్లీ సమావేశాలు ముగియాల్సి ఉన్నది.

2017 'మత్తు'నామ సంవత్సరమే!

- 2013 తర్వాత ఇంత భారీగా మాదకద్రవ్యాలు గతేడాదే పట్టివేత

న్యూఢిల్లీ, మార్చి 25: గత ఏడాది భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. గత ఐదేండ్లలో ఎన్నడూలేనంతగా మాదకద్రవ్యాలు పట్టుబడినట్లుగా మాదకద్రవ్యాల నిరోధక మండలి (ఎన్‌సీబీ) విడుదల చేసిన తాజా నివేదికను చూస్తే అర్థమవుతున్నది. శనివారం కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆ నివేదికను విడుదల చేశారు. 2017లో రికార్డు స్థాయిలో 3.6 లక్షల కిలోల మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయని, ఇవి గత ఐదేండ్లతో పోల్చుకుంటే 300 శాతం అధికంగా ఉన్నాయని ఎన్‌సీబీ పేర్కొంది. గత ఏడాది హెరాయిన్ తయారీకి వినియోగించే ఓపియం 2,551 కిలోలు, హెరాయిన్ 2,146 కిలోలు, గంజాయిలాంటి మత్తు పదార్థాలు 3,52,379 కిలోలు, హషీష్ 3,218 కిలోలు, కొకైన్ 69 కిలోలు పట్టుకున్నారు. 2013 తర్వాత ఇంత భారీగా పట్టుబడటం ఇదే మొదలు. 2017లో 3.60 లక్షల కిలోల మత్తుపదార్థాలు పట్టుబడగా, 2016 లో 3.01 లక్షల కిలోలు, 2015లో లక్ష కిలోలు, 2014లో 1.10 లక్షల కిలోలు, 2013లో లక్ష కిలోలు ఉన్నట్లు ఎన్‌సీబీ నివేదిక వెల్లడించింది.

కేసీఆర్‌ది సమన్యాయ పాలన

మొదటిపేజీ తరువాయి...

సీఎం కేసీఆర్ అందరికీ సమానంగా ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రతి పథకం అమలులో ఇదే పద్ధతిని అనుసరిస్తున్నామని, పింఛన్లు, పథకాలు, ఇతర ఫలాల పంపిణీ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నదని చెప్పారు. పార్టీలకతీతంగా ఎమ్మెల్యేలకు రూ.3 కోట్లు ఇచ్చి వారి హుందాతనాన్ని పెంచామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్‌ను అనుసరిస్తూ ఇక్కడి పథకాలను వారి రాష్ట్రాల్లో అమలుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. తెలంగాణ పథకాలు దేశం మొత్తం ప్రచారం కావడం వెనుక మీడియా పాత్ర ఎంతో ఉందని, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రచారం చేయడం వల్లనే తెలంగాణ అన్ని రాష్ట్రాలకు పరిచయమైందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలవుతున్న పథకాల గురించి ఆరా తీస్తున్నాయని చెప్పారు. పలు రాష్ట్రాలు తెలంగాణలో పథకాలను పరిశీలించడానికి తమ ప్రతినిధులను పంపిన విషయాన్ని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. మూడున్నరేండ్లలో ఇంతఖ్యాతి గడించినందుకు ప్రతి తెలంగాణ బిడ్డ గర్వపడుతున్నాడని అన్నారు. అనంతరం సభ వివిధ శాఖలకు చెందిన ఆరు పద్దులను ఆమోదించింది.

టీఎస్‌పీఎస్సీ నుంచి 108 నోటిఫికేషన్లు..

టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటివరకు 108 నోటిఫికేషన్లు విడుదల చేసినట్టు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 6,463 మందిని రిక్రూట్ చేశామని, 12,813 పోస్టుల ఫలితాలు త్వరలో వెలువడనున్నాయని చెప్పారు. టీఎస్‌పీఎస్సీతోపాటు పోలీసు, ఆర్టీసీ తదితర డిపార్ట్‌మెంట్లు కూడా అదనంగా రిక్రూట్‌మెంట్ ప్రక్రియను చేపట్టాయని మంత్రి హరీశ్‌రావు వివరించారు.

జర్నలిస్టు సంక్షేమ సర్కార్..

జర్నలిస్టుల సంక్షేమంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచించినట్టు మరెవరూ ఆలోచించడం లేదని, జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్‌కార్డులు ఇచ్చి కార్పొరేట్ వైద్యాన్ని అందించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మండలాల్లో పనిచేసే కంట్రిబ్యూటర్లకు సైతం తెలంగాణ ప్రభుత్వం వైద్య సేవలందిస్తున్నదని తెలిపారు. జర్నలిస్టుల కోసం సంక్షేమనిధిని ఏర్పాటుచేసి, బడ్జెట్‌లో నిధులు కేటాయించిన తొలి ప్రభుత్వం తమదేనని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టు సంక్షేమ నిధికి ఇప్పటికే రూ. 34.54 కోట్లు ఇచ్చామని, ఈసారి మరో రూ.20 కోట్లు కేటాయించామని చెప్పారు. తెలంగాణలో మొత్తం 35,862 హెల్త్‌కార్డులు జారీచేశామని, ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని తెలిపారు. 16,793 మందికి రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో అక్రెడిటేషన్లు ఇచ్చామని చెప్పారు. మరణించిన 151 మంది జర్నలిస్టుల కుటుంబాల ఆర్థికసహాయం, 52 మందికి వైద్య చికిత్సల కింద రూ. 2.19 కోట్లు అందజేసినట్టు మంత్రి వివరించారు.

చిన్న పత్రికలకు అండగా ఉంటున్నాం..

చిన్నాపెద్దా అనే తేడాలేకుండా అన్ని పత్రికలకు ప్రభుత్వం నుంచి ప్రకటనలు ఇస్తునట్టు మంత్రి హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రం నుంచి వివిధ భాషల్లో వెలువడుతున్న సుమారు 170 చిన్న పత్రికలకు నెలకు రూ. 36 లక్షల చొప్పున ప్రకటనలు ఇచ్చి ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. 45 ఉర్దూ పత్రికలను కొత్తగా ఎంప్యానెల్ చేసి అక్రెడిటేషన్ ఇచ్చామని, చిన్న పత్రికల కోసం ప్రతిఏటా రూ.4.32 కోట్లు ఖర్చుచేస్తున్నామని చెప్పారు.

ఫెడరల్ ఫ్రంట్‌దే హవా!

మొదటిపేజీ తరువాయి...

సహనంతో భరించాయని అన్నారు. రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలిగే పెనుప్రమాదం ముంచుకొస్తుండటంతో ఎదురు తిరుగుతున్నామని తెలిపారు. రాష్ట్రాలపై కేంద్రప్రభుత్వ పెత్తనం ఎక్కువై.. ప్రజలకు సుపరిపాలన అందించే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇలాంటి స్థితిగతుల నుంచి బయటపడేందుకు ప్రాంతీయపార్టీలు ఉద్యమబాట పట్టాయని చెప్పారు. తెలంగాణ సీఎం కేసీఆర్ చూపిస్తున్న చొరవకు అసంతృప్త ప్రాంతీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. పశ్చిమబెంగాల్‌లో సీఎం మమత బెనర్జీని కలుసుకొని ఫెడరల్ ఫ్రంట్ విషయం, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిపై విస్తృతంగా చర్చించామని కేసీఆర్ తనకు చెప్పారని జోగి తెలిపారు.

రాష్ట్రాలకే అధికారాలు

వివిధ అంశాలపై రాష్ట్రాలకే సంపూర్ణ అధికారాలు ఉండాలని, ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలని అజిత్ జోగి డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ప్రజల స్థితిగతులు, జీవన విధానంపై రాష్ట్ర ప్రభుత్వాలకే అవగాహన ఉంటుందని, దానికి అనుగుణంగానే పరిపాలన సాగుతుందని తెలిపారు. ముఖ్యంగా రిజర్వేషన్ల కేటాయింపు, రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం వంటివి కీలకమైనవని స్పష్టంచేశారు. వ్యయసాయ ఆధారితమైన మన దేశంలో రైతుల పంట ఉత్పత్తులకు ఆయా రాష్ట్రాలే మద్దతు ధర ప్రకటించే అవకాశం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఇలాంటి విధానాలపై రాజ్యాంగాన్ని అవసరాల మేరకు మార్చుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ ఎందుకు చేయడంలేదంటూ ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకొంటే రాష్ట్రాలపై తమ పెత్తనం, ఆధిపత్యం పోతుందన్న కారణంతో కేంద్ర పాలకులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని విమర్శించారు.

2019లో ఫ్రంట్‌దే అధికారం

ప్రాంతీయ పార్టీలను ఏకతాటి పైకి తేవడం ద్వారా.. కాంగ్రెస్, బీజేపీలను మట్టికరిపించి 2019లో ఫెడరల్ ఫ్రంట్ కేంద్రంలో అధికారం చేపడుతుందని అజిత్‌సింగ్ జోస్యం చెప్పారు. పూర్తిస్థాయి మెజార్టీ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తున్నదని విమర్శించారు. చెప్పినట్టు వినకుంటే తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. రాష్ట్రాలలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలకు విలువ ఇవ్వకుండా, కేంద్ర నిధులు అందించకుండా ఆధిపత్యం చెలాయిస్తున్నదని మండిపడ్డారు. మతతత్వ రాజకీయాలు చేస్తూ మైనార్టీ వర్గాలను అణిచివేస్తున్నదన్నారు. కేంద్రప్రభుత్వ పనితీరును దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు నిశితంగా గమనిస్తున్నాయని, ఈ దశలో తెలంగాణ సీఎం కేసీఆర్ లాంటి నాయకుడు ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనతో ముందుకు రావడం మరింత ఊపునిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మాదే అధికారం

ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది నవంబర్లో జరిగే ఎన్నికల్లో తమ జనతాకాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అజిత్‌జోగి ధీమా వ్యక్తంచేశారు. పదిహేనేండ్ల బీజేపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి లేక ప్రజలు విసుగుచెందారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజల పక్షాన పోరాడటంలో అన్నివిధాలుగా విఫలమైందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అడుగంటిపోయాయని, ఎక్కడ.. ఎప్పుడు.. ఏ విధంగా ఎన్‌కౌంటర్ జరుగుతుందో తెలియని అయోమయం నెలకొన్నదన్నారు. ప్రజలు నిత్యం భయంతో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. బుల్లెట్‌కు ప్రతి బుల్లెట్ సమాధానంగా ప్రభుత్వం పరిపాలన చేస్తున్నదని విమర్శించారు. మావోయిస్టుల సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో అమాయకులు బలి అవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి అనిశ్చిత వాతావరణం నుంచి బయటపడేందుకు ప్రత్యామ్నాయంగా ఛత్తీస్‌గఢ్ ప్రజలు జనతాకాంగ్రెస్‌కు పట్టం కడుతారని అజిత్ జోగి తెలిపారు. ఒకవేళ పూర్తి మెజార్టీ రాకపోతే అన్న ప్రశ్నకు సమాధానంగా ఎన్నికల ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకొంటామని చెప్పారు.

బీజేపీకి అన్ని రాష్ట్రాల్లో ఎదురుగాలి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అన్ని రాష్ట్రాల్లో ఎదురుగాలి వీస్తున్నదని అజిత్‌జోగి తెలిపారు. తాజాగా మిత్రపక్షాలుగా ఉన్న టీడీపీ, శివసేన పార్టీలు ఎన్డీయే నుంచి బయటికి రావడంతో బీజేపీ విశ్వసనీయతను కోల్పోయిందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగులడం ఇందుకు నిదర్శనమన్నారు. బీహార్‌లోనూ ఆ పార్టీ ఓటమిపాలయిందన్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో పత్తాలేదని, తమిళనాడులో అన్నా డీఎంకే, డీఎంకే.. బెంగాల్‌లో మమత, ఒడిశాలో నవీన్ పట్నాయక్, జార్ఖండ్‌లో శిబూసొరేన్ పార్టీలు బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఈ ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి చావుదెబ్బ తగులుతుందని స్పష్టంచేశారు.

కమిట్‌మెంట్ ఉన్న నేత కేసీఆర్


ఏదైనా నిర్ణయం తీసుకుంటే దానిని సాధించే నాయకుడిగా.. ఒక మంచి విజన్, కమిట్‌మెంట్ ఉన్న నేతగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తింపు పొందారని అజిత్‌జోగి అన్నారు. ఆదివారం తాను హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడానని చెప్పారు. ఫ్రంట్‌ను దేశవ్యాప్తంగా బలంగా తయారుచేయాలని కేసీఆర్ తనతో చెప్పినట్టు ఆయన వెల్లడించారు. అన్ని రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ పార్టీలను కలుపుకొని క్షేత్రస్థాయిలో పనిచేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఫ్రంట్‌ను బీజేపీ, కాంగ్రెస్ వ్యతిరేకశక్తులు సాదరంగా ఆహ్వానిస్తున్నాయని అన్నారు. చాలామంది అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నారని, వచ్చే ఎన్నికలనాటికి అందరూ బయటికి వచ్చి బేషరతుగా మద్దతు ప్రకటించే అవకాశాలున్నాయని జోగి వివరించారు. ఫెడరల్ ఫ్రంట్‌ను ప్రకటించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై చేస్తున్న ఆధిపత్యాన్ని, అణిచివేతధోరణిని ఎండగట్టిన నేత కేవలం కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ఉన్నది ఉన్నట్టు చెప్పే ధైర్యశాలి అని ప్రశంసించారు. ఫెడరల్‌ఫ్రంట్‌కు దేశవ్యాప్త మద్దతు కూడగట్టాలని, అందుకు సహకారం అందించాలని కేసీఆర్ కోరినట్టు తెలిపారు. మొదటగా తానే ఫ్రంట్‌కు మద్దతు తెలిపి ముందుకురావడంతో దేశవ్యాప్తంగా ఫ్రంట్‌పై చర్చ మొదలైందనే విషయం తమ మాటల్లో ప్రస్తావనకు వచ్చినట్టు చెప్పారు. మరోమారు భేటీ అయి భవిష్యత్ కార్యాచరణకు శ్రీకారం చుడుదామని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ అన్నట్టు అజిత్‌జోగి తెలిపారు.

లోకం పోకడ



దివ్యమైన రోజు..
ఈ సారి మనయాత్ర బంపర్ హిట్!

గవర్నర్, ముఖ్యమంత్రి శ్రీరామనవమి శుభాకాంక్షలు




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. మర్యాద పురుషోత్తముడు శ్రీరాముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని గవర్నర్ పేర్కొన్నారు. శాంతి, సుఖ సంతోషాలతో తెలంగాణ ప్రజలు వర్ధిల్లేలా సీతారాములు దీవిస్తారని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణమహోత్సవం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కోటి ఎకరాల మాగాణిగా చేసే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యే ఒక అద్భుతమైన ఘట్టం శ్రీ సీతారామచంద్రస్వామి దీవెనలతో ఆవిష్కృతం కానున్నదని తెలిపారు.

పదిరోజులు సెలవుపై వెళ్లనున్న గవర్నర్

గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ వ్యక్తిగత అవసరాల నిమిత్తం పదిరోజులు సెలవులో వెళుతున్నారు. ఈ నెల 30న ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి ఇటలీ వెళ్లనున్నారు. ఏప్రిల్ 9న ఆయన తిరిగి హైదరాబాద్‌కు వస్తారని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్, ఈ నెల 29న తెలంగాణ శాసనసభ సమావేశాలు ముగుస్తున్నందున గవర్నర్ తన పర్యటనను 30న ఖరారు చేసుకున్నట్టు తెలిసింది.

పంజా విసురుతున్న చిరుత!

నిత్యం దూడలు, మేకలపై దాడులు.. మెదక్ మండలం, చిన్నశంకరంపేటలో సంచారం

సీసీ కెమెరాలకు చిక్కిన చిరుతపులి ఆనవాళ్లు.. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు



సీసీ కెమెరాలో రికార్డయిన చిరుతపులి సంచారం

మెదక్ రూరల్: నెలరోజులుగా మెదక్ జిల్లావాసులను చిరుతపులి బెంబేలెత్తిస్తున్నది. ఇటీవల కొద్దిరోజులుగా మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని కాట్రియాల, లక్ష్మాపూర్‌తోపాటు వివిధ గ్రామాల్లో దాడులు చేస్తున్నది. తాజాగా శనివారం చిన్నశంకరంపేట, మెదక్ మండలం ఖాజిపల్లి అటవీప్రాంతంలో దూడపై చిరుత దాడిచేసింది. ఖాజిపల్లి అటవీప్రాంతంలో ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమెరాల పుటేజ్‌లను అధికారులు ఆదివారం పరిశీలించారు. చిరుత దూడపై దాడి చేస్తున్న దృశ్యం, సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. చిరుత సంచరిస్తున్నదని తెలుసుకున్న మెదక్ మండలం ఖాజిపల్లి, చిన్నశంకరంపేట గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు రామాయంపేట, మెదక్, చిన్నశంకరంపేట మండలాల్లోని అటవీప్రాంతంలో 14 సీసీటీవీ కెమెరాలు, ఏడు బోన్లను ఏర్పాటుచేశారు. చిరుత దాడిలో ఆస్తినష్టం జరిగిన రైతులకు అధికారులు రూ.95 వేల నష్టపరిహారం అందించారు.



మంత్రి కేటీఆర్‌కు విజయ్‌భాస్కర్ చేసిన ట్వీట్



సీఎంఆర్ఎఫ్ నుంచి 2 లక్షలు విడుదల చేస్తూ పంపిన లెటర్



చికిత్స పొందుతున్న వంశీకృష్ణ

మంత్రి కేటీఆర్ దాతృత్వం

- ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి చికిత్సకు సాయం
- ట్విట్టర్‌లో విజ్ఞప్తికి స్పందించి, సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.రెండు లక్షలు విడుదల

దుండిగల్, నమస్తే తెలంగాణ: ఆపదలో ఉన్నదెవరైనా ఆదుకోవడంలో ముందుంటానని ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు మరోసారి రుజువుచేశారు. ట్విట్టర్‌లో చేసిన విజ్ఞప్తికి స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.రెండు లక్షలు విడుదల చేయించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థి వైద్యచికిత్సలకు సాయం అందించి బాసటగా నిలిచారు. వరంగల్ జిల్లా కాజీపేట పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన కుమారస్వామి కొడుకు వంశీకృష్ణ హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్‌లోని శ్రీనిధి కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 15న వంశీకృష్ణ తన స్నేహితుడ్ని బస్టాండ్ వద్ద వదిలి బైక్‌పై హాస్టల్‌కు వెళ్తుండగా బస్సు ఢీకొట్టింది. వంశీకృష్ణకు తీవ్రగాయాలు కావడంతో నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం కాళ్లు, చేతులకు చికిత్స కోసం రూ.ఐదు లక్షల వరకు ఖర్చయింది. రెగ్జిన్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న కుమారస్వామికి వైద్యఖర్చులు భారంగా మారాయి. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ బ్లడ్‌డోనర్స్ గ్రూప్‌లో షేర్ చేశారు. అందులో సభ్యుడిగా ఉన్న బాలరక్షక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీ విజయభాస్కర్ ఈ విషయాన్ని 17వ తేదీన మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. వంశీకృష్ణ చికిత్సకు సాయమందించాలని కోరారు. వెంటనే స్పందించిన కేటీఆర్ ఆదుకుంటామని భరోసానిచ్చారు. చికిత్స కోసం రూ.రెండు లక్షలు కేటాయిస్తూ ఈ నెల 23న లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) విడుదల చేశారు. క్షతగాత్రుడికి సాయం అందించడంపై మంత్రికి విజయభాస్కర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ ఒకరి ప్రాణాలు కాపాడేందుకు తానుచేసిన విజ్ఞప్తికి స్పందించిన ఆయన రూ.ఐదు లక్షలు విడుదలచేశారని చెప్పారు. మూడునెలల తర్వాత వంశీకృష్ణకు బ్రెయిన్ సర్జరీ చేయాల్సి ఉంటుందని, మరో రూ.ఏడు లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పినట్టు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. బ్రెయిన్ సర్జరీ కోసం ప్రభుత్వంతోపాటు దాతలు ఆర్థికసాయం అందించాలని విజయభాస్కర్ కోరారు. వివరాలకు 9640016992 (విజయభాస్కర్), 7386675928 (వంశీకృష్ణ సోదరి సంధ్య) సంప్రదించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.



ఆదివారం స్వామివారి ఎదుర్కోలులో రామయ్య, సీతమ్మకు దండలు మార్చుతున్న అర్చకులు



ఎదుర్కోలులో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



విద్యుద్దీపాల వెలుగులో మిరుమిట్లు గొలుపుతున్న భద్రాచల రామాలయం

నేడు భద్రాద్రిలో రాములోరి కల్యాణం

- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు
- హాజరుకానున్న పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- రేపు శ్రీరామ పట్టాభిషేకం

భద్రాచలం, నమస్తే తెలంగాణ:

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాచలక్షేత్రంలో సోమవారం శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు వివాహ వేడుక జరుగనున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసింది. కల్యాణాన్ని పురస్కరించుకొని మిథిలా స్టేడియం ప్రాంగణంలో చలువ పందిళ్లను సిద్ధం చేసి చాందినీ వస్త్రాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. మండపం ఆవరణను సెక్టార్లుగా విభజించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో భద్రాద్రి సందడిగా మారింది. రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణతో రామాలయ పరిసరాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేయనున్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు హాజరుకానున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మిథిలా ప్రాంగణంలో శ్రీరామపట్టాభిషేకం నిర్వహించనున్నారు. సీతారాముల ఉత్సవమూర్తులను ఆలయంనుంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి మహాపట్టాభిషేకం జరుపుతారు.

కన్నుల పండువగా రామయ్య ఎదుర్కోలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి ఎదుర్కోలు నిర్వహించారు. వరుడు బంధువులతో వచ్చే సమయంలో పొలిమేర నుంచి కన్యాదాత స్వాగతం పలికే వేడుకే ఎదుర్కోలు. ప్రధాన కల్యాణమూర్తులు గిరి ప్రదర్శనగా వైకుంఠమండపానికి వేంచేశారు. మండపం వేదికపై సీతారాములను ఉంచారు. సోమవారం జరిగే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి సంబంధించిన శుభలేఖను వేద పండితులు చదివి భక్తులకు వినిపించారు. స్వామివారికి వస్త్ర సమర్పణ కాగానే అందరిపై గులాల్ చల్లారు. అనంతరం స్వామివారు తిరువీధిసేవకు బయలుదేరారు. సీతారాముల గుణగణాలను, ఇరువంశాల విశిష్టతను పండితులు వివరించారు.

రాముడ్ని దర్శించుకున్న సీఎం కేసీఆర్ మనుమడు హిమాన్షు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారిని సీఎం కేసీఆర్ మనుమడు, కేటీఆర్ తనయుడు హిమాన్షు, బంధువులు తదితరులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముడ్ని దర్శించుకున్న వారిలో దేవాదాయశాఖ కమిషనర్, ఐజీ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



రాములవారి సన్నిధిలో సీఎం కేసీఆర్ మనుమడు హిమాన్షు



ఆదివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు తన కుమారుడు పునీత్‌రెడ్డి వివాహ ఆహ్వానపత్రికను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు. చిత్రంలో సీఎం సతీమణి శోభ కూడా ఉన్నారు.



సీతారాముల కల్యాణం సందర్భంగా జనసంద్రంగా మారిన రాజన్న ఆలయం



రాజన్న సన్నిధిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజన్న సన్నిధిలో వైభవంగా లగ్గం

- వేదమంత్రాలతో మార్మోగిన ఆలయ పరిసరాలు
- రామయ్య కల్యాణాన్ని తిలకించిన రెండున్నర లక్షల మందికిపైగా భక్తులు

వేములవాడ కల్చరల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రం అభిజిత్ లగ్న సుముహూర్తాన వేదమంత్రాల సాక్షిగా, అశేష భక్తజనం నడుమ స్వామివారి వివాహ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం సీతారామచంద్రస్వామివారి ఆలయంలో ఉత్సవమూర్తులకు అభిషేకం అనంతరం పల్లకీలో ఉత్సవమూర్తులను కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. ఆలయ ఈవో దూస రాజేశ్వర్ దంపతులు, నగరపంచాయతీ తరపున చైర్‌పర్సన్ నామాల ఉమా లక్ష్మీరాజం, వైస్‌చైర్మన్ ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు గోపన్నగారి శంకరయ్య, చంద్రగిరి శరత్, అప్పాల భీమాశంకర్, గణేశ్, రాజాచంద్ర, వేదపండితులు, అర్చకులు స్వామివారి కల్యాణతంతు నిర్వహించారు. కన్యాదాతగా మరంగంటి గిరిధరాచార్యులు, మాధవి దంపతులు వ్యవహరించారు. 12 గంట 35 నిమిషాలకు కర్కాటక లఘ్నంలో జీలకర్ర, బెల్లం పెట్టించి మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు పోయడం వంటి కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగాయి. వేలాదిమంది శివపార్వతులు దేవుని లగ్గాన్ని తమ లగ్గంగా భావించి వారు కూడా జీలకర్ర, బెల్లాన్ని తమ తలలపై ఉంచుకుని తలంబ్రాలు పోసుకున్నారు. జోగినులు శ్యామల, వైష్ణవి సైతం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వేములవాడ క్షేత్రం జనసంద్రమైంది. దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.



వేములవాడలో సీతారాముల వారి రథయాత్రలో పాల్గొన్న భక్తులు

నేత్రపర్వంగా రథయాత్ర


కల్యాణ మహోత్సవం తరువాత సీతారామచంద్రస్వామి వార్లు ఆదివారం సాయంత్రం రథంపై విహారం చేశారు. వధూవరులైన శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి రథంపై అధిరోహించారు. అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య రథోత్సవం రమణీయంగా సాగింది. ఆలయ స్థానాచార్యులు గోపన్నగారి శంకరయ్య, ఈవో దూస రాజేశ్వర్ ఆధ్వర్యంలో రథానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దారిపొడుగునా హిజ్రాలు నృత్యాలు చేశారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



యాదాద్రిలో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవంలో తలంబ్రాలు సమర్పిస్తున్న అర్చకుడు

యాదాద్రిలో ఘనంగా సీతారామచంద్రస్వామి కల్యాణం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాదాద్రిలో సీతారామచంద్రస్వామి కల్యాణమహోత్సవాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆలయ ఈవో గీత.. సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. శివాలయ ఉప ప్రధానార్చకులు గౌరీభట్ల నర్సింహరాములశర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణతంతు నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.



నా జీవితాన్ని నా నవలలకు ముడిసరుకుగా చూస్తాను.
అది నన్ను సంకోచాల నుంచి విముక్తి చేస్తుంది.

ఇమ్రె కెర్టీస్

కలల షహనాయీ...

దున్నిన నల్లరేగడి నేలలా నిండారా కప్పుకొన్న
బురఖా
ముత్యం పొదిగిన ఉంగరం
బంధించడంలోనూ మహానైపుణ్యం
నేను ఏమీ పట్టని చెక్కుడు పువ్వులా....
చిత్రంగా అందించిన అతని ఫొటో జిరాక్స్ కాపీ
గుండె పొరపై వేసుకొంటూ...
గల్లాలో నాణెంలా పదిల పరచుకొంటూ...
కొబ్బరి ఈనెల సితార్ వాదం మ్రోగుతూంటుంది...
చురుకు కలలు షెహనాయిల కూనిరాగాలు
తీస్తాయి.
ఆదుర్దాగా అలమారులో దొరికిన
నారొక్కా(శుభలేఖ)
ఏడు సముద్రాల కావల రాకుమారుడిని నిర్ణయిస్తూ
అపరిచయమైన పేరుతో నన్ను జతపరిచి
చిన్నప్పటి కాల్పనిక కథలా మలుపు తిరుగుతూ
నాది కాని నా జీవితం
జలీల నీడ మొఖం మీద కదులుతున్నట్లుగా నేను.
బ్రహ్మజెముడు మీద కప్పిన చున్నీలా పీలికలుగా
చీలికలు హృదయం
కాటుక చారికతో ఫొటో తాలూకు జ్ఞాపకం
జార్చుకొంటూ..
ఎన్నిమైలు రాళ్ళు దాటితే అంత అదృష్టం అట
చేతికి పెడుతున్న మెహెందీ మెలికలుగా ఆలోచనలు
ఎటూ తేలనీయవు
మారే మీ నిర్ణయానికి కళ్ళు విడువని నాపసితనానికీ
సౌదా కదరకపోయినా..
ఆమూసలోనే అలవాటుగా బురఖా
సరిచేసుకొంటూ...

–సిహెచ్.ఉషారాణి, 9441228142

'ఖాళీ' ఫ్లవర్

మనిషే.. కాదు
మట్టీ.. చెవిలో
పువ్వు పెడుతుందంటే నమ్మలేదు
ఇంట్లోని ఖాళీ కడుపుల్లో
కాసిన్ని మెతుకులు వేద్దామని
లోకులు కూడా పూలనే ఇష్టపడుతారని
కాలీ ఫ్లవర్లు నాటాను
అది ఒట్టి కాగితపు పువ్వై
దళారి ముందు బోర్లాపడింది
మల్లెలు వేసినా బావుండును
రమణుల జడ కుచ్చుల్లో
కాసేపు మురిసి పరిమళం పంచేవాడ్ని
రాజ్యపు గారడీలో పంటలన్నీ
ముఖం వేలాడేస్తున్నాయి
ఇక మిగిలింది



నన్ను నేను మట్టిలో నాటుకోవడమే
మరుజన్మలోనైనా
ఖడ్గమై మొలిస్తే బావుండు
పంటను పెంటగా చూసే వాడి
తలను తుత్తునియలు చేయడానికి...

– డాక్టర్ వెల్దండి శ్రీధర్, 9866977741

శిఖా.. సఖా.. కవి చతుర్ముఖా..!

ఆకాశమంత పసి పిల్లాడు. సముద్రమంత పిచ్చివాడు. మనుషుల్లో మనిషిని వెదుక్కుంటున్న వెర్రిబాగుల దేవుడులాంటోడు. ఒరే శిఖా అంటాను. ఏరా ప్రమూ అంటాడు. ఎప్పుడో విశాఖలో యూనివర్సిటీలో చదువులు.. కడలి తీరంలో వయసు పరుగుల సంరంభంలో నన్ను తుఫానులా చుట్టుముట్టాడు. ఇప్పటికీ నా తీరం దాట లేదు.ఇప్పుడు కొత్తగా శిఖామణిని తూచే సాహసం నాకెందుకు? ఈ పరీక్ష పెట్టింది మాత్రం వాడే. పైగా ఒక్కపూటలో రాసివ్వాలని ఆదేశం కూడా. నా కంటె ముందే ఎం.ఏ.లో చేరాడు. నా కంటె ముందే పుస్తకాలు ప్రచురించాడు. కవిత్వంలోనూ నా కంటె ముందే వున్నాడు. ఎంతైనా సీనియర్ కదా. నీ కవిత్వం మీద నేను రాయడం ఏమిట్రా అన్నాను. నువ్వు రాస్తే అందులో ఆత్మీయత వుంటుందిరా రాయి అన్నాడు. ఆ మాట వింటే శరీరమంతా నీరైపోయింది. తుడుచుకుంటే పోయే కన్నీరా ఇది? అతని తడియారని కవిత్వమూ అతని దోర దోర దోస్తానా ఇచ్చిన కానుక కదా. మూడున్నర దశాబ్దాల స్నేహం. అప్పుడెప్పుడో మువ్వల చేతికర్ర పట్టుకుని వాడు తెలుగు లోకాన్ని ఆటలాడించిన రోజుల్లో నేను కూడా శిఖామణితో పాటే ఆ సంబరాల్లో పాల్గొన్నాను.శిఖామణితోనే కాదు వాడి నీడతోనూ కలిసి పంచుకున్న కాలాతీత కవిత్వ కాలక్షేపాల నిధి నిక్షేపాలు నాకెన్నో వున్నాయి. నిలువెల్లా కవి కావడం, మనసంతా బంగారం కావడం వల్ల శిఖామణిపట్టిందల్లా కవిత్వమైంది.

'ఒంటరిగా వున్నా సమూహంలో వున్నా
మెలకువనైనాని ద్రనైనా
కవిత్వం నా చిటికెన వేలు పట్టుకుని
నన్నున డిపిస్తున్నప్పుడు
నేను కవిలా వుంటాను..' (ఎలా వుంటాను)

కొంతమంది కవిత్వం కోసమే పుడతారు. కవిత్వం కోసమే బతుకుతారు. పోరాటమైనా ఆరాటమైనా కవిత్వం కోసమే. మిగిలిన జీవితమంతా సైడు బిజినెస్సే. శిఖామణి చేత్తో జుట్టును వేగంగా వెనక్కి కొడుతూ, కళ్ళజోడు వేగంగా తీసి మళ్లీ అంతే వేగంగా పెట్టుకుంటూ, వేగంగా మూతి తుడుచుకుని అంతే వేగంగా లాల్చీ కాలర్ కొంచెం వెనక్కీ కొంచెం ముందుకీ లాగుతూ ఏదైనా కవిత చదివినప్పుడు వాడిలో భలే పొగరు కనిపిస్తుంది.వీడు ఇందుకోసమే పుట్టాడురాఅనిపిస్తుంది.ఆ మాత్రం పొగరు కవికి అలంకారమేమ రి.


బలమైన కవి సృజించిన కవిత్వంలోకి దిగినప్పుడు మనలో చాలా కోరికలు పుడతాయి. ఒక కవి స్నేహితుల మీద రాసిన కవిత్వం చదివినప్పుడు ఎవరిలోనైనా అతనితో దోస్తీ కట్టాలన్న కాంక్ష చెలరేగాలి.అతను పసిపిల్లల మీద రాసిన పద్యాలు చూసినప్పుడు మనం చిట్టి తల్లులమైపోయి, ఆ కవి కళ్ళను చేతుల్లా చాపి ఎక్కడ నిల్చుంటాడో తెలుసుకుని అక్కడ వాలిపోవాలని కలలు గనాలి. పిట్టల మీదో చెట్టుల మీదో పువ్వుల మీదో అతడు రంగులద్దిన అక్షరాల హరి విల్లులు చూసినప్పుడు మనలో కొమ్మలు పొడవాలి. రేకులో రెక్కలో విచ్చుకోవాలి.కురిసినప్పుడు కాదు. కురవకుండా తడిపేదే వర్షం. చదివినప్పుడు కాదు. నిశ్చల తటాకంలా మనమేదో యోగముద్రలో వున్నప్పుడు మనలోపల సన్నగా మొదలై నిలువెల్లా ఆవహించి కుదిపేసేదే కవిత్వం. ఇన్ని సంవత్సరాలుగా తెలుగు కవిత్వ ప్రేమికులకు శిఖామణి మిగిల్చిన అనుభూతులుఇ వే.

'అభ్యంగన స్నానానంతరం
సాంబ్రాణి ధూప మేఘాల మీద తేలియాడి
మైమరచిని ద్రిస్తున్న చిన్నారి
బంగినపల్లి మామిడి చివరి వొంపులాంటి
చుబుకాన్నిచు ంబిస్తున్న
తల్లి తన్మయత్వపు వివశత్వంలా వుండాలి..' (కవితానుభవం)

కవిత్వానుభవం ఇలా ఉండాలని తానే నిర్దేశిస్తున్న శిఖామణి ఈ తాజా కవితల సంపుటితో మనకెలాంటి అనుభవాన్ని ఇస్తున్నాడు? ఆ చూపుతో నేనీ కవితల్ని చదివాను. దాదాపు అన్నీ పత్రికల్లో ఇంతకు ముందు చూసినవే. అతని నోట విన్నవే. కాని ఒక చోట ఆ కవితల్ని గుది గుచ్చినప్పుడు అతను విస్తరించిన తీరు.. తనను తాను సానబెట్టుకున్న వైచిత్రి.. అతని నుండి వీచిన సరికొత్త గుబాళింపులు నన్ను ఆనందపరిచాయి. అబ్బురపరిచాయి.

కవిత్వాన్ని సిమిలీలతోనో మెటఫర్లతోనో కొలిచే రోజులు పోయాయి. పదాల్లోనో వాక్యాల్లోనో రసాన్ని తోడే ప్రయత్నాలకు కాలం చెల్లింది. పద చిత్రాలతోనో భావ చిత్రాలతోనే కట్టిపడేసే కనికట్టు విద్యలకు ఇప్పుడు సమయం కాదు. ఒక కవిత, దాని సంపూర్ణత్వంతో మనల్ని మన నీడ కంటె దగ్గరగా వెన్నంటి నడవాలి. మన కలల్లోకి వచ్చి కూర్చోవాలి. మన కను రెప్పల మీద వాలాలి. మన తలపోతల సంధ్యల్లో అరుణ వర్ణ సంద్రమై ఉప్పొంగాలి. కవితలోని అక్షరాలన్నీ గిన్నెలో పోసి మరగ కాసి వడపోస్తే మిగిలే కాస్త కప్పెడు రసమే ఆ ఆనందానుభవం. శిఖామణి ఇంకా మువ్వల చేతికర్రలతోనో, చిలక్కొయ్యలతోనో, పూల కుర్రాళ్ళతోనో, కొయ్యకాళ్ళతోనో, ప్రమిద కింది చీకట్లలాంటి నర్సులతోనో మాట్లాడుతూ ఉన్నాడా మరెటు వైపైనా ప్రయాణిస్తున్నాడా? ఆ దిశగా నా పరిశీలన సాగింది. ప్రతి రోజూ కొత్తగా ఉదయించడం సూర్యుడికి సాధ్యం కాదు. అది కవికే సాధ్యం. తన పూర్వ వైభవాన్ని కాపాడుకుంటూనే కొత్తగా తనను ప్రదర్శించడం ఏ కవికైనా కత్తి మీద సాములాంటిది. ఆ ప్రయత్నంలో విజయం సాధించిన వాడే మొనగాడు. ఫలానా కవిలో ఫలానా కవే ఉంటాడు. ఉండాలి. కాని మొన్నలా నిన్న, నిన్నలా నేడు ఉండకూడదు.అదే సమస్య. అంటే తాను తనలా ఉంటూనే ఉండకూడదు. ఉండకుండానే ఉండాలి. ఇదో భయంకరమైన స్థితి. దీన్ని అర్థం చేసుకొని ఎవరు సాగుతారో వారే సుదీర్ఘ కాలం మనుగడ సాగిస్తారు. లేదంటే అంతే సంగతులు చిత్తగించవలెను.

శిఖామణికి ఈ రహస్యం తెలుసనే అనుకోవడానికి ఈ సంపుటిలో కొన్ని సాక్ష్యాలున్నాయి.



బలమైన కవి సృజించిన కవిత్వంలోకి దిగినప్పుడు మనలో చాలా కోరికలు పుడతాయి. ఒక కవి స్నేహితుల మీద రాసిన కవిత్వం చదివినప్పుడు ఎవరిలోనైనా అతనితో దోస్తీ కట్టాలన్న కాంక్ష చెలరేగాలి.అతను పసిపిల్లల మీద రాసిన పద్యాలు చూసినప్పుడు మనం చిట్టి తల్లులమైపోయి, ఆ కవి కళ్ళను చేతుల్లా చాపి ఎక్కడ నిల్చుంటాడో తెలుసుకుని అక్కడ వాలిపోవాలని కలలు గనాలి. పిట్టల మీదో చెట్టుల మీదో పువ్వుల మీదో అత డు రంగులద్దిన అక్షరాల హరి విల్లులు చూసినప్పుడు మనలో కొమ్మలు పొడవాలి. రేకులో రెక్కలో విచ్చుకోవాలి.కురిసినప్పు డు కాదు. కురవకుండా తడిపేదే వర్షం. చదివినప్పుడు కాదు. నిశ్చల తటాకంలా మనమేదో యోగముద్రలో వున్నప్పుడు మనలోపల సన్నగా మొదలై నిలువెల్లా ఆవహించి కుదిపేసేదే కవిత్వం.

'అప్పుడే భూమ్మీద పడ్డ బిడ్డ కేర్ కేర్ మని ఏడవట్లేదని
తలకిందులుగా వేలాడదీసి వీపు మీద సుతారంగా చరిచినట్టు
మళ్ళీ ఒకసారి కొత్తగా మొదలవ్వాలి..' (బీజాక్షరం)

అదీ సంగతి. కొంచెం కొత్తగా మొదలవ్వాలని.. కొంచెం కొత్తగా చివరవ్వాలని.. కొంచెం కొత్తగా నడిమద్దె నాణ్యం కావాలని.. శిఖామణి కవితలు ఉవ్విళ్ళూరిన వైనం ఇక్కడ చాలా వుంది. చూడండి..

'అప్పుడే స్నానించిన/ పచ్చి పసుపు కొమ్ము ఛాయ
మోము మీద కాసిన్ని/ నీటి బిందువులు సేద తీరుతుండగా
కెంజాయ పూరేకుల్లాంటి/ మూసిన కనురెప్పలను
సీతాకోక చిలుక రెక్కల్లా/ విప్పార పైకెత్తి
చిటికెడు కుంకుమ రజను తీసి
చూపుడు వేలితో భ్రుకుటి మధ్య
గుండ్రంగా దిద్దగా సూర్యోదయం..' (తమోనిలం)

శిఖామణి తనను తాను కొత్తగా డిస్కవర్ చేసుకున్న క్రమానికి సరికొత్త ఉదాహరణ ఈ 'తమోనిలం' అనే కవిత. ఒక సూర్యోదయం..ఒక చంద్రోదయం..ఒక పసిపాప చిట్టి అడుగుల బుడిబుడి తడి సవ్వడి ఈ తమోనిలం.

'సుదూర విరహ విరామం తర్వాత
గొప్ప తమకపు సమాగమానంతరం
ప్రియురాలు విడిచిన దీర్ఘ నిశ్వాసంలా
తమోనిలం..'

డిక్షన్.. డికాక్షన్ లాంటి మాటలు నాకు తెలియవు కాని శిఖామణిలో పాతకొత్తలు కలగలిసిన కొత్త శిఖామణిని చూసాను చాలా కవితల్లో. కాలానికి అనుగుణంగా కవి వేషాలు మార్చుతాడో.. కాలానికే కళ్లజోడు తగిలిస్తాడో.. తేల్చి చెప్పడం కష్టమే. అయితే ఏదో మేజిక్ జరిగి తీరుతుంది. మనకు అనుభవంలో వున్న దృశ్యాలే కొత్త రెక్కలు తొడుక్కుని, కొత్త రంగులు పులుముకుని అలా కదలి వెళ్ళిపోయి, మళ్ళీ కొత్త రెక్కలతో కొత్త రంగులతో ప్రత్యక్షమై కవ్విస్తూ కవిత్వమై మెరుస్తాయి. కళ్ళతో చూసినప్పుడు కాదు, వేళ్ళతో తడిమినప్పుడు హృదయానికి అంటుకునేదే కవిత్వం. శిఖామణి అలా అంటుకుపోతాడు. 'యోగనిద్ర', 'పావురాల భాష', 'ఆకాశ మందారం', 'అప్పుడప్పుడూ', 'దాల్చిన గంధి' లాంటి కవితలు ఫ్రేములు ఫ్రేములుగా మన చుట్టూ గిర్రున తిరుగుతూ వుంటాయి. మనమూ ముక్కలుగా విడిపోయి వాటి చుట్టూ తిరుగడం మొదలవుతుంది. అంతరిక్షంలో గ్రహాల్లాగా అంతరించని మన లోలోపలి మోహాల్లాగా ఇదో మార్మికానుభవం.

'ఉన్న చోటనే వుండి చుట్టూ పరికిస్తే ఏముంది?
భూమి పళ్ళెరం మీద ఆకాశం గాజు గిన్నెను
ఎవరో బోర్లించినట్టే వుంటుంది దాని కింద గాలాడని గాజు ఈగల్లా
నువ్వూ ... నేనూ..'

అందుకే ఎగిరెళ్ళిపోవాలంటాడు కవి

'బంగారు వర్ణపు సన్నని కమ్మచ్చు కిరణాల ఎండ పొడలో
సూర్య స్నానం చేస్తూ ఎగిరెళ్ళి పోవాలి..' (ఎగిరెళ్ళి పోవాలి)

కవి తనకోసం తాను రాసుకుంటాడు. పాఠకుడు కవిలో తనను చూసుకుంటాడు. ఈ చర్విత చర్వణ పునరపి పునరపి జీవన గమనం ఉన్నట్టుండి గడ్డ కట్టుకుపోయినట్టుగా తోస్తుంది. నదులన్నీ గాజు నదుల్లా.. పిట్టలూ చెట్టులూ కుక్కపిల్లలూ అన్నీ బొమ్మల్లా గోచరిస్తాయి. అసలు మనిషికి తనకు తానే ఒక నీడలా అనిపిస్తుంది. అప్పుడే ఎగిరెళ్ళిపోవాలని కూడా అనిపిస్తుంది. వాస్తవానికి ఈ ఎగిరెళ్ళిపోవడం వాస్తవంలోంచి ఎగిరి పోవడం కాదు. వాస్తవంలో లేని సౌందర్యంలోకి ఎగిరిపోవడం. నిజంలోంచి స్వప్నంలోకి గంతులేయడం. ఇది కవికే సాధ్యం. అనంత మానవ వేదన పునాదిగా సాగిన శోధనలోంచి జనించిన తాత్త్విక గాఢత ఇది.అందుకే కవిని కౌగలించుకోవడం అంటే మానవ గోళాన్ని పలుమార్లు చుట్టి రావడమే నాదృష్టిలో. **ఎగిరెళ్ళిపోవాలి** వంటి కవితలు మరికొన్ని వున్నాయి.'ఏం పట్టుకెళ్తాం ఎవరైనా','చోటు','చిన్ని చిన్ని కానుకలు' మొదలైనవి.

శిఖామణిలో ప్రాణ లక్షణం ఏంటంటే విస్తారమైన కాన్వాసు మీద చిత్రించాల్సిన వస్తువుల్ని ఒక చిన్ని కవితలో విజువలైజ్ చేయడం. 'రొట్టెలాంటి మనిషి' కవితను తీసుకోండి. శివారెడ్డి కవిత్వమూ వ్యక్తిత్వమూ మాత్రమే కాదు అతని జీవన బాధల గాధల అగాథాలతో పరిచయమున్న వారికి ఈకవిత ఒక అద్భుతమైన నవలలా కనిపిస్తుంది.

'మూడు వేళ్ళకే /మృదువుగా చిదుము పడే
రొట్టెలాంటి అతణ్ణి/ ఇంటిల్లిపాది
తలా ఒక తుంపు తుంచుకుంటారు..' (రొట్టెలాంటి మనిషి)

సంసార బంధాలు.. ప్రాపంచిక బంధాలు.. కవిత్వ బంధాలు.. ఇలా అనేక బంధాల ద్వారబంధాలకు వేళ్ళాడుతూ ఎవరెంత తుంచుకున్నా అంతే పరిపూర్ణమవుతూ మిరమిరలాడే ఫీనిక్స్ రొట్టె అది. స్నేహితుడి కూతుర్ని చూస్తే కవికి ఆ పిల్లలో స్నేహితుడి తండ్రి కనిపించాడు. **'అప్పుడే అణగు తట్ట దిగిన తల్లి కోడి/ పిల్లల్ని వెంటేసుకు తిరుగుతున్నప్పుడు/ ఈ పిల్ల పసుపు పచ్చని టెన్నిస్ బంతిలా/ కోళ్ళ గుంపులో ఎలా కలిసిపోయింది?/ తాతయ్యకు ఇష్టమైన బెల్లప్పొంగలి వండినప్పుడు/ బారులు తీరిన చీమల బారులో/ తనూ ఒక ఎర్ర చీమై ఎలా కదలబారింది..'?** అని తనలో తనే తర్జనభర్జన పడతాడు. తాతయ్యే పిల్లలా తిరుగుతున్నాడేమో అని నమ్మకంగా ప్రకటించిన తీరు చదివి అనుభవించాల్సిందే. ప్రాణహంస అని తన పోలీసు మిత్రుడు చనిపోయినప్పుడు రాసిన కవిత కూడా ఇలాంటిదే. పుట్టినూళ్లో ఒక కుక్కలా పుట్టినా నువ్వు జ్ఞాపకాని కొచ్చినప్పుడల్లా శ్మశానానికెళ్లి నీ సమాధి చుట్టూ మూచ్చూ స్తూ ముమ్మార్లు తిరిగి తలవాలు దగ్గర ముడుచుకు పడుకునే వాడినని అంటాడు. అప్పుడు మనం ముందరి కాళ్ళను ముం దుకు చాపి వాటిమీద తల ఏటవాలుగా ఆన్చి తనివితీరా పడుకునే కుక్క పిల్లలమైపోతాం. తాను రాస్తున్న వ్యక్తిని ముట్టుకుంటే పగిలిపోయేంత మెత్తగా చెక్కుతాడు. పనిమంతుడు.. ప్రతిభావంతుడూ కదా శిఖామణికి ఇది అలవోకగా అబ్బిన విద్యే.

శిఖామణి కవితలే కాదు, ఆ కవితల శీర్షికలు కూడా శిఖామణి మాట్లాడుతున్నట్టే వుంటాయి.అమ్మను అడిగానని చెప్పు, ఒక మాట చెప్పి వెళ్ళు , అన్నలేని ఇంటికి, ఏం పట్టుకెళ్తాం ఎవరైనా.. ఇలా చాలా చెప్పొచ్చు. శిఖామణి ఎలిజీ రాశాడంటే ఇక మనల్ని మాయంచేసి మరో శరీరంలో పరకాయ ప్రవేశం చేయించేస్తాడు. బెజ్జంగి ఎన్‌కౌంటర్ మృతుల మీద రాసిన కవిత **'ఒక మాట చెప్పి వెళ్ళు'** చదివితే ఏ అడవిలోనో అనాథ శవంలా మన దేహాలు పడివున్నట్టు మనల్ని మనమే అన్వేషించుకుంటూ పోతాం. **'పగలు లక్షల ఆకులతో/ రాత్రి అనంతానంత చుక్కల కన్నులతో/నువ్వు నడిచి వెళ్ళిన కాలిబాట వైపే/ ఎదురు చూస్తుంటాను /వాగ్దాన ఫలాల్ని మోసుకొస్తూ/ తిరిగొచ్చే నీ మెత్తని అడుగుల సవ్వడి కోసం..'** వెళ్ళిపోయిన వాళ్ళు తిరిగి రారు. కాని కలల మంటల్లో కాలిపోయిన వాళ్ళు వస్తారు. మరొక సారి మరొకరిలా వస్తారు. మంటల్ని మాలలుగా ధరించి వస్తారు. ఈ సారి పండిన కలల పళ్ళు తీసుకొస్తారు. ఆ ఆశనే మిగిలిస్తూ కవిత ముగించడం అద్భుతం. మనుషులు మాయమైపోతున్న తన ఊరు మీద రాసిన 'మనిషి లేని ఊరు' కవిత కూడా ఇలాంటిదే. **'దారి పొడవునా /ఎదురైన ప్రతి మనిషినీ /కుశలమడిగి వెళ్ళేసరికి /బారెడు పొద్దెక్కేది/ ఇప్పుడు కుశలమడగడానికి మనుషులేరి..?'** కన్నీళ్ళు పెడుతున్న పల్లెలు గోరటెంకన్నలా గొంతెత్తినట్టు ప్రతి కవీ ఎప్పుడో అప్పుడు తన ఊరిని చూసి ఇలా గొంతులోంచి కన్నీళ్ళు కక్కుకోవలసిందే. శిఖామణిలో శిఖామణే వుంటాడు అనడానికి ఇలాంటి కవితలెన్నో దోసిళ్ళతో పట్టి చూపొచ్చు. ఈ మొత్తం కవితలు చదివాక తానే ఒక కవితలో అన్నట్టు...

'ఏటవాలు ఎదురు వానజల్లుకు / మట్టితో కట్టిన మదురు గోడ
తడిసి కాసింత మెత్తబడ్డట్టు / మనసు మెత్తబడింది..'
(ఎగిరెళ్ళిపోవాలి)

ఎప్పుడైనా నా కవిత ఏదైనా చూసినప్పుడు ఫోన్ చేసి ఏరా ప్రమూ కవిత్వం ఎలా రాయాల్రా అని అడుగుతాడు. వాడి కవిత చదివినప్పుడు నేను కూడా ఒరే శిఖా విశాఖలో కొండలు పట్టుకుని.. సిగరెట్లు పట్టుకుని.. సముద్రం పట్టుకు తిరగడం నేర్పావు కాని, ఎప్పుడైనా కవిత్వం ఇలా రాయల్రా అని నేర్పావా? అని అడుగుతాను. ఒరె ఒరే ప్రమూ దొంగా అని ఒకటే మురిసిపోతాడు. పిచ్చోడు.. పసోడు..అని ముందే చెప్పాను కదా. అమ్మలేనోడు అని వాడి మీద ఎప్పుడో ఒక కవిత రాశాను. కనపడ్డ పసిపాపనల్లా వాటేసుకుని పద్యాల పాలకోవాలు తినిపిస్తావు. ఎప్పుడు చూసినా తిరునాళ్ళలో దారి తప్పి అమ్మ కోసం వెదుకుతున్న పిల్లాడల్లే కనిపిస్తావు. మా మధ్య కూర్చుని నువ్వు కవిత్వం కట్టలు విప్పుతుంటే అమ్మ కోసం అంజనం వేస్తున్నట్టే అనిపిస్తుంది. పుడుతూనే అమ్మను పోగొట్టుకున్న ఈ కవిని కవిత్వమే అమ్మయి సాకింది.అందుకే వాడిని చూస్తే నాకెప్పుడూ ఇంతే గారాబం. ఇంతే ప్రేమ. పిల్లల మీద శిఖామణి చూపించే మమకారం.. పెద్దల పట్లా.. సాటి కవులూ రచయితల పట్లా అతని స్నేహ సంబంధాలు అతణ్ణి కవిగానూ వ్యక్తిగానూ కొంచెం ఎత్తుగానే నిలబెట్టాయి. కవికి రిటైర్ మెంట్ లేదని సభలూ సమావేశాలూ పత్రికల నిర్వహణా ఇత్యాది కార్యక్రమాలతో తనను తాను నిత్యనూతనం చేసుకుంటున్న శిఖామణి, కవిత్వంమీద ఎంత శ్రద్ధపెడతాడో అంతేశ్రద్ధ ఆరోగ్యం మీద కూడా పెడతాడని ఆశిస్తూ హెచ్చరిస్తూ అభినందిస్తున్నాను.

'ఏం పట్టుకెళ్తాం ఎవరైనా
మూసిన రెండు గుప్పిళ్ళ శూన్యాన్ని తప్ప..'

నిజమేనా శిఖా? ఇంత మంచి కవిత్వం చదువుకున్నాక గుప్పిళ్ళ నిండా కవిత్వం వుంటుంది కాని శూన్యం ఎందుకుంటుంది? అందుకే నువ్వు ఒకటి కాదు రెండు షష్టి పూర్తులు చేసుకోవాలి. మరిన్ని గుండెల గుప్పిళ్ళు నింపడానికి. ఓకే నా సఖా..?

– డాక్టర్ ప్రసాదమూర్తి, 84998 66699
('ఒక మాట చెప్పి వెళ్ళు' కవితా సంపుటి ముందుమాట నుంచి..)

భద్రాద్రి రామయ్య

సీ.
భూలోక మెల్లను పాలించు చుంటివి
భద్రాద్రి నుండియు భద్రముగను
ముత్యాల తలబ్రాలు పుడమికూతురుపైన
కోట్లభక్తుల మ్రోల కూర్మి బోసి
సోదర ప్రేమను చూపించు చుంటివి
అవనిలో మిన్నగ ననుగు మీర
కీర్తనల్ సేయనా కృష్ణముగ్ధుడవైతి
గోపన్న పాటకు గోము మీరు
ఆ.వె.
రామ రామ యనుచు రామజపము సేయ
నిష్ఠతోడ నరులు నియమ మొప్ప
తెలుగు నేలపైన వెలసితి రామయ్య
సీత గూడి భువిని సిరులు గురియ
ఆ.వె
ధనము లిచ్చి నీవు తానీష ప్రభువుకు
రామదాసు బ్రోవ ప్రథితి కలిగె
రాజ్యపాలనంబు రంజిల్లగను సేయ
రామరాజ్యమన్న రంతు గలిగె .

– డాక్టర్ గుడేలి శీను, 9959954848



ఉరుకులాట!

ఉదయం లేచింది మొదలు
రాత్రి నిద్రపోయేదాక
ఉరుకులాట–ఒకటే ఉరుకులాట!
పెందలకడనే పశుపక్ష్యాదులకూ
మేత కోసం వెతుకులాట!
అందరికీ బ్రతుకుతెరువు తండ్లాట!
ఉదయం పూట ఉరుకులాట
పక్కవాడు పడిపోయినా
జనారణ్య నగరంలో
కారుణ్య రహితంగా
కాలం వెంట పరుగులు
ధన సంపాదనకై
దానవత్వంగా దండిబాట!
పనుల తొందర్లో
మమతల చిందర వందర్లో
పట్నం బాట!
ప్రతిరోజూ ఉరుకులాట
బతుకే ఒక వెతుకులాట..!!

– డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, 92465 41699

స్ఫూర్తి పురస్కారాలు

ద్వానా శాస్త్రి సప్తతి సందర్భంగా సాహిత్య విమర్శ గ్రంథాలకు స్ఫూర్తి పురస్కారాలు ఇవ్వాలని నిశ్చయించాము. ఔత్సాహికులైన సాహితీ విమర్శకులు 2016,17,18 సంవత్స రాల్లో ముద్రితమైన తమ గ్రంథాలను రెండు ప్రతుల చొప్పున పంపాలి. విమర్శ గ్రంథాలు ఏ ప్రక్రియకు సంబంధించినవైనా కనీసం 200 పేజీల వరకు ఉండాలి. రచనలు పంపాల్సిన చిరునామా: డి.శశికాంత్,1–1–428, ఆర్చీస్ నెస్ట్, గాంధీనగర్, హైదరాబాద్–500080.

– కిన్నెర రఘురామ్

కొత్త పుస్తకాలు




ఉయ్యాలా జంపాలా (బుజ్జి పాటలు)

పిల్లల కోసం రచనలు చేయటం చాలా కష్టం. ముఖ్యంగా పద్యాలు మరింత కష్టం. అలాంటి కష్టమైన, క్లిష్టమైన పనిని ఇష్టంగా తలకెత్తుకుని బాలసాహిత్యమే జీవితంగా సాగిపోతున్న వాడు గంగదేవు యాదయ్య. పిల్లలకు పాటలతో అక్షరాభ్యాసం చేస్తూ ప్రాథమికవిద్యలో విప్లవాత్మక మార్పులకు అంకురార్పణ చేసిన వాడు, చేస్తున్నవాడు యాదయ్య. ఆయన భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని కోయ పిల్లలకు చదువు చెప్పే క్రమంలో రూపుకట్టుకున్నవే ఈ 'ఉయ్యాలా.. జంపాలా' పాటలు.

రచన: గంగదేవు యాదయ్య వెల: రూ. 144, ప్రతులకు: జీవని పబ్లికేషన్స్, 21 అరుణ ఎన్‌క్లేవ్, తిరుమలగిరి, సికింద్రాబాద్–15. ఫోన్: 90591 12105

మక్సీమ్ గోర్కీ సాహిత్య వ్యాసాలు



మక్సీమ్ గోర్కీ కలం పేరుతో ప్రసిద్ధుడైన అలెక్సేయ్ మక్సీమెవిచ్ పేష్కోవ్ కళాత్మక వారసత్వం అపారమైనది. ఆయన రష్యన్ సాహిత్యపు అభివృద్ధిమీద గణనీయమైన తన సొంత ముద్ర వేశారు. ప్రపంచ సాహిత్యాన్ని కూడా అదే స్థాయిలో ప్రభావితం చేశాడు. గోర్కీ సృజనాత్మక కృషిని రష్యన్ జీవితపు విజ్ఞాన సర్వస్వం అనడంలో అతిశయోక్తి లేదు. తన కళాత్మక సాధన సంపత్తి ద్వారా రష్యన్ సమాజాన్ని, మొత్తం ప్రపంచాన్నీ ఆయన రచనలు ఆశ్చర్యచకితం చేశాయి.

రచన:మక్సీమ్ గోర్కీ, వెల: రూ.190
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్ బండ్లగూడ, జీఎస్ఐ పోస్టు, హైదరాబాద్–68, ఫోన్: 24224453

రుద్రమదేవి మరణంపై వివాదమేల?

చరిత్రను నిర్మించడానికి ప్రాథమిక ఆధారాలు లిఖిత ఆధారాలు, వస్త్వాధారాలు. చరిత్ర పరిశోధకులు ఈ ఆధారాలను గురించి వ్యాఖ్యానించేటప్పుడు సత్యాన్ని ప్రకటించడంలో స్వీయ ఆలోచనాధోరణులు చరిత్రకు నష్టం కలిగిస్తుంటాయన్నది సత్యం. ఉన్నదున్నట్టుగా చెబుతున్నామంటూనే చరిత్రకారులు విపరీత వ్యాఖ్యానాలు చేయడం చరిత్ర చేసుకున్న దౌర్భాగ్యం.

కాకతి రుద్రమదేవి మరణాన్ని తెలుపుతున్న ఏకైక ఆధారం చందుపట్ల శాసనం. ఈ శాసనంలో 'రుద్రమహాదేవి దేవలోకానకు విచ్చేస్తేని శివలోక ప్రాప్తిగాను, మల్లికార్జునాయునింగారికి శివలోక ప్రాప్తిగాను వారి భృత్యులు పువుముంమడిగారు శా.శ.1211విరోధి సం. మార్గశిర శు. ద్వాదశి (క్రీ.శ.1289 నవంబరు 27) రోజున చంద్రుపట్ల సోమనాథదేవరకు, సాగి ఓగిరానకు రాసముద్రము వెనుక వ్రిత్తిగా భూమిని కొంత యిచ్చాడ'ని వుంది.

ఇందులో విచ్చేస్తేని అనే మాట మర్యాదపూర్వకపదం. మహారాణి రుద్రమకు ఆ మాట వాడి మల్లికార్జునునికి ఆ మాట వాడకపోవడం రాచమర్యాదే తప్ప ఇంకొకటి కాదు. ఈ మాటకు విపరీతార్థం తీసి వ్యాకరణ పరిభాషలో అర్థంచెప్పి విచ్చేస్తేని అన్నది అసమాపక క్రియ కనుక రుద్రమదేవి మరణించి స్వర్గానికి వస్తే శివలోకప్రాప్తి జరుగాలని పువు ముంమడి కోరుకున్నాడా? 1295లో చనిపోయే రాణిరుద్రమదేవి చావుకు ముందుగానే వారి పేరుమీద దేవునికి కానుకలు చెల్లిస్తారా ఎవరైనా? ఇదెక్కడి సంప్రదాయం. బతికుండంగా మరణశాసనాన్ని రచిస్తారా? ఒకరు చచ్చివుంటే స్వర్గం చేరాలని, బతికున్నవారు కూడా చనిపోతే స్వర్గానికి వెళ్ళాలని శాసనం వేయిస్తారా? చక్రవర్తి(ణి)కదా ఆమె ప్రాణాపాయస్థితి నుంచి కోలుకోవాలని ప్రతాపరుద్రుడే దానధర్మాలు చేసివుండవచ్చుకదా లేదా పువు ముంమడే వేరొక శాసనం చెక్కించవచ్చుకదా. చచ్చిన వారిని, బతికివున్నవారిని ఒకేశాసనంలో కలుపుతా రా? ఇదేం విజ్ఞత? రుద్రమదేవి అసహాయస్థితిలో అంబదేవుని చర్యలవల్ల అపస్మారస్థితిలో పడి వుండొచ్చనే ఊహ సినిమాటిక్ విజన్ మాత్రమే.

రుద్రమదేవి సినిమాలో రుద్రమదేవిని నేనే రాణిగా నిలబెట్టిన అనే గన్నారెడ్డి డైలాగ్ లాంటిదే ఈ వ్యాఖ్యానం కూడా. నిజ చరిత్రలో ఎవరిపాత్ర ఎంతదో చెప్పే ఆధారాల అన్వేషణ జరిగిందా? వెతికినదెంత? చరిత్రకు చేర్చినదెంత? ఎందుకింత తొందరపాటు లో చరిత్రకారులకు? రుద్రమదేవి మరణాన్నొక వివాదాస్పదం చేయడం పని లేని చరిత్రకారులు చేసే పనే.

1295 వరకు రుద్రమదేవి బతికి ఉంటే... ఏంచేసింది? ఒక విదేశీయాత్రా రచనను నమ్మదగిందని, ఇక్కడ దొరికిన శాసనానికేమో విపరీతార్థం తీయడం చరిత్రకారునికి ఏం శోభనిస్తుంది. ఎందుకు రుద్రమదేవి మరణాన్ని వివాదాస్పదం చేస్తున్నట్టు?

రుద్రమదేవిని దేవగిరిరాజు కుమార్తె, అని, గణపతిదేవుని భార్యగా అతని మరణానంతరం విధవరాలే రాజ్యమేలుతున్నదని రాసిన మార్కోపోలో రచనను నమ్మాలా?

రుద్రమదేవి సినిమాలో రుద్రమదేవిని నేనే రాణిగా నిలబెట్టిన అనే గన్నారెడ్డి డైలాగ్ లాంటిదే ఈ వ్యాఖ్యానం కూడా. నిజ చరిత్రలో ఎవరిపాత్ర ఎంతదో చెప్పే ఆధారాల అన్వేషణ జరిగిందా? వెతికినదెంత? చరిత్రకు చేర్చినదెంత? ఎందుకింత తొందరపాటులో చరిత్రకారులకు? రుద్రమదేవి మరణాన్నొక వివాదాస్పదం చేయడం పనిలేని చరిత్రకారులు చేసే పనే.

చరిత్రంటే ఇదేనా అని అసహ్యించుకునేట్లు చేయడానికా? ఇక నన్నా ఈ రాతలు మానండని విజ్ఞప్తి.

–శ్రీ రామోజు హరగోపాల్, 9949498698

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఒడిశాలో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టులు హతం

మహారాష్ట్రలో మహిళానక్సల్ కాల్చివేత

కోరాపుట్,మార్చి 25: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఎన్‌కౌంటర్ జరిగింది. కోరాపుట్ జిల్లా నారాయణపట్నంలోని తొల్లగొమండి గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. డోక్రీ ఘాట్ అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా నక్సల్స్ కాల్పులు జరుపగా, పోలీసులు ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. మావోయిస్టు క్యాంప్‌ను ధ్వంసం చేసిన పోలీసులు భారీగా పేలుడు పదార్థాలను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ (ఆపరేషన్స్) కొచ్చే వెల్లడించారు. మరోవైపు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా నక్సల్‌హ తమయ్యారు.

సొంత రాకెట్‌లో ఆకాశయానం!

ఇంట్లో రాకెట్‌ను రూపొందించుకున్న అమెరికావాసి.. 1,875 ఫీట్ల ఎత్తుకు ఎగిరి.. క్షేమంగా భూమిపైకి



ఆకాశంలోకి దూసుకెళ్తున్న రాకెట్ (ఇన్‌సెట్) రాకెట్ తయారీలో మైక్ హ్యూస్

లాస్‌ఏంజెల్స్: ఇంట్లో సొంతగా సైకిల్‌నో.. బైక్‌నో.. కార్‌నో తయారు చేసేవాళ్లను చూసుంటాం.. మరి ఓ వ్యక్తి సొంతగా రాకెట్‌ను నిర్మించుకుంటే..? దాంట్లో దాదాపు 1900 అడుగుల ఎత్తువరకు ప్రయాణించి క్షేమంగా భూమిని చేరితే?.. ఇదెలా సాధ్యం అని అనిపిస్తున్నదా? అమెరికాకు చెందిన మైక్ హ్యూస్ దీనిని సుసాధ్యం చేసి చూపించారు. కాలిఫోర్నియాలోని ఆపిల్‌వ్యాలీలో నివసించే 61 ఏండ్ల మైక్.. లిమో కార్ డ్రైవర్‌గా (అమెరికాలో కనిపించే పొడవైన కార్లు) పనిచేస్తుంటారు. ఆయన గతంలోనూ ఇలాంటి ప్రయోగాలు చేశారు. అందుకే ఆయన్ను అభిమానులు డేర్‌డెవిల్, రాకెట్ మ్యాన్ అని పిలిస్తే.. విమర్శకులు మాత్రం పిచ్చోడిగా జమకడుతూ 'మ్యాడ్' మైక్ అని పిలుస్తుంటారు. అందరూ చెప్తున్నట్టు భూమి గుండ్రగా లేదని, సమతలంగా ఉన్నదని మైక్ గట్టిగా నమ్ముతారు. అందుకే భూమికి వందల మీటర్లు ఎత్తుకు ఎగిరి భూమి సమతలంగా ఉన్నదో లేదో చూడాలనుకునేవాడనని, హేళన చేసేవాళ్లను చూసి రాకెట్ తయారు చేయాలన్న కసి తనలో పెరిగిందని మైక్ చెప్పారు.రాకెట్‌ను నిర్మాణ సాంకేతికతను సొంతగా నేర్చుకున్న మైక్ ఇంటి వెనుక ఉన్న షెడ్‌లో దానిని రూపొందించారు.

560 కి.మీల వేగంతో 1875 ఫీట్ల ఎత్తుకు

మైక్ తన ప్రయోగం కోసం లాస్‌ఏంజిల్స్ నగరానికి 320 కిలోమీటర్ల దూరంలోని ఆంబోయ్ పట్టణ పరిధిలో ఉన్న ఓ ఎడారి ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. రాకెట్ జనావాసాలపై పడకుండా జాగ్రత్త తీసుకున్నారు. తన 'మొబైల్ హోం'ను రాకెట్ లాంచర్‌గా మార్చి ఏటవాలుగా ప్రయోగాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు ఎలాంటి కౌంట్‌డౌన్ లేకుండా రాకెట్‌లోని ఇంధనాన్ని మండించారు. రాకెట్ దాదాపు గంటకు 563 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ఆకాశంలోకి దూసుకుపోయింది. మైక్ 1,875 మీటర్ల ఎత్తుకు చేరిన తర్వాత రాకెట్ నుంచి బయటికి వచ్చి పారాచూట్ సాయంతో కిందికి దిగారు. మైక్ క్షేమంగా భూమిని చేరగా.. రాకెట్ ప్రయోగస్థానం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో పడింది. రాకెట్ ముందు భాగం భూమిని గుద్దుకోగానే రెండు ముక్కలుగా విడిపోయేలా డిజైన్ చేశారు. ప్రయోగం మొత్తం మూడు నుంచి నాలుగు నిమిషాల్లో పూర్తయింది.

ఆ చిన్నారి పేరు 'అన్‌చాహి'

ఆడపిల్లపై అయిష్టతను పేరులో చూపిన తల్లిదండ్రులు



భోపాల్: 'ఆడపిల్ల బరువు కాదు. వారితోనే సమాజంలో మార్పు సాధ్యం' అని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి సందేశాన్ని ఇచ్చారు. అయినప్పటికీ ఆడపిల్ల తమ పాలిట శాపమైందన్నట్లుగా ఆ చిన్నారికి 'అన్‌చాహి'(అవాంఛిత) అని పేరుపెట్టారు ఓ దంపతులు. ఈ సంఘటన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మంద్‌సౌర్ జిల్లాలో చోటుచేసుకున్నది. బంధువులు ఎంతగా వారిస్తున్నా పట్టించుకోకుండా 'అన్‌చాహి'అని పేరు పెట్టారు. మరో షాకింగ్ న్యూస్ ఏంటంటే మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే దుర్గామాతా నవరాత్రి రోజుల్లోనే ఈ పాప జన్మించింది. స్థానిక మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో ఈ చిన్నారి పేరు చర్చనీయాంశంగా మారింది.

బాయ్‌ఫ్రెండ్స్‌ను దూరంపెట్టండి

అమ్మాయిలకు బీజేపీ ఎమ్మెల్యే సలహా



భోపాల్: అమ్మాయిలు పూర్తి రక్షణతో ఉండాలంటే బాయ్‌ఫ్రెండ్స్‌ను దూరంపెట్టాలని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ శఖ్యా అమ్మాయిలకు సలహా ఇచ్చారు. ఆడిపిల్లలకు బాయ్‌ఫ్రెండ్స్ ఎందుకు? బాయ్‌ఫ్రెండ్స్ కారణంగానే వారిపై దురాగతాలు పెరిగిపోతున్నాయన్నారు. బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరగడం మానేస్తే అమ్మాయిలకు పూర్తి రక్షణ వస్తుందని పన్నాలాల్ సూచించారు. అబ్బాయిలు పాశ్చాత్య మోజులో పడి గర్ల్‌ఫ్రెండ్స్‌ను చేసుకునే అలవాటును మానుకోవాలని పన్నాలాల్ సెలవిచ్చారు.

అంబేద్కర్ కృషి మనకు స్ఫూర్తి

- ఆయన తాత్వికతకు నేనే ఒక ఉదాహరణ
- పేదలు, అట్టడుగు వర్గాలదే 'నవీన భారత్'
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని నరేంద్రమోదీ



న్యూఢిల్లీ: ఎంతో మంది అవమానించినా ఎదురొడ్డి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సాగించిన కృషి స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆదివారం ఆయన రేడియో కార్యక్రమం మన్‌కీబాత్ ద్వారా ప్రధాని మాట్లాడారు. దేశప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు చెప్పారు.ఉన్నత కుటుంబాల్లో జన్మిస్తేనే విజయాన్ని అందుకోగలమన్న అపోహలను పటాపంచలు చేశారన్నారు. అంబేద్కర్ తాత్వికతకు తానే ఒక ఉదాహరణ అని మోదీ చెప్పారు. సరికొత్త భారతావని నిర్మాణానికి ప్రజలంతా సహకరించాలన్నారు. 'అంబేద్కర్‌ను ఎంతోమంది అవమానించారు. వెనుకబడిన వర్గం వ్యక్తి ఎదుగుదలను సహించలేక వెనక్కిలాగేందుకు ప్రయత్నించారు. ఇప్పుడు పరిస్థితులు వేరు. ప్రస్తుత భారత్ అంబేద్కర్ కోరుకున్న దేశం' అని తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు కేంద్రం చేపట్టే 'గ్రామ్‌స్వరాజ్ అభియాన్'లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రైతుల సంక్షేమానికి ఈసారి కేంద్ర బడ్జెట్‌ను రూపొందించామన్నారు. పంటలకు గిట్టుబాటు దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది గాంధీ 150వ జయంతి సందర్భంగా ఆయన ఆశయ స్ఫూర్తిగా 'స్వచ్ఛభారత్' సాధిద్దామన్నారు. అసోంలోని రిక్షాకూలీ అహ్మద్‌అలీ పేద పిల్లలకు తన కష్టార్జితంతో 9 పాఠశాలలను కట్టించారని, భారతీయుడి శక్తిని నిరూపించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వైద్యమందక మరణించిన తన సోదరి జ్ఞాపకార్థం కోల్‌కతా క్యాబ్ డ్రైవర్ సైదుల్ లష్కర్ తన ఆస్తినంతా అమ్మి పేదల కోసం 30పడకల దవాఖానను నిర్మించారన్నారు. కాన్పూర్ వైద్యుడు అజిత్‌మోహన్.. ఫుట్‌పాత్‌లపై ఉండే నిరాశ్రయులకు చికిత్స అందిస్తారని, ఇలాంటి వారెందరో సామాన్యంగా సేవచేస్తూనే అసామాన్యులుగా నిలిచారని అన్నారు.



త్రికోణాసనంపై మోదీ 3డీ వీడియో

యువత ఆరోగ్య పరిరక్షణకు ఫిట్ ఇండియా ఉద్యమం ప్రారంభించాలని ప్రధాని మోదీ సూచించారు. యోగేశ్ భద్రేష అనే వ్యక్తి యువత ఆరోగ్యంపై మన్‌కీ బాత్‌లో ప్రస్తావించాలని కోరారన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంపై ప్రచారం నిర్వహించాలన్నారు. యోగాతో ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంటామన్న ప్రధాని తన యూట్యూబ్ ఖాతా ద్వారా త్రికోణాసన త్రీడీ వీడియోను విడుదల చేశారు. అందులో నీలిరంగు టీషర్ట్ ధరించిన మోదీ యానిమేటెడ్ రూపం త్రికోణాసనం వేయడం ఉంది.

మీ చర్య స్వేచ్ఛను హరించేలా ఉంది

- ఇష్టానుసారం బెంచ్‌లను ఎలా రద్దు చేస్తారు?
- సీఐసీ తీరును తీవ్రంగా తప్పుపట్టిన సమాచార కమిషనర్ శ్రీధరాచార్యులు
- రాజకీయ పార్టీల వ్యవహారంపై ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నిస్తూ ఘాటు లేఖ



కేంద్రసమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు, (ఇన్‌సెట్) సీఐసీ ఆర్‌కే మాథుర్

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీల వ్యవహారంపై ఏర్పాటు చేసిన బెంచ్‌ను ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) ఆర్‌కే మాథుర్ రద్దుచేసి, తిరిగి మరో బెంచ్‌ను ఏర్పాటు చేయడాన్ని కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు తప్పుపట్టారు. దీనిపై ప్రశ్నిస్తూ సీఐసీకి ఓ లేఖ రాశారు. ఈ చర్య సమాచార కమిషనర్ల స్వేచ్ఛను దెబ్బతీస్తున్నదని శ్రీధర్ పేర్కొన్నారు. 'నా ప్రమేయం లేకుండా, నా అభిప్రాయం తెలుసుకోకుండానే కొంత కాలం బెంచ్‌లో సభ్యుడిగా చేర్చి.. తగిన సమాచారం, కారణం చెప్పకుండా బెంచ్ నుంచి తొలిగించడం సహేతుకమేనా? మీ చర్య సమాచార కమిషనర్ స్వేచ్ఛ, స్వతంత్రతలపై పలు గంభీరమైన ప్రశ్నల్ని లేవనెత్తుతున్నది' అని గతనెల 22న మాథుర్‌కు రాసిన లేఖలో శ్రీధర్ ప్రశ్నించారు. ఈ లేఖ ప్రతులను సమాచార కమిషనర్లందరికీ పంపారు.

బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎంలపై ఫిర్యాదులను స్వీకరించేందుకు శ్రీధర్ ఆచార్యులు, సుధీర్ భార్గవ, బిమల్ జుల్కాతో ఏర్పాటు చేసిన బెంచ్ 2016లో ఆరునెలలు పనిచేసింది. తర్వాత తనకు పనిఒత్తిడితో2016 డిసెంబర్‌లో బిమల్ జుల్కా బెంచ్ నుంచి తప్పుకున్నారు. మిగతా ఇద్దరు కమిషనర్లను సంప్రదించకుండానే ఆ బెంచ్‌ను రద్దు చేసిన సీఐసీ ఆర్‌కే మాథుర్ గత ఏడాది ఆగస్టులో నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కొత్త బెంచ్‌లో శ్రీధర్, సుధీర్‌భార్గవలకు స్థానం కల్పించలేదు. పార్టీల ఫిర్యాదులపై త్వరగా తేల్చాలని సుప్రీంకోర్టు ఆదేశించినా, కొత్త బెంచ్ ఇప్పటివరకు ఆ అంశంపై విచారణ జరుపలేదు. పైపెచ్చు నలుగురు సభ్యుల బెంచ్‌లోని ఒకరు జనవరిలో రిటైర్ కావడంతో ఇటీవల ఆ బెంచ్‌ను రెండోసారి సీఐసీ పునరుద్ధరించారు. గత జనవరిలో కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖ సమాచార హక్కు ఫిర్యాదుల పరిశీలన బాధ్యతలను మాడభూషి శ్రీధర్‌కు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్న పదిరోజులకు.. ప్రధాని మోదీ విద్యార్హతలపై ఢిల్లీ యూనివర్సిటీ రికార్డులను వెల్లడించాలని ఓ ఆర్‌టీఐ ఫిర్యాదును విచారించిన శ్రీధర్ ఆదేశించారు. ఈ ఆదేశాలు వెలువడిన కొద్దిరోజులకే ఆయనను మానవవనరుల మంత్రిత్వశాఖపై ఫిర్యాదుల పరిశీలన బాధ్యతలను సీఐసీ తొలిగించారు. దీంతో మాడభూషి శ్రీధర్ గతనెల 7న ఒక లేఖ, గతనెల 22న మరో లేఖ రాశారు. 'కమిషనర్లు ఏ ఏ అంశాలను చూడాలనేది సహేతుకంగా సమాచార కమిషన్ ఉమ్మడిగా నిర్ణయించాలే తప్ప, ఏ ఒక్కరి వ్యక్తిగత నిర్ణయంపైనో కాదు' అని తెలి పారు. కమిషనర్లకు అప్పగించిన అంశాల మార్పు, బెంచ్‌లోని కమిషనర్ల మార్పుపై 'బయటి ఒత్తిళ్లు' పనిచేయకుండా తగిన వ్యవస్థ, మార్గదర్శకాలు అవసరమన్నారు. 'డజన్ వరకు ఫిర్యాదులొచ్చినా, వాటిపై నిర్ణయాలు తీసుకోవడంలో ఏండ్లకేండ్లు ఎందుకు సమయం పడుతున్నది? దేశ ప్రజలకు మనం ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నాం. ఇలాంటివాటిపై సీఐసీ సమావేశాల్లో ఎందుకు చర్చించలేకపోతున్నాం?' అని శ్రీధర్ ప్రశ్నించారు. రాజకీయ పార్టీలకు చెందిన సంక్లిష్ట అంశాలపై స్వతంత్ర, పరిశీలనాత్మక, పారదర్శక నిర్ణయాలు అవసరమని, తగు నిర్ణయాలు తీసుకోకుంటే సమాచార కమిషన్ విశ్వసనీయతే దెబ్బతింటుందన్నారు. 'సమాచార కమిషనర్ల స్వతంత్రతను కాపాడలేకపోతే జవాబుదారీ, విశ్వసనీయతగల సంస్థగా సమాచార కమిషన్‌కు చెప్పుకునే అర్హత పోతుంది. అదే జరిగితే, ప్రభుత్వ ఖజానాపై భారమే తప్ప ఈ సంస్థ ప్రజలకు ఉపయోగపడేదిగా ఉండదు. సమాచార కమిషన్ అవసరమా అని ప్రజలు ప్రశ్నించేవరకూ వేచిచూస్తారా? దయచేసి ఆలోచించండి' అని తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను కేంద్ర సమాచార కమిషనర్ తన అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఉంచారు. 'విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా.. రాజకీయ పార్టీల నుంచి సమాచారం తెలుసుకునే అధికారం ప్రజలకు ఉంది గనుక.. ఈ అంశాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతున్నా..' అని శ్రీధర్ స్పష్టంచేశారు.

'నమో' యాప్ ద్వారా సమాచార దుర్వినియోగం

- వినియోగదారుల అనుమతి లేకుండానే ఇతరులకు డాటా చేరవేత
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ఆరోపణ



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. మోదీ అధికారిక నమో యాప్ నుంచి సమాచారం ఇతరులకు చేరుతుందని, యాప్ వినియోగదారుల అనుమతి లేకుండానే ఇదంతా జరుగుతుందని ఆరోపించారు. నమో యాప్ నుంచి సమాచార ఉల్లంఘన జరుగుతున్నదని ఫ్రెంచ్ హ్యాకర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. 'హాయ్.. నా పేరు నరేంద్ర మోదీ. నేను భారత ప్రధానిని. మీరు నా అధికారిక యాప్‌ను లాగిన్ కాగానే మీ సమాచారం అమెరికాలో ఉన్న నా స్నేహితుల కంపెనీలకు చేరవేస్తా' నని రాహుల్ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు 'సమాచార దోపిడీ అనే ఆరోపణలు మోదీ ఇంటి గడప వరకు వచ్చాయి' అనే శీర్షికతో ఉన్న వార్తా కథనాన్ని జోడించారు. ప్రధాని మోదీ యాప్‌పై ఇంతటి ఆరోపణలు వస్తున్నా మీడియా మాత్రం ఎందుకు మౌనంగా ఉంటుందో అర్థం కావడం లేదన్నారు. దీనిపై బీజేపీ స్పందించింది. రాహుల్ నుంచి ఇంత కంటే ఎక్కువ తాము ఏమీ ఆశించలేదని పేర్కొంది. 'రాహుల్.. నమో యాప్‌ను డౌన్ లోడ్ చేసుకో. దేశంలో జరుగుతున్న మంచి పనులను తెలుసుకో' అని బీజేపీ ట్వీట్ చేసింది. కాగా, ఆదివారం పాత మైసూర్‌లో జరిగిన సభలో రాహుల్ మాట్లాడుతూ జేడీఎస్ విధానం 'జనతాదళ్ సంఘ్ పరివార్'గా మారిందన్నారు. 'మీరు బీజేపీకి మద్దతుగా ఉంటున్నారా? లేదా? బీజేపీకి బీ టీమ్‌గా వ్యవహరిస్తున్నా రా? లేదా?' అని జేడీఎస్‌ను రాహుల్ ప్రశ్నించారు. అవిశ్వాస తీర్మానాలను చూసి మోదీ ప్రభుత్వం భయపడుతున్నదని రాహుల్ విమర్శించారు.

బీజేపీ గెలుపుతో ఎస్పీ-బీఎస్పీ ఐక్యత బలోపేతం

- యూపీ రాజ్యసభ ఎన్నికల ఫలితాలపై ఎస్పీ అధినేత అఖిలేశ్
- రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలాయని వ్యాఖ్య



లక్నో, మార్చి 25: ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ విజయంతో ఎస్పీ - బీఎస్పీ ఐక్యత బలోపేతమైందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. రాజ్యసభ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి భీంరావ్ అంబేద్కర్‌పై జరిగిన ముఖాముఖి పోటీలో అధికార దుర్వినియోగంతో, అర్థబలంతో బీజేపీ అభ్యర్థి అనిల్ అగర్వాల్ గెలుపొందడం వెనుక కమలనాథుల దళిత వ్యతిరేక వైఖరి, అసలు స్వరూపం బయటపడిందన్నారు. వారసత్వ రాజకీయాలకు పాల్పడుతున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, రాజస్థాన్ గవర్నర్ కల్యాణ్‌సింగ్, సీఎంలు రమణ్ సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు ఎస్పీ నాయకత్వం బంధుప్రీతికి ప్రాధాన్యం ఇస్తున్నదని ఆరోపిస్తున్నారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తన భార్య డింపుల్ యాదవ్ పోటీ చేయకపోవచ్చునన్నారు. బీజేపీ నేతలు కూడా అందుకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. యూపీలో శాంతిభద్రతల పరిస్థితి కుప్పకూలిందని అఖిలేశ్ ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు. ఇందులో భాగస్వాములైన వారు తప్పించుకోలేరని, త్వరలో దర్యాప్తునెదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల్లో గెలుపొందడం పెద్ద విజయమని, 2019 ఎన్నికల్లో బీజేపీని ఓడించవచ్చునని జాతికి సందేశమిచ్చాయని అన్నారు. కాంగ్రెస్‌తో తమకు సత్సంబంధాలున్నాయని, ఎన్నికలు వచ్చినప్పుడు పొత్తు విషయం చర్చకు వస్తుందని చెప్పారు.



ఉత్తరాది రాష్ట్రాల్లో రామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బెంగాలీలు బసంతి దుర్గపూజను ఘనంగా జరుపుకొన్నారు. అయోధ్యలో చైత్ర నవమి సందర్భంగా గంగానదిలో వేలాదిమంది పుణ్యస్నానాలు ఆచరించారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో 'ఆపరేషన్ క్రిమినల్స్'

- ఏడు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు నేరగాళ్లు హతం.. ఆరుగురు అరెస్ట్



లక్నో, మార్చి 25: ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం 'ఆపరేషన్ క్రిమినల్స్' కొనసాగిస్తున్నది. ఆదివారం నాలుగు జిల్లాల పరిధిలో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ముగ్గురు కరుడుగట్టిన నేరగాళ్లు హతమయ్యారని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పారు. మొత్తం ఏడుచోట్ల ఎన్‌కౌంటర్ కొనసాగగా, ఆరుగురు పోలీసులు గాయపడ్డారని తెలిపారు. సహరన్‌పూర్, ఘజియాబాద్, గౌతంబుద్ధనగర్, ముజఫర్‌నగర్ జిల్లాల్లో ఈ ఆపరేషన్ చేపట్టామని పేర్కొన్నారు. గౌతంబుద్ధనగర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేరగాడు శ్రావణ్ చౌదరి గాయపడ్డాడని, అతడిని దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడని తెలిపారు. ఈ ఘటనలో క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ బల్వాన్ సింగ్, కానిస్టేబుళ్లు సత్యవీర్, సంజీవ్ గాయపడ్డారని చెప్పారు. సహరన్‌పూర్ జిల్లాలో ఇద్దరు దుండగులు ఓ రైతు వద్ద రూ. లక్ష చోరీ చేయడమే కాకుండా రైతు బైక్‌ను కూడా ఎత్తుకెళ్లారని పోలీసులు తెలిపారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దుండగులను పట్టుకోవడానికి ప్రయత్నించగా కాల్పులకు దిగారని, దీంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారని పేర్కొన్నారు. ఈ ఘటనలో గ్యాంగ్‌స్టర్ సలీం హతమయ్యాడని, సబ్ ఇన్‌స్పెక్టర్ సచిన్ శర్మ గాయపడ్డారని చెప్పారు. 'జాతీయ రహదారి-24' వద్ద జరిగిన ఎదురు కాల్పు ల్లో సుందర్ అనే వ్యక్తి గాయపడ్డాడని, అతడు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు. నోయిడాలోని దన్‌కౌర్ పట్టణంలో ఇద్దరు నేరగాళ్లను, దాద్రి ప్రాంతంలో ఒకడిని, ముజఫర్ జిల్లాలో ఇద్దరిని, ఘజియాబాద్ జిల్లాలో ఒక క్రిమినల్‌ను అరెస్టు చేశామని తెలిపారు. యూపీలో 6 నెలల్లోనే 420 ఎన్‌కౌంటర్లు జరిగాయి. 15 మంది నేరగాళ్లు హతమయ్యారు.

బద్గామ్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే ఉగ్రవాది హతం

శ్రీనగర్: కశ్మీర్‌లోని బద్గామ్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిత(ఎల్‌ఈటీ)కు చెందిన ఉగ్రవాది హతమయ్యాడు. ఓ మహిళ గాయపడ్డారు. ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం మేరకు భద్రతా బలగాలు శనివారం రాత్రి బీర్‌వా ప్రాంతంలోని అరిజల్‌లో గాలింపు చర్యలు చేపట్టాయి. గమనించిన ఉగ్రవాదులు కాల్పులు జరుపుతూ.. ఓ మహిళను అడ్డంపెట్టుకొని తప్పించుకొనేందుకు యత్నించారు. భద్రతా సిబ్బంది కాల్పులు జరుపగా బారాముల్లాకు చెందిన షఫత్ హుస్సేన్ వనీ మృతిచెందాడు. ఎన్‌కౌంటర్ ప్రదేశంలో రూ.30 వేల నగదు, మొబైల్ ఫోన్, ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభించాయని, సదరు మహిళకు బుల్లెట్ గాయమైందని పోలీసులు తెలిపారు.

25 శతాబ్ది రైళ్లలో ప్రయాణ చార్జీలు తగ్గింపు

- ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేటు పెంపే రైల్వేశాఖ లక్ష్యం

న్యూఢిల్లీ: ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేటు తక్కువగా ఉన్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రయాణ చార్జీలు తగ్గించాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. 25 శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొన్ని సెక్షన్ల మధ్య ప్రయాణ చార్జీలు తగ్గించాలని నిర్ణయానికి వచ్చిన రైల్వే శాఖ.. ఆ మార్గాలను కూడా గుర్తించింది. ఈ ప్రతిపాదనను చురుగ్గా పరిశీలిస్తున్నామని రైల్వేశాఖ అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. ఢిల్లీ - అజ్మీర్, చెన్నై- మైసూర్ మార్గాల్లో నడిచే రెండు శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లలో గత ఏడాది ప్రయోగాత్మకంగా రూ.300 వరకు చార్జీలు తగ్గించడం సానుకూల ఫలితాలనిచ్చింది. ఈ నేపథ్యంలో శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రయాణ చార్జీలు తగ్గించడంతోపాటు రైలు సర్వీసుల 'లే ఓవర్ టైం' తగ్గించి 100 నూతన రైళ్లు నడుపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇప్పటికే 25 నూతన రైళ్లు ప్రారంభించగా, ఈ ఏడాదిలోపు మరో 75 రైళ్లు ప్రారంభం కానున్నాయి.

వైద్యులు కొంతకాలం దేశంలో పనిచేయాలి

- ఈ మేరకు చర్యలు తీసుకోండి.. పార్లమెంట్ ప్యానల్ సిఫారసు

న్యూఢిల్లీ: ప్రజల సొమ్ముతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు తప్పనిసరిగా కొంతకాలం దేశంలో పనిచేసేలా చూడాలని పార్లమెంట్ ప్యానల్ సిఫారసు చేసింది. ప్రజాధనాన్ని ప్రభుత్వం వైద్య కళాశాల విద్యార్థులకూ ఖర్చు చేస్తున్నదని గుర్తుచేసింది. అయితే చదువు పూర్తయిన తర్వాత ఆయా విద్యార్థులు విదేశాలకు వెళ్లిపోతుండటం వల్ల ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటున్నదని పేర్కొంది. అలాగే జూనియర్ వైద్యులు కనీసం ఏడాదిపాటు గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని..అక్కడి మౌలిక వసతులు, ఇతరత్ర కారణాలపై ఇది ఆధారపడి ఉంటుందని తెలిపింది. సిఫారసులను ఖండించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వచ్చే నెల 2 నుంచి నిరవధికసమ్మెకుదిగ నున్నట్లు పేర్కొంది.

ఆధార్‌ను వ్యతిరేకిస్తారు.. వీసా కోసమైతే బట్టలిప్పుతారు

- కేంద్రమంత్రి కేజే ఆల్ఫోన్స్ వ్యాఖ్యలు
- ఆధార్ లీక్ ఆరోపణలపై తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ: కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి కేజే ఆల్ఫోన్స్ ఆధార్‌ను తప్పుబడుతున్న వారిపై తీవ్ర విమర్శలు చేశారు. డాటా భద్రత గురించి మాట్లాడే వారు అమెరికా వీసా కోసం తెల్లోని ముందు నగ్నంగా నిలబడేందుకు వెనుకాడరని, అదే సొంత ప్రభుత్వం కొన్ని వివరాలు అడిగితే మాత్రం ఉద్యమాలకు పిలుపునిస్తారని ఆదివారం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'అమెరికా వీసా కోసం మనం పది పేజీల దరఖాస్తును పూర్తిచేస్తాం. తెల్లవాళ్లకు ఫింగర్‌ప్రింట్స్ ఇవ్వడంతోపాటు పూర్తిగా బట్టలు విప్పి చూపేందుకు మనకు ఎటువంటి సమస్య ఉండదు. కానీ సొంత ప్రభుత్వం కేవలం పేరు, చిరునామా వంటి వివరాలు అడిగితే ప్రైవేటు జీవితంలో చొరబాటు అంటూ గగ్గోలు పెడుతాం' అని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద ప్రజల డాటా పూర్తి సురక్షితంగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. 'అసలు ఆధార్‌లో ఏముంది? కేవలం పేరు, చిరునామా. మన బయోమెట్రిక్ వివరాలు యూఐడీఏఐ వద్ద ఉంటాయి. ఈ వివరాలు ఎప్పుడూ ఉల్లంఘనకు గురికావు. పూర్తి భద్రత ఉంటుంది. కేవలం ప్రభుత్వ సంస్థలు మాత్రమే వాటిని ఉపయోగించగలవు' అని ఆయన వివరించారు. ఆధార్ వివరాలు లీక్ అయ్యాయని ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కేంద్రమంత్రి స్పందించారు. ప్రధానమంత్రి ప్రజల వివరాలను అమెరికన్ కంపెనీలకు ఇస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలు ఆల్ఫోన్స్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ కట్టుకథలను ఎవరైనా నమ్ముతారా అని ఆయన ప్రశ్నించారు.

ఆధార్ నమోదులో ముఖాన్ని గుర్తించే ఫీచర్

- జూలై 1 నుంచి ప్రవేశపెట్టనున్న యూఐడీఏఐ

న్యూఢిల్లీ: ఆధార్ నమోదులో భాగంగా జూలై 1 నుంచి ముఖాన్ని గుర్తించే ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఐరిష్, ఫింగర్‌ప్రింట్స్ స్కానింగ్‌తోపాటు అదనంగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. వృద్ధాప్యం కారణంగా బయోమెట్రిక్ నమోదు కాకపోవడం, కష్టపడి పనిచేసే వారి చేతి వేళ్ల ముద్రలు అరిగిపోవడం వల్ల వారు ఆధార్ నమోదు చేయించుకోవడంలో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ముఖాన్ని గుర్తించే ఫీచర్‌ను అందుబాటులోకి తేనున్నట్టు యూఐడీఏఐ వెల్లడించింది. అయితే ఫింగర్‌ప్రింట్స్ లేదా ఐరిష్ లేదా ఓటీపీ ఈ మూడింటిలో ఏదో ఒకదానితో కలిపి మాత్రమే ముఖాన్ని గుర్తించే ఫీచర్‌ను అనుమతిస్తారు.

బీమా పాలసీలకు ఆధార్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: వివిధ రకాల బీమా పాలసీలకు ఆధార్ అనుసంధానం గడువును పొడిగిస్తున్నట్టు బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ వెల్లడించింది. సుప్రీంకోర్టు ఆధార్ అంశంపై తుది తీర్పును వెల్లడించేవరకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి కాదని పేర్కొన్నది. వివిధ ప్రభుత్వ పథకాలకు ఆధార్ అనుసంధానం తుది గడువును ఆధార్ అంశంపై వాదనలు పూర్తయి తుది తీర్పు వచ్చేవరకు పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో మార్చి 31 వరకు ఉన్న ఆధార్ అనుసంధానం తుది గడువును ఐఆర్‌డీఏఐ పొడిగించింది.

బస్సు దగ్ధం.. నలుగురు దుర్మరణం

- మధ్యప్రదేశ్‌లో ఘటన



ధర్: మధ్యప్రదేశ్‌లోని ధర్ జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు-బైక్ ఢీకొనడంతో బస్సులో ఒక్కసారిగా మంటల చెలరేగి నలుగురు దుర్మరణం చెందారు. మృతులను గుర్తించాల్సి ఉన్నది. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రులను సమీప దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రాదేశిక సమగ్రత పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

- డోక్లాంపై రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: డోక్లాం వద్ద ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. సైనిక బలగాల ఆధునీకరణపై నిరంతరం కృషి చేస్తున్నట్టు డెహ్రాడూన్‌లో ఆమె చెప్పారు. ప్రస్తుతం డోక్లాం వద్ద ఎటువంటి మార్పు లేదని చైనాలో భారత్ రాయబారి గౌతం బాంబావాలే తెలిపారు. భారత్ - చైనా సరిహద్దుల్లో యథాతథ పరిస్థితి కొనసాగుతున్నదని సౌత్ చౌనా మార్నింగ్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.

టాంజానియాలో రోడ్డు ప్రమాదం.. 26 మంది మృతి

నైరోబి: తూర్పు టాంజానియాలోని ముకురాంగా జిల్లాలోని ముపరాంగాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో 26 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 10 మంది తీవ్రగాయాల పాలై ముహింబిలి జాతీయ రహదారి దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఎదురుగా వస్తున్న ట్రక్కును మినీ బస్సు ఢీ కొనడంతో ఈ ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు.



ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో మురుగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో హోంమంత్రి నాయిని, ఎంపీ దత్తాత్రేయ, ఎమ్మెల్యే లక్ష్మణ్, మేయర్ రామ్మోహన్ తదితరులు

57.63 కోట్ల పనులకు శ్రీకారం

ముషీరాబాద్ నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టిన పురపాలక, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు ఆదివారం నగరంలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కే లక్ష్మణ్, ఎంపీ దత్తాత్రేయతో కలిసి నియోజకవర్గంలోని డివిజన్లలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. తొలుత కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గల కట్ట మైసమ్మ దేవాలయం నుంచి పర్యటనను ప్రారంభించిన ఆయన ఆరు డివిజన్ల పరిధిలో రూ.8.49 కోట్లతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణానికి, కవాడిగూడ డివిజన్ భీమా మైదాన్‌లో రూ.60 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ముషీరాబాద్ డివిజన్ చేపల మార్కెట్ మార్గంలో రూ.96.50 లక్షలతో చేపట్టే 450 ఎంఎం డయా మురుగునీటి పైపులైన్‌కు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నియోజకవర్గంలో రూ.4.66 కోట్లతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి అడిక్‌మెట్ డివిజన్ హిందీ మహావిద్యాలయ ఎదురుగా శంకుస్థాపన చేశారు. అనంతరం రాంనగర్ డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో రూ. 2.92 కోట్లతో చేపట్టే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లిలో రూ.40 కోట్లతో నిర్మించే మోడల్ మార్కెట్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. మంత్రి వెంట జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి, జలమండలి ఎండీ దానకిశోర్, స్టాడింగ్ కమిటీ సభ్యులు వీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు, ముఠా పద్మ నరేశ్, లాస్యనందిత తదితరులు ఉన్నారు.



మంత్రి కేటీఆర్‌తో ముషీరాబాద్ బీజేపీ కార్యకర్తలు

బీసీల అభ్యున్నతికి కృషి

బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వం చేయూత: ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

- జాతీయస్థాయికి బీసీ గొంతుక: బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న
- నూతన రాజ్యసభ సభ్యులకు బీసీ సంఘాల ఆత్మీయం సత్కారం



రాజ్యసభ సభ్యులు బండా ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న మంత్రులు ఈటల, జోగు రామన్న, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, కుల, ఉద్యోగ, బీసీ సంఘాల నాయకులు

తెలుగు యూనివర్సిటీ: కేవలం అధికారం, ఓట్ల కోసం కాకుండా రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు బండా ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్‌ను హైదరాబాద్ ఆదర్శనగరలోని జీపీ సెంటర్ ఆడిటోరియంలో బీసీ సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు ఈటల, జోగు రామన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ 70 ఏండ్ల పాలనలో బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకున్న ఉమ్మడి పాలకులు మ్యానిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు పరుచకపోవడం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధించుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. స్వరాష్ట్రంలోనే అన్ని కులాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నదన్నారు. బీసీలు మోసపోకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, చైతన్యంతో న్యాయంగా మన కోసం పనిచేసే వారికే పట్టం కట్టాలని సూచించారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ చట్టాలకు సవరణలు చేసైనా అణగారిన జాతులకు న్యాయం చేస్తానని చెప్పి అమలుకు కృషి చేస్తున్నారని వివరించారు. హాస్టళ్లలో ముక్కిన బియ్యం అన్నం, నీళ్ల చారు నుంచి బీసీ యువతకు విముక్తి కల్పించి సన్నబియ్యంతో కూడిన నాణ్యమైన భోజనం పెట్టి యువతకు ఉన్నత విద్యావకాశాలు అందాలనేదే తమ ప్రభుత్వ కర్తవ్యంగా కృషి చేస్తున్నామన్నారు. ఓట్ల సమయంలో కొందరు నాయకులు కుల సంఘాల పేరుతో ఇచ్చే దావత్‌లకు మోసపోకుండా, ప్రజలు సంక్షేమ పథకాలు అందించే పాలకులకు పట్టం కట్టాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, సన్నబియ్యం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పెన్షన్, కార్మికులకు, రైతులకు, కుల వృత్తుదారులకు భీమా వంటి తదితర పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం హైదరాబాద్‌లో స్థలం కేటాయించి కుల సంఘాల భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం పాటుపడుతుందని హామీ ఇచ్చారు. అణగారిన జాతులకు రాజకీయంగా అవకాశాలు, ఆర్థిక పరిపుష్టి కలిగించే ప్రణాళికలో భాగంగానే రెండు రాజ్యసభ స్థానాలు బీసీలకు కేటాయించారన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ జాతీయ బీసీ కమిటీకి చట్ట బద్ధత కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించుకునేందుకు ఎంపీలు కృషి చేయాలన్నారు. బీసీల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. బీసీల గొంతుకను జాతీయస్థాయిలో వినిపించాలనే లక్ష్యంతోనే రెండు రాజ్యసభ స్థానాలు బీసీలకు కేటాంచడం శుభపరిణామమన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవం కోసం పాటుపడుతున్న బీసీ నేతలపై కారుకూతలు కూస్తే తాటతీస్తామని హెచ్చరించారు. బీసీ కులాల ఐక్యతే అభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్ట మధు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ, కుల, ఉద్యోగ సంఘాల నేతలు కే గణేశ్‌చారి, కే శ్రీనివాస్, విక్రంగౌడ్, జీ సుధాకర్, భాగ్యలక్ష్మి, నిరంజన్, దుర్గయ్యగౌడ్, స్వరూప పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు మెట్రోరైలు

రాయదుర్గం నుంచి 30.7 కిలోమీటర్ల మేర మార్గం

- పనుల పర్యవేక్షణకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఏర్పాటు
- చైర్మన్‌గా సీఎస్ ఎస్‌కే జోషి, ఎండీగా ఎన్వీఎస్ రెడ్డి నియామకం
- డిజైన్, నిర్మాణం, రవాణా ఆధారిత అభివృద్ధిపై దృష్టిసారించనున్న సంస్థ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రోరైలును అనుసంధానించడంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు ఏర్పాటు చేయనున్న మార్గం పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్)ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఇది మెట్రోరైల్ సంస్థ, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నడువనున్న ప్రత్యేక (స్పెషల్ పర్పస్ వెహికిల్) సంస్థ. హెచ్‌ఏఎంఎల్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని, ఎండీగా ఎన్వీఎస్ రెడ్డిని నియమించారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు కే రామకృష్ణారావు, సునీల్ శర్మ, అరవింద్‌కుమార్, జయేశ్‌రంజన్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు డైరెక్టర్లుగా వ్యవహరించనున్నారు. కారిడార్-3లో భాగంగా రాయదుర్గం నుంచి బయోడైవర్సిటీ పార్కు, అక్కడి నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీంతో 30.7 కి.మీల మేర మార్గం అందుబాటులోకి వస్తుంది.

విశ్వనగరంగా మార్చే దిశగా..

పలు అభివృద్ధి చెందిన నగరాల్లో ఐటీ కారిడార్లు, కీలక ప్రాంతాల నుంచి విమానాశ్రయాలకు ప్రత్యేక మెట్రోరైలు వ్యవస్థ అందుబాటులో ఉన్నది. ఇదే తరహాలో హైదరాబాద్‌లోని మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి వంటి ఐటీ, ఆర్థిక కారిడార్ల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ సంకల్పించారు. ఈ మేరకు రాయదుర్గం నుంచి విమానాశ్రయానికి 30.7 కి.మీ. మేర మెట్రో మార్గాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఈ మార్గం డీపీఆర్‌ను రూపొందించే బాధ్యతను ఢిల్లీ మెట్రో రైలు సంస్థకు అప్పగించగా, వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాజెక్టు ప్రాథమిక నివేదికను సిద్ధం చేశారు. బయోడైవర్సిటీ పార్కు నుంచి విమానాశ్రయం వరకు ఎక్స్‌ప్రెస్ మెట్రో కనెక్టివిటీని తక్షణమే ప్రారంభించాలని స్పష్టంచేశారు. మెట్రో మార్గానికి, స్టేషన్లకు అనుసంధానంగా టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నివేదిక ఆధారంగా ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో పనుల పర్యవేక్షణకు స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేయాలని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇందులో హెచ్‌ఎంఆర్‌ఎల్ వాటా 51 శాతం, హెచ్‌ఎండీఏ వాటా 49 శాతం ఉండాలని సూచించారు.

హెచ్‌ఏఎంఎల్ చేపట్టే పనులు

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం, డిజైన్, నిర్మాణం, నిర్వహణ, అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారిస్తుంది.
- మెట్రో స్టేషన్ల చుట్టూ రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌లు, షాపింగ్ మాళ్లు, వాణిజ్య సముదాయాలు వంటివి ఏర్పాటు చేస్తుంది. ఇందుకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్, సమన్వయ బాధ్యతలు తీసుకుంటుంది.
- ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ కారిడార్‌లో రోడ్ల సామర్థ్యం పెంచేందుకు చేపట్టే పనులు, కొత్త రోడ్ల ఏర్పాటు, ఇతర రవాణా ప్రత్యామ్నాయాలపై తుది నిర్ణయం తీసుకుంటుంది.
- రవాణా ఆధారిత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలతో చర్చలు జరుపుతుంది.
- మెట్రో స్టేషన్ల నుంచి క్యాబ్‌ల ఏర్పాటు, సమర్థ నిర్వహణపై దృష్టి పెడుతుంది.

జిమ్నాస్టిక్స్ కోచ్ బ్రిజ్ కిశోర్‌కు రూ.25 లక్షల ఆర్థిక సాయం

వైద్యం కోసం చెక్కు అందజేసిన మంత్రి పద్మారావు

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ దవాఖానలో చికిత్స పొందుతున్న జిమ్నాస్టిక్స్ కోచ్ ఎస్ బ్రిజ్ కిశోర్ వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలను మంజూరు చేసింది. ఈ మేరకు బ్రిజ్ కిశోర్‌కు రూ.25 లక్షల చెక్కును ఆదివారం క్రీడాశాఖ మంత్రి టీ పద్మారావు, క్రీడాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అందజేశారు. ఇటీవల ప్రపంచ జిమ్నాస్టిక్స్ చాంపియన్స్ ట్రోఫీలో రజత పతకం సాధించి చరిత్ర సృష్టించిన బుడ్డా అరుణారెడ్డికి కోచ్‌గా వ్యవహరించిన బ్రిజ్ కిశోర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కిశోర్ వైద్యం కోసం ప్రభుత్వం రూ.25 లక్షలను మంజూరు చేసింది. ఈ సందర్భంగా మంత్రి పద్మారావు మాట్లాడుతూ దేశ కీర్తిని పెంచిన అరుణారెడ్డి లాంటి క్రీడాకారులను తయారు చేసిన బ్రిజ్‌కిశోర్‌కు సాయం చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, సాట్స్ ఎండీ దినకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కోచ్ బ్రిజ్ కిశోర్‌కు చెక్కు అందజేస్తున్న మంత్రి పద్మారావు

మైనారిటీ స్కూళ్లతో ముస్లింల అభివృద్ధి

- ట్రెమీస్ వైస్ చైర్మన్ ఏకే ఖాన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముస్లింలు సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందడానికి తెలంగాణ మైనారిటీ స్కూళ్లు (టీఎంఆర్) కృషిచేస్తున్నాయని ప్రభుత్వ సలహాదారు, ట్రెమీస్ వైస్ చైర్మన్ ఏకే ఖాన్ తెలిపారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (ట్రెమీస్)కి చెందిన స్కూళ్లలో టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ అయిన 241 మంది పీజీటీలకు జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రెండురోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఏకే ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరుపేదల పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన అందించాలనే ఉద్దేశంతో ట్రెమీస్ ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో ట్రెమీస్ అకడమిక్ హెడ్ లతీఫ్ అథర్, కార్యదర్శి బీ షఫిఉల్లా తదితరులు పాల్గొన్నారు.

గొంతు నులిమి చంపేశారు

రాజేంద్రనగర్‌లో ఎనిమిదేండ్ల బాలిక అనుమానాస్పద మృతిపై దర్యాప్తు ముమ్మరం



మౌనిక (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లి వాంబేకాలనీలో అనుమానాస్పదంగా మృతి చెందిన బాలికది హత్యేనని పోలీసులు తేల్చారు. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ నుంచి వలస వచ్చిన నర్సింహులు, లలిత దంపతుల కుమార్తె మౌనిక(8) మూడో తరగతి చదువుతున్నది. బాలిక శుక్రవారం మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గొంతుపై గాట్లు ఉండటం, నోట్లో నుంచి రక్తం వస్తుండటంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వైద్యుల ప్రాథమిక నివేదిక ఆధారంగా మౌనికది హత్యగా తేల్చారు. ముక్కు, నోరు మూసి, గొంతు నులిమి చంపినట్టు తేలింది. ఆమెపై లైంగిక దాడి జరుగలేదని పోలీసులు స్పష్టంచేశారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఎవరైనా దొంగతనం చేస్తుండగా మౌనిక చూసి ఉంటుందని, పేర్లు బయటపడుతాయని చంపేసి ఉంటారని లేదా అక్రమ సంబంధం వ్యవహారం హత్యకు దారితీసి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు ఓ మహిళను, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఐటీ కారిడార్‌కు సైబర్ రక్ష

సైబర్ దాడుల నుంచి కార్పొరేట్ కంపెనీలకు పూర్తి భద్రత

'సైబర్ కాప్ టీమ్స్'ను ఏర్పాటు చేసిన సైబరాబాద్ పోలీసులు

ఇప్పటికే ఎనిమిది సంస్థల్లో సమస్యలను పరిష్కరించిన సైబర్ టీమ్స్

(గొట్టిముక్కుల సుధాకర్ గౌడ్) హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాజధానిలో అత్యంత కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్‌పై డేగ కండ్లతో నిఘా వేస్తూ రక్షణ కల్పిస్తున్న పోలీసులు.. ఇప్పుడు సాంకేతికంగా ఎదురయ్యే ముప్పును పరిష్కరించడంపై దృష్టి సారించారు. రాన్సమ్‌వేర్ (డాటాను దొంగిలించి, దానిని ఎన్‌క్రిప్ట్ చేయడం, సరిచేయడానికి డబ్బులు డిమాండ్ చేయడం), మాల్‌వేర్స్(డాటాను చోరీ చేసే వైరస్‌లు)తో కార్పొరేట్ సంస్థలను హడలెత్తిస్తున్న హ్యాకర్ల భరతం పట్టేందుకు సైబరాబాద్ పోలీసులు సిద్ధమయ్యారు. సైబర్ దాడుల నుంచి కంపెనీలను రక్షించేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా 'సైబర్ కాప్ టీమ్స్'ను ఏర్పాటు చేశారు. ఎంటెక్ తదితర ఉన్నత విద్యార్హతలు ఉండి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిష్ణాతులైన 10 మందితో సైబర్ కాప్ టీమ్స్‌కు రూపకల్పన చేశారు. వారికి తాజా సైబర్ టెక్నాలజీపై ప్రపంచవ్యాప్తంగా పేరొందిన కంపెనీల నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ విభాగంలో దశలవారీగా 10 సైబర్ కాప్ టీమ్స్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఐటీ కారిడార్‌లో ఏదైనా సమస్య తలెత్తితే ఈ సైబర్ కాప్ టీమ్స్ వెంటనే అక్కడికి చేరుకొని పరిష్కరిస్తాయి. సంస్థకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటాయి.


తక్షణ స్పందన.. అవగాహన కార్యక్రమాలు

సైబర్‌కాప్ టీమ్స్ 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయి. కార్పొరేట్ కంపెనీలపై సైబర్ దాడులు జరిగినప్పుడు, రాన్సమ్‌వేర్ దాడులు జరిగినప్పుడు ఆ సంస్థ డాటా నష్టపోకుండా చర్యలు చేపడుతారు. సమస్యను పరిష్కరించి వారికి అండగా నిలబడుతారు. అంతేకాకుండా వివిధ సైబర్ నేరాల గురించి కార్పొరేట్ సంస్థలను అప్రమత్తం చేస్తారు. కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సైబర్ క్రైమ్స్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇస్తుంటారు. హ్యాకర్ల దాడులను తిప్పికొట్టేందుకు ఎలాంటి యాంటీవైరస్‌లు ఉపయోగించాలో చెప్తూ, చిట్కాలు ఇస్తారు. ఈ సైబర్ కాప్ టీమ్స్ ఇప్పటికే ఎనిమిది సంస్థల్లో ఎదురైన సమస్యలను, సైబర్ నేరాలను పరిష్కరించాయి. సంస్థల్లో నెలకొన్న లోపాలను ఎత్తి చూపి, వాటిని సరిదిద్దాయి. దీంతో పలు సంస్థలు సైబర్ కాప్ బృందాలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ముందుకొచ్చాయి.

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు

హైదరాబాద్ శివారులోని ఓ మెడికల్ కాలేజీపై ఇటీవల మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు వెళ్లగా, ఎంసీఐ బృందం దర్యాప్తునకు వచ్చింది. దీంతో కాలేజీ యాజమాన్యం షాక్‌కు గురైంది. విచారణ తర్వాత వారిపై వచ్చిన ఫిర్యాదు తప్పుగా తేలింది. దీనిని ఓ కుట్రగా భావించిన కాలేజీ యాజమాన్యం వెంటనే సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సైబర్ కాప్ టీమ్స్ రంగంలోకి దిగి విచారించగా కాలేజీలోని ఓ ఉద్యోగే యాజమాన్యంపై ఆగ్రహంతో ఇలా తప్పుడు ఫిర్యాదు చేసినట్టు తేలింది. ఓ నకిలీ మెయిల్ ఐడీని సృష్టించి కాలేజీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఎంసీఐకి ఫిర్యాదు చేసినట్టు నిర్ధారించారు. ఐపీ అడ్రస్ ద్వారా అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నాయి. ఇవే కాకుండా పలు కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన ఫిర్యాదులపై సైబర్ కాప్ టీమ్స్ స్పందించి వేగంగా విచారణ జరిపి నిందితులను గుర్తించాయి.

ఐటీ కంపెనీలకు పూర్తి భరోసా



సైబర్ కాప్ టీమ్స్‌తో ఐటీ కంపెనీలకు సైబర్ దాడుల ముప్పు నుంచి రక్షణ కలుగుతుంది. ఈ బృందాలు సాంకేతికంగా నిరంతరం అప్‌డేట్ అవుతూ మోసగాళ్ల చర్యలను అడ్డుకుంటాయి. సైబర్‌కాప్స్‌లో ప్రస్తుతం 10 మంది ఉన్నారు. త్వరలో 10 బృందాలను ఏర్పాటు చేస్తాం. సైబర్ మోసాలు, సైబర్ దాడులు, తదితర సైబర్ నేరాలు జరిగినప్పుడు ఈ బృందాలు వెంటనే స్పందించి పరిష్కరిస్తాయి.

- జానకీ షర్మిల, డీసీపీ, సైబరాబాద్ సైబర్ క్రైమ్స్

మార్కులను మార్చేసిన విద్యార్థులు..

హైదరాబాద్ శివారులోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలో మార్కుల గోల్‌మాల్ జరిగింది. అంతర్గత పరీక్షల్లో 15 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. అయితే ఫలితాలు వెల్లడించే సమయానికి కాలేజీ కంప్యూటర్‌లోని మార్కుల జాబితాలో వారందరూ పాస్ అయినట్టు కనిపించింది. దీంతో కంగుతిన్న కళాశాల సిబ్బంది.. వేరే కంప్యూటర్‌లో భద్రపరిచిన మార్కుల జాబితాతో సరిపోల్చగా మోసం జరిగినట్టు తేలింది. దీంతో కాలేజీ యాజమాన్యం సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించగా, సైబర్ కాప్ రంగంలోకి దిగారు. మార్క్స్ షీట్‌ను భద్రపర్చిన రెండు కంప్యూటర్లను పరిశీలించారు. క్లర్క్ రూమ్‌లో ఉన్న కంప్యూటర్‌లోకి హ్యాకర్లు మాల్స్‌వేర్‌ను పంపినట్టు గుర్తించారు. ఫెయిల్ అయిన 15 మంది విద్యార్థుల మార్కులను 40 దాటించినట్టు తేల్చారు. మరో కంప్యూటర్‌లోనూ మార్క్స్ షీట్ భద్రపరిచిన విషయం హ్యాకర్లకు తెలియకపోవడంతో గుట్టు వీడింది. కళాశాల విద్యార్థులే కాలేజీ వైఫై సహాయంతో క్లర్క్ రూమ్‌లోని కంప్యూటర్‌ను హ్యాక్ చేసినట్టు సైబర్ కాప్ టీమ్స్ తేల్చాయి. మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా ఎలాంటి యాంటీవైరస్‌లు ఉపయోగించాలో సూచించాయి. కాలేజీ యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారిని మందలించడంతోపాటు, విషయాన్ని వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లింది.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 26 మార్చి 2018
WWW.NTNEWS.COM



దీపాలి గోయెంకా .. దేశీయ వస్త్ర వ్యాపార రంగంలో పేరెన్నిక గన్న వెల్‌స్పన్ ఇండియా సీఈవో, వెల్‌స్పన్ ప్రపంచంలో మూడవ స్థానంలోనూ, ఆసియాలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ కంపెనీగా పేరుగాంచింది. ప్రస్తుతం కంపెనీ సుమారు 3.5 బిలియన్ డాలర్ల ఆదాయం కలిగిన సంస్థగా గుర్తింపు పొందింది. ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ కలిగిన ఈ సంస్థను దీపాలి తన మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో అద్భుతంగా తీర్చిదిద్ది ఫోర్బ్స్ జాబితాలో 16వ స్థానంలో నిలిచారు. భర్త ప్రోత్సాహంతో డైరెక్టర్‌గా కంపెనీలో ప్రవేశించి అంచెలంచెలుగా ఎదుగుతూ వెల్‌స్పన్ ఇండియా లిమిటెడ్ సీఈవోగా ఉన్నత స్థానాన్ని అధిరోహించిన దీపాలి గోయెంకా సక్సెస్‌మంత్ర.

6

నా జీవితంలో నేను చాలా సంస్థలను చూశాను. అయితే వాటిలో కొన్ని మాత్రమే నాకు స్ఫూర్తినిచ్చాయి. కార్పొరేట్ స్థాయిలో సక్సెస్ కావడమంటే మాటలు కాదు. అలాంటి వాటిలో థెర్మాక్స్ విజయం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కంపెనీ విజయంలో ఆ సంస్థ యాజమాని అనూ ఆగా చూపిన శ్రద్ధ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. థెర్మాక్స్ విజయం ఎందరికో అనుచరణీయం అని దీపాలి గోయెంకా అంటున్నారు. భర్త మరణం తర్వాత థెర్మాక్స్ బాధ్యతలను తలకెత్తుకున్న అనూ ఆగా తక్కువ సమయంలోనే కంపెనీని లాభాల బాట పట్టించడంలో విజయం సాధించారు. దీపాలి గోయెంకా కూడా ఎలాంటి అనుభవం లేకుండా వ్యాపార రంగంలోకి అగుడుపెట్టి ప్రపంచంలోని మూడు అతిపెద్ద టెక్స్‌టైల్స్ కంపెనీల్లో ఒకటైన వెల్‌స్పన్ ఇండియా లిమిటెడ్ సీఈవోగా ఎదిగారు.



సక్సెస్ మంత్ర

అట్టడుగు నుంచి అత్యున్నతస్థాయికి

దీపాలి గోయెంకా

వ్యక్తిగతం, చదువు

దీపాలి హర్వర్డ్ బిజినెస్ స్కూల్ నుండి సైకాలజీలో గ్రాడ్యుయేషన్‌తో పాటు ప్రెసిడెండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను కూడా పూర్తి చేశారు. దేశంలో పింక్ సిటీగా పేరుగాంచిన జైపూర్‌లో దీపాలి జన్మించారు. తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండడం వల్ల ఆమె తల్లి ఇంట్లోనే కుటీర పరిశ్రమ నడిపేది. దాని ద్వారా వచ్చిన ఆదాయంతోనే దీపాలి ఆమె తోబుట్టువులను పెంచి పోషించింది. 'మా అమ్మ జీవితం అంతా సుఖంగా ఏం సాగలేదు. ఎన్నో కష్టాలకోర్చి మమ్మల్ని పోషించింది. అందుకే జీవితంలో నాపై ఆమె ప్రభావం అధికంగా కనపడుతుంది' అని దీపాలి అంటారు. బి.కె. గోయెంకాను వివాహం చేసుకున్నాక భారత్‌లో వెల్‌స్పన్ రిటైల్ సంస్థను లీడ్ చేశారు. ప్రత్యేక శ్రద్ధతో వాటిని ప్రత్యేక బ్రాండ్‌గా తీర్చిదిద్దడంలో విజయం సాధించారు. ఆ తర్వాత సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు అనుబంధంగా వెల్‌స్పన్ విద్యామందిర్ హైస్కూల్, వెల్‌స్పన్ అంగన్‌వాడీ, ఫ్రీ ప్రైమరీస్కూల్లను గుజరాత్, అంజీర్‌లలో నెలకొల్పారు. దీపాలీ శిక్షణ పొందిన కథాక్ డాన్సర్ కూడా. అలాగే ఫిక్కీ ఎఫ్ఎల్ఓ మహిళా విభాగం గవర్నింగ్ బాడీ సభ్యురాలు గాను, ఎఫ్ఎల్ఓ ముంబాయ్ చాప్టర్‌కు చైర్ పర్సన్‌గానువ్య వహరిస్తున్నారు.

తనను తాను మలుచుకుని..

దీపాలి కాలేజీ చదువుతున్న సమయంలోనే ఆమె తండ్రి ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆమె తల్లి పిల్లలకు త్వరగా పెళ్లి చేసి వారిని ఒక ఇంటివారిని చేయాలనుకుంది. ఒక రకంగా చెప్పాలంటే సినిమాల్లో జరిగినట్లే దీపాలి జీవితంలో జరిగింది. జీవితంలో ఎలాంటి ఆశలు లేకుండానే పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. తన జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో కూడా తెలియని పరిస్థితి. 'ఒక దశలో పూర్తిగా ఒంటరిదాన్నయ్యాను. తక్కువ సమయంలోనే పిల్లలు కూడా కలుగడంతో నన్ను నేను ఎలా తీర్చిదిద్దుకోవాలో నిర్ణయించుకోలేక పోయాను. అయితే నాకు నమ్మకం ఉండేది. నేను ధైర్యంగా నిలబడగలనని. అని దీపాలి ఒక దశలో చెప్పుకున్నారు.

దీపాళికి రాధిక, వంశికా ఇద్దరూ ఆడపిల్లలు, వారే ఆమెకు సర్వం. వారి బాగోగుల కోసమే పూర్తి సమయం కేటాయించింది. తల్లిగా తన బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించింది. తొలి పది సంవత్సరాలు తన జీవితాన్ని పూర్తిగా వారికే అంకితం చేసింది. వారు పెరిగాక ఆమెకు చాలా తీరిక సమయం దొరికింది. మిగిలిన తల్లుల్లాగే పార్టీలకు, కిట్టీ పార్టీలకు వెళ్లడం చేసేది. అయితే ఒకసారి ఈ విషయాన్నే ఆమె తల్లికి చెప్తే వారి తల్లి 'నీ చేతిలో చాలా సమయం ఉంటే దానితో విలువైన పని చేయి' అని చెప్పింది. అదే ఆమెలో మార్పు తీసుకువచ్చింది. అప్పుడు తను వ్యాపార రంగంలోకి ఎందుకు అడుగుపెట్టకూడదన్న ఆలోచన వచ్చింది. అలా వెల్‌స్పన్‌లోకి అడుగుపెట్టింది. 'అక్కడ చాలామంది ప్రొఫెషనల్స్ ఉండేవారు. నేను మామూలు వ్యక్తిని. ఒక రకంగా నేను ఒక సాధారణ రాయిని. వజ్రం కూడా మొదట రాయిలాగే అనిపిస్తుంది. దాన్ని సానపడితేనే వజ్రంగా రూపాంతరం చెందుతుంది. అట్లే నన్ను నేను సానబట్టుకోవాలని నిర్ణయించుకున్నాను. అందుకు నేను పని చేయాలి. అది ఏ పనైనా సరే అనుకున్నాను. మొదట ఆఫీస్ వర్క్, అడ్మినిస్ట్రేషన్, సేల్స్ ఒక్కొక్కటిగా నేర్చుకున్నాను. అలా బిజినెస్‌లోకి అడుగుపెట్టాను' అని అంటారామె.

భర్త ప్రోత్సాహం తోడై..

1985లో తొలిసారి వెల్‌స్పన్ మిల్స్ పేరుతో చిన్న టెక్స్‌టైల్ మిల్స్ ప్రారంభించారు. ఇది ఒక చిన్న టెక్స్‌రైజింగ్ యూనిట్. ఆ తర్వాత 1995లో వెల్‌స్పన్ కార్పొరేషన్ లిమిటెడ్ విలీనమైంది. దీంతో వస్త్ర ఉత్పత్తి సెగ్మెంట్లో అతిపెద్ద పరిశ్రమగా అవతరించింది. ఒక రకంగా ప్రపంచ దిగ్గజంగా ఎదిగింది. 2003 నాటికి వెల్‌స్పన్ అత్యంత లాభదాయకమైన సంస్థగా ఎదిగింది. అదేసమయంలో ఆమె భర్త బి.కె. గోయేంకా (అతని కజిన్ రాజేష్ ఆర్ మండవేవాలతో కలిసి వెల్‌స్పన్ గ్రూపును స్థాపించారు.) కూడా దీపాలి వ్యాపారంలోకి రావడాన్ని స్వాగతించారు.



రెండు పడవల్లో..

ఆర్థిక వ్యవస్థ ఊపు మీదున్న సమయంలో దీపాలి వ్యాపారంలోకి ఎంట్రీ ఇచ్చారు. వెల్‌స్పన్ పనితీరును మరింత మెరుగు పరచాలని నిర్ణయించుకున్నారు. ఐరోపా, అమెరికా, మధ్య ప్రాచ్యత దేశాలకు ఎగుమతులు చేయడంతో పాటు దేశీయంగా రిటైల్ రంగంలోనూ అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. అలా 2003లో దీపాలీ తన మూడవ బిడ్డగా భావించే 'స్పేసెస్-హోమ్ అండ్ బియాండ్ ' ఆవిర్భవించింది. ఈ కాలం పూర్తిగా భిన్నమైనది. ఆమె పిల్లలు ఎదుగుతున్న సమయం. వారిని ఉదయం 7.20కి స్కూల్‌కు వెళ్లడానికి రెడీ చేయాలి. దానికోసం ఆమె ఇంకా ముందు మేల్కోవాలి. వారిని రెడీ చేసి పంపించాలి. తొమ్మిది గంటల వరకు తన పనులు పూర్తి చేసుకుని ఆఫీసుకు వెళ్లాలి. సాయంత్రం ఆరుగంటల వరకు ఇంటికి వచ్చేయ్యాలి. ఇది ఆమె టైంటేబుల్. నిజానికి దీపాలికి ఎంబీఏ లేదా ఇతర ప్రొఫెషనల్ బ్యాక్‌గ్రౌండ్ లేదు. కేవలం ఒక టెక్స్‌టైల్ వ్యక్తి భార్యగా మాత్రమే అనుభవం. అందుకే పంపిణీదారులతో ఎలా వ్యవహరించాలో స్వయంగా నేర్చుకున్నారామె.

స్వయంకృషితో ఎదిగి..



దీపాలి తన కెరీర్‌ను తనే స్వయంగా నిర్మించుకున్నారు. వ్యాపారంలో ఒక విజయాన్ని రుచి చూశాక ఇక వెనుతిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. అనతికాలంలో మార్కెట్ లీడర్‌గా ఎదిగారు. ఆ స్థానాన్ని నేటికి పదిలంగా కాపాడుకున్నారు. దీపాలి ప్రపంచ వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టడంతో పాటు 2010లో వెలస్పన్ బాధ్యతలను స్వీకరించారు. నిజానికి ఇది పూర్తిగా పురుషుల వ్యాపారం. ఆడవాళ్లు దాదాపు ఈ రంగంవైపు రావడానికి ఆసక్తి చూపరు. ఒక మీటింగ్ పెడితే 15 మందిలో ఒక్కరు మాత్రమే మహిళ ఉండే రంగం. అయితే సంస్థ ఆడవారు నడుపుతున్నారా.. మగవారా? అని ఎవరూ పట్టించుకోరు. మనం అందిస్తున్నవి నాణ్యంగా ఉన్నాయా లేవా అనే చూస్తారంతే అంటారామె. అయితే ఆ తర్వాత సెబీ ప్రతి లిస్టెడ్ కంపెనీలో ఒకరు తప్పక ఆడవారు ఉండాలని గైడ్‌లైన్స్ విధించింది.

సామాజిక సేవవైపు

కేవలం లాభాలను చూసుకోవడమే కాదు, తాము సంపాదిస్తున్న దానిలో కొంత సామాజిక సేవకు వెచ్చించాలని దీపాలి భావిస్తారు. దీంతో వారి పరిశ్రమల చుట్టూ ఉన్న ప్రజలకు విద్య, సాధికారత, ఆరోగ్యం విషయంలో సేవలందించాలని నిర్ణయించారు. అందులో భాగంగా మహిళలకు వృత్తి విద్యలో శిక్షణ ఇచ్చేందుకు స్వస్తి స్వర్గీమ కేంద్రాలు, ఆరోగ్య శిబిరాలు, వెల్‌స్పన్ విద్యామందిర్ (పదవ తరగతి వరకు విద్యనందించే పాఠశాల)లలను సలవ్, మహారాష్ట్ర, అంజర్, గుజరాత్‌లలో ఏర్పాటు చేశారు. వీటిద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఈ పాఠశాలల్లో రెండువేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే మరో 40 పాఠశాలలకు ఉపాధ్యాయ శిక్షణలో సాయం అందిస్తున్నారు. అలాగే గుజరాత్‌లో ఏర్పాటు చేసిన ఎనిమిది కేంద్రాల్లో సుమారు 800 మంది మహిళలు రగ్గులు, బెడ్డింగ్స్, కుషన్స్ వంటివి తయారు చేసే పనిలో ఉపాధి పొందుతున్నారు. దీపాలి వ్యాపార రంగంలో రాణిస్తున్నందుకు గాను పోర్బ్స్ అత్యంత శక్తివంతమైన మహిళల్లో 16వ స్థానాన్ని కట్టబెట్టింది. తన భర్త ప్రోత్సాహం, కలసి వచ్చిన అవకాశాలు తనను ఉన్నత స్థానానికి చేర్చాయని దీపాలి గర్వంగా చెప్పుకుంటుంటారు.



మదర్ ఆఫ్ టిబెట్!

పిల్లల భవిష్యత్ కోసం కన్నతల్లి ఎలాంటి తపనపడుతుందో.. అంతకంటే వందరెట్లు ఆలోచించి వారికి బంగారు భవిష్యత్‌ను చూపించింది. విద్య, వైద్యం, తిండి.. అన్నీ తానే చూసుకొని.. వేలాదిమందికి అమ్మ అయింది.

మనకు జట్సన్ పెమా అంటే తెలియకపోవచ్చు. కానీ టిబెటియన్లకు మాత్రం ఆమె జన్మనిచ్చిన అమ్మకంటే ఎక్కువ. పెమాను చాలామంది ప్రముఖ బౌద్ధమత గురువు దలైలామాకు చెల్లెలుగానే గుర్తిస్తారు. కానీ టిబెటియన్లు.. గుండెల్లో పెట్టుకొని ఆరాధిస్తారు. ఎందుకంటే.. టిబెటియన్లకు నాడు పెమా చేసిన సేవ అలాంటిది. 1964లో సంక్షోభం రావడంతో టిబెట్ నుంచి వేలాదిమంది ఇతర దేశాలకు వలస వెళ్లారు. సరిహద్దుల వెంట పడిగాపులు కాశారు. అలాంటి వారందరినీ ఒక్కచోటుకు చేర్చి.. తనకు పరిచయం ఉన్నవారు, ధార్మిక సంస్థల ద్వారా నిధులు సేకరించి టిబెటియన్ల పిల్లలకు ఉచిత భోజనం, చదువు, ఆరోగ్యం అందించింది. పదుల సంఖ్యలో పాఠశాలలు, కాలేజ్‌లు, వృత్తి శిక్షణా సంస్థలు, కేర్ సెంటర్లు, హాస్టళ్లు, పెద్దలకు ఇండ్లు ఏర్పాటు చేయించింది. అలా ఆ సంక్షోభం నుంచి దాదాపు 15 వేలమంది చిన్నారులను కాపాడి.. వారికి బంగారు భవిష్యత్‌ను అందించింది. పెమా ఏర్పాటు చేసిన సంస్థల నుంచి యేటా 50వేల మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టింది. రాయబారిగా, అమ్మగా టిబెటియన్లను కాపాడుకుంటూ గుర్తింపు తెచ్చుకున్నది. పెమా సేవలకు గుర్తింపుగా.. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. భారత ప్రభుత్వం పెమాను ఘనంగా సత్కరించింది. ప్రతిష్ఠాత్మకమైన 'నారీశక్తి' అవార్డుతో గౌరవించింది. అందుకే ఆమెను 'మదర్ ఆఫ్ టిబెట్' అంటుంటారు.



నల్లని వలయాలు తగ్గాలంటే..

నిద్రలేమి వల్ల, ఒత్తిడి వల్ల కండ్ల చుట్టూ నల్లని వలయాలు వచ్చేస్తాయి. నల్లని వలయాలు పోగొట్టుకోవడం కోసం ఏం వాడాలి? తెలుసుకుందాం.

- కలబంద గుజ్జు చర్మానికి తేమ, పోషణను అందిస్తుంది. చర్మానికి చల్లదనం చేకూర్చి కళ్ల చుట్టూ చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది. అందుకే ఆ ఆకును కోసి, గుజ్జును తీసి కళ్ల చుట్టూ మర్దనా చేసి కొద్దిసేపటి తర్వాత కాటన్‌తో తుడిచేయాలి.
- పసుపు సహజంగా చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. దీంట్లో కొబ్బరి లేదా బాదం నూనెలను వేసి బాగా కలుపాలి. ఈ ముద్దను కంటి చుట్టూ పట్టించి పదినిమిషాల పాటు వదిలేయాలి. తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- గుప్పెడు పుదీనా ఆకుల్లో కొన్ని చుక్కల నీటిని కలిపి ముద్దగా నూరాలి. ఈ ముద్దను కళ్ల చుట్టూ పట్టించి పది నిమిషాల తర్వాత కడిగేస్తే సరిపోతుంది.
- నిమ్మరసంలో విటమిన్ సి కళ్ల చుట్టూ ఉన్న వలయాలను తగ్గిస్తుంది. నిమ్మరసంలో దూదిని ముంచి కళ్ల చుట్టూ రాయాలి. ఆరిపోయిన తర్వాత కడిగేయాలి. ఆ తర్వాత మాయిశ్చరైజింగ్ తప్పక రాయాలి. ఇలా చేస్తే చర్మం పొడిబారదు.



బొమ్మలతో రికార్డు

ఇంట్లో వాడేసిన డబ్బాలు, అట్టలను ఏం చేస్తున్నారు? చాలా సింపుల్‌గా పడేస్తున్నామంటారు చాలామంది. పాత వస్తువులను కొత్త బొమ్మలుగా మలిచి రికార్డు సృష్టించింది విజిత.

చెత్త నుంచి కూడా కొత్త ఆలోచనలు పుట్టినప్పుడు మనలోని గొప్పతనం బయటపడుతుంది. విజిత విషయంలో కూడా తన సృజనాత్మకత అలాగే బయటపడింది. ఇంట్లో చెత్తబుట్టలో పడేసిన వస్తువులను అలా వదిలేయకుండా బొమ్మలు తయారు చేయాలనుకున్నది. ప్రయత్నించింది. బొమ్మలు తయారు చేయడం నేర్చుకున్నది. విజయం సాధించింది. విజిత సృజనాత్మకతకు 2016 సంవత్సరంలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకెక్కింది. పారేసిన చెత్త డబ్బాలతో ఒక్క నెలలో 50 అడుగుల నెక్లెస్ తయారు చేసింది. అంతేకాదు ఐదు నెలల కాలంలో 1350 బొమ్మలు తయారు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో కూడా తన పేరును లిఖించుకున్నది. ప్రస్తుతానికి డూ ఇట్ యువర్‌సెల్ఫ్ (డీఐవై) క్లాసులు ఆన్‌లైన్‌లో చెప్తున్నది. త్వరలో బొమ్మలు ఎలా చేయాలి అనే అంశం మీద పుస్తకాన్ని విడుదల చేయనున్నట్టు చెప్తున్నది విజిత.





అడుగండి చెబుతా

నా వయసు 60 సంవత్సరాలు. సెల్యులైటిస్‌తో బాధ పడుతున్నాను. ఇది కుడి మోకాలు నుంచి పాదం వరకు వ్యాపించి ఉంది. ఆరు నెలల క్రితం ఆపరేషన్ చేశారు. అయినా అప్పుడప్పుడు కాలిలో వాపు వస్తున్నది. గతంతో పోలిస్తే బరువు కూడా తగ్గాను. సెల్యులైటిస్ గురించి పూర్తిగా తెలియజేయగలరు.

- కేబీఆర్, బోధన్

ఎందుకిలా వాస్తున్నది?

సెల్యులైటిస్ ఒక చర్మ వ్యాధి. చర్మపు పొరల్లో దిగువన ఉండే మృదు కణజాలాలపై బ్యాక్టీరియా దాడి వల్ల చర్మంలో పగుళ్లు ఏర్పడుతాయి. సెల్యులైటిస్ శరీరంలోని ఏ భాగంలోనైనా ఏర్పడవచ్చు. గాయాల వల్ల చర్మం చీలిపోవడం, సర్జరీల తర్వాత వచ్చే ఇన్‌ఫెక్షన్లు, ఎగ్జిమా, సొరియాసిస్ వంటి చర్మ వ్యాధులు, చాలా కాలంగా మాయని గాయాలు, శరీరంలోని ఏదైనా భాగానికి రక్తప్రసరణ జరగకపోవడం, సెల్యులైటిస్ రావడానికి కారణం అవుతాయి. ప్రభావిత భాగంలో వాపు, చర్మం ఎర్రగా మారడం, నొప్పి, చీము రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సెల్యులైటిస్‌ను నిర్ధారించేందుకు ప్రభావితం భాగంలోని చర్మ కణాలను సేకరించి కల్చర్ టెస్ట్ చెయ్యాల్సి ఉంటుంది. వ్యాధి ప్రభావిత భాగానికి విశ్రాంతినివ్వడం, తక్కిన శరీరం కంటే కాస్త ఎత్తులో ఉంచడం, బాధ నివారణి మాత్రలు తీసుకోవడం ద్వారా సెల్యులైటిస్ నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా ఉంటే యాంటీ బయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. చాలా తీవ్రంగా ఉంటే ఇంట్రామస్క్యులార్ ఇంజక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. జ్వరం, వణుకు, వికారంగా ఉండడం, వాంతులు, తిమ్మిరిగా అనిపించడం, నొప్పి చాలా ఎక్కువగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే అత్యవసర పరిస్థితిగా భావించి వెంటనే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఒక్కోసారి సర్జరీ ద్వారా ప్రభావిత భాగంలో చేరిన చీము తొలగించడం, ఆ భాగంలో రక్తప్రసరణ మెరుగుపరచడం, మరణించి కణజాలాలను తొలగించడం చేస్తారు. ఇది కొద్ది రోజుల్లోనే అదుపులోకి వచ్చే ఇన్‌ఫెక్షన్. చాలా అరుదుగా శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి తగ్గడానికి సమయం తీసుకుంటుంది. వ్యక్తిగత శుభ్రత పాటించాలి, చెప్పులు లేకుండా వీధుల్లో తిరగకూడదు. సరైన సైజు బూట్లు, చెప్పులు ధరించాలి, సాక్స్ లేకుండా బూట్లు ధరించొద్దు. చర్మం మీద ఏర్పడిన గాయాలు ఒక అంగుళం కంటే లోతుగా ఉంటే తప్పనిసరిగా డాక్టర్‌కు చూపించుకొని చికిత్స తీసుకోవాలి.



డాక్టర్ దేవేందర్‌సింగ్
సీనియర్ వాస్క్యులార్ అండ్ ఎండో వాస్క్యులార్ సర్జన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 26 మార్చి 2018

పది దేశాల కూటమి ఆసియాన్

- తమ ప్రాంత సుస్థిరత, రాజకీయ, ఆర్థిక రంగాల్లో పరస్పర సహకారం కోసం ఆసియా ఖండంలోని దక్షిణ తూర్పు ప్రాంతంలో ఉన్న పది దేశాలు కలిసి 1967, ఆగస్టు 8న బ్యాంకాక్‌లో 'అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఆసియన్ నేషన్స్ (ఆసియాన్)'గా కూటమిని ఏర్పాటు చేసుకున్నాయి. ఇందులో థాయ్‌లాండ్, వియత్నాం, మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, మయన్మార్, కంబోడియా, లావోస్, బ్రూనై సభ్యదేశాలుగా ఉన్నాయి.
- ఈ కూటమి ఏర్పాటులో ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్ దేశాల విదేశాంగ మంత్రులు ప్రధాన పాత్ర పోషించారు. ఇవి ప్రారంభ సభ్యదేశాలు కాగా, బ్రూనై 1984, జనవరి 7న, వియత్నాం 1995, జూలై 28న, లావోస్ 1997, జూలై 23న, కంబోడియా 1999, ఏప్రిల్ 30న సభ్యులుగా చేరాయి.
- కూటమి సెక్రటేరియట్‌ను 1976, ఫిబ్రవరిలో జకార్తాలో ఏర్పాటు చేశారు.
- ఆ దేశాల రాజధానులు, అధ్యక్షులు/ప్రధానులు..
- సింగపూర్ ప్రధాని లీ సిన్ లూంగ్, రాజధాని సింగపూర్
- ఇండోనేసియా పరిపాలకుడు అధ్యక్షుడు జోకో విడోడో, రాజధాని జకార్తా
- మయన్మార్ అధ్యక్షుడు మింట్ స్వే (తాత్కాలిక), రాజధాని నేపితా
- వియత్నాం ప్రధాని ఎన్‌గ్యుయెన్ జువాన్ ఫ్యుసి, రాజధాని హనోయ్
- ఫిలిప్పీన్స్ అధ్యక్షడు రోడ్రిగో డ్యుటెర్టె, రాజధాని మనీలా
- మలేషియా ప్రధాని నజీబ్ రజాక్, రాజధాని కౌలాలంపూర్
- థాయ్‌లాండ్ ప్రధాని ప్రయూత్ చాన్ ఓ చా, రాజధాని బ్యాంకాక్
- బ్రూనై సుల్తాన్ హసనల్ బోల్కియా, రాజధాని బండార్ సెరి బెగవాన్.
- లావోస్ ప్రధాని థాంగ్లోవున్ సిసోయులిత్, రాజధాని వియత్నాం
- కంబోడియా ప్రధాని హున్ సెన్, రాజధాని ఫ్నోమ్ పెన్హ్



త్వరిత ఉపాధి మార్గం ఐటీఐ



ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ప్రభుత్వ), ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్ (ప్రైవేటు)లు సాంకేతిరంగంలో శిక్షణ ఇచ్చే సంస్థలు. ఇవి కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రెయినింగ్ (డీజీఈటీ) పర్యవేక్షణలో పనిచేస్తున్నాయి. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెయినింగ్ (ఎన్‌సీవీటీ) అనుబంధంగా రాష్ట్రంలో 54 ప్రభుత్వ, 222 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెయినింగ్ (ఎస్‌సీవీటీ) అనుబంధంగా రాష్ట్రంలో 10 ఐటీఐలు నడుస్తున్నాయి. ప్రతి ఏటా మే/జూన్‌లో ఐటీఐ కోర్సుకు నోటిఫికేషన్ విడుదలవుతుంది.

- అభ్యర్థులు కోర్సు ఎంపిక చేసుకునే ముందు 'ఎందుకోసం ఆ కోర్సును ఎంపిక చేసుకుంటున్నాం' అని విశ్లేషించుకోవాలి. స్వయం ఉపాధి కోసమైతే మెకానిక్ మోటార్ వెహికల్, మెకానిక్ రేడియో, టీవీ, మెకానిక్ రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషన్, పెయింటర్ జనరల్, ప్లంబర్ వంటి కోర్సులు మేలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందాలనుకునే వారు ఐటీఐలలో ఇంజినీరింగ్ కోర్సుల వైపు దృష్టి సారించాలి.
- **కోర్సు వ్యవధి:** రెండేండ్లు (నాలుగు సెమిస్టర్లు)/ ఏడాది (రెండు సెమిస్టర్లు), ఆరు నెలలు (ఒక సెమిస్టర్ మాత్రమే)
- **విభాగాలు:** ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/స్టేట్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్/సీబీఎస్‌సీ, ఐసీఎస్‌ఈ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్‌ఐఓఎస్), తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీవోఎస్‌ఎస్) నుంచి ఎస్‌ఎస్‌సీ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎనిమిదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా కొన్ని ట్రేడుల్లో ప్రవేశానికి అర్హులు.
- **ఎంపిక:** ఎస్‌ఎస్‌సీ మార్కుల ఆధారంగా ఉంటుంది. సీట్ల కేటయింపు నియమనిబంధనల మేరకు మెరిట్ కం రిజర్వేషన్ ఆధారంగా జరుగుతుంది.

ఇంజినీరింగ్ కోర్సులు

- అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ (ఏడాది), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ (రెండేండ్లు), డ్రాఫ్ట్స్‌మెన్ మెకానికల్ (రెండేండ్లు), ఎలక్ట్రీషియన్ (రెండేండ్లు), ఎలక్ట్రానిక్ మెకానిక్ (రెండేండ్లు), ఎలక్ట్రోప్లేటర్ (రెండేండ్లు), ఫిట్టర్ (రెండేండ్లు), ఫౌండ్రీమెన్ (ఏడాది), ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ మెయింటెనెన్స్ (రెండేండ్లు), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ (రెండేండ్లు), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ కెమికల్ ప్లాంట్ (రెండేండ్లు), మెషినిస్ట్ (రెండేండ్లు), మెషినిస్ట్ గ్రైండర్ (రెండేండ్లు), మెకానిక్ కంప్యూటర్ హార్డ్‌వేర్ మెషినిస్ట్ (రెండేండ్లు), మెకానిక్ డీజిల్ (ఏడాది), మెకానిక్ మెషీన్ టూల్స్ మెయింటెనెన్స్ (మూడేండ్లు), మౌల్డర్ (ఏడాది), ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్ (ఏడాది), ప్లంబర్ (ఏడాది), టర్నర్ (రెండేండ్లు), షీట్ మెటల్ వర్కర్ (ఏడాది).

నాన్ ఇంజినీరింగ్ కోర్సులు

- బుక్ బైండింగ్ (రెండేండ్లు), కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (ఏడాది), కటింగ్ అండ్ సీవింగ్ (ఏడాది), డాటా ప్రిపరేషన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ (ఏడాది), డ్రెస్ మేకింగ్ (ఏడాది), హ్యాండ్ కంపోజిటర్ (ఏడాది), హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఏడాది), లెటర్ ప్రెస్ మెషిన్ మైండర్, లిథో ఆఫ్‌సెట్ మెషిన్ మైండర్, సెక్రటేరియల్ ప్రాక్టీస్, స్టెనోగ్రఫీ ఇంగ్లిష్ (ఏడాది)

అప్రెంటిస్‌షిప్

- ఐటీఐ ఉత్తీర్ణులయ్యాక అభ్యర్థి సంబంధిత జిల్లా అసిస్టెంట్ అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ సంస్థల్లో అప్రెంటిస్‌షిప్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఆయా సంస్థల నిబంధనల ప్రకారం అప్రెంటిస్‌షిప్ కాలపరిమితి ఉంటుంది. సాధారణంగా ప్రభుత్వరంగ సంస్థల్లో ఏడాది, ప్రైవేటు సంస్థల్లో ఆరు నెలలు ట్రెయినింగ్ ఉంటుంది. ఈ సమయంలో స్టయిఫండ్ చెల్లిస్తారు. జాతీయ అప్రెంటిస్‌షిప్ పరీక్ష ఉత్తీర్ణులైతే సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం తప్పనిసరిగా ఐటీఐతో పాటు అప్రెంటిస్‌షిప్ చేసి ఉండాలి. ఉదాహరణకు ఐటీఐ ఫిట్టర్ పూర్తిచేసినవారు బీహెచ్‌ఈఎల్, బీఈఎంఎల్, హాల్, బీఎస్‌ఈసీఓఎం, కేపీటీసీఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలు, టొయోటా, మారుతి, టాటా, హోండా, ఎక్సైడ్ తదితర ప్రైవేటు రంగ సంస్థలు అప్రెంటిస్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నాయి.

ఉన్నత విద్య వైపు

- ఐటీఐ పూర్తి చేసిన తర్వాత చదువును కొనసాగించాలనుకునే వారికి అత్యుత్తమమైన మార్గం పాలిటెక్నిక్ డిప్లొమాలో ప్రవేశం పొందడం. సంబంధిత ట్రేడ్‌లో మాత్రమే పాలిటెక్నిక్‌లో చేరడానికి అవకాశం ఉంటుంది. ఆ తర్వాత కూడా ఇంజినీరింగ్ చదవవచ్చు. ఆపైన ఎంటెక్ చేయడానికీ అవకాశం ఉంటుంది.
- ఐటీఐ పూర్తిచేసిన తర్వాత జనరల్ డిగ్రీలో ప్రవేశం పొందవచ్చు.

తక్షణం స్వయం ఉపాధి

- ఐటీఐ పూర్తి చేసిన వారికి ఉపాధికి ఢోకా ఉండదు. పై చదువులు, ప్రభుత్వ ఉద్యోగాల వైపు ఇష్టం లేనివారు.. స్వయం ఉపాధి పొందవచ్చు. మరికొందరికి ఉపాధి చూపవచ్చు. ఇందుకు అనువైన కోర్సులు మెకానిక్ మోటార్ వెహికల్, మెకానిక్ రేడియో, టీవీ, మెకానిక్ రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషన్, పెయింటర్ జనరల్, ప్లంబర్, శానిటరీ, ఫిట్టర్, వెల్డర్ గ్యాస్, ఎలక్ట్రానిక్, వైర్‌మెన్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్. ఐటీఐలో థియరీ కంటే ప్రాక్టికల్‌కే ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి నేర్చుకోవాలనే తపన కష్టపడేతత్వం ఉంటే బహుముఖ నైపుణ్యాలను సొంతం చేసుకుని స్వయం ఉపాధితో రాణించవచ్చు.

ఉద్యోగావకాశాలు

- ఐటీఐ డీజిల్ మెకానిక్ పూర్తిచేసిన వారికి ప్రభుత్వరంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి. డీజిల్ మెకానిక్ పూర్తిచేసిన వారికి భారతీయ రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ రవాణాశాఖ, రక్షణరంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.
- ఐటీఐ ఎలక్ట్రీషియన్ వారికి ఇండియన్ రైల్వే, డీఆర్‌డీఓ, బీఎస్ఎన్ఎల్ టీటీపీ, ఎంటీఎన్ఎల్, ఎలక్ట్రిసిటీ బోర్డు, ఎన్‌పీసీ, సెయిల్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.
- ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్ అండ్ బీ శాఖలో సివిల్ వర్క్స్, ల్యాండ్ సర్వేయర్లుగా ఉద్యోగాలు పొందడానికి అవకాశం ఉంటుంది.
- ఐటీఐ టర్నర్ పూర్తిచేసిన వారికి ఉత్పత్తి, తయారీ పరిశ్రమలు, ఆటోమొబైల్ అనుబంధ ఫ్యాక్టరీల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వేలు, షిప్ బిల్డింగ్, రిపేర్, మౌలిక వసతులు, రక్షణరంగంతోపాటు ప్రభుత్వరంగ సంస్థలైన బీహెచ్‌ఈఎల్, బీఈఎంఎల్, ఎన్‌టీపీసీ, సైనికపరమైన వర్క్‌షాప్‌లలో ఉపాధికి అవకాశం ఉంటుంది.
- ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్ (మెకానికల్) ప్రభుత్వ రక్షిత భవనాల సంరక్షణ, ఉత్పత్తి, తయారీ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. నిర్మాణ రంగంలో అవకాశాలకు కొదవ ఉండదు. సేవారంగాలైన రవాణా, రైల్వేలు, షిప్ బిల్డింగ్, ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమలతోపాటు బీహెచ్‌ఈఎల్, బీఈఎంఎల్, ఎన్‌టీపీసీ తదితర ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో మౌలిక సదుపాయాల కల్పనలో అవకాశాలు ఉంటాయి.
- ఐటీఐ అటెండెంట్ ఆపరేటర్ (కెమికల్ ప్లాంట్) పూర్తిచేసిన వారికి కెమికల్ ప్లాంట్లలో మెషీన్ ఆపరేటర్‌గా ఉద్యోగావకాశాలు ఉంటాయి.
- ఐటీఐ ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ పూర్తిచేసిన వారు మెకానికల్ ఇన్‌స్ట్రుమెంట్ ఇతర సంబంధిత వస్తువుల మరమ్మతుల కోసం సొంతంగా వర్క్‌షాప్‌ను ప్రారంభించవచ్చు.



... సాయికిరణ్ వేముల

సంస్కరణోద్యమాలు

- 19వ శతాబ్దంలో ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానం భారతీయుల మనస్సులను వికసింపజేసి, యథార్థానికి నాటి ప్రపంచ పోకడలను సన్నిహితంగా తీసుకొచ్చింది. కొంతకాలం వరకు భారతీయులు పాశ్చాత్య విద్యతోపాటు ఫ్రాన్స్‌లో వెల్లివిరిసిన హేతువాద ప్రభావాల్లో ఉండిపోయారు. 'నాటి భారతీయ పునరుజ్జీవనోద్యమం నిజమైందని, కాన్‌స్టాంటినోపుల్ నగర పతనం తర్వాత ఐరోపాలో జరిగిన విప్లవాత్మకమైన ఉద్యమం కంటే తీవ్రమైందని, విస్తృతమైనదని సర్ జాదునాథ్ సర్కార్ అభిప్రాయపడ్డారు.
- మత సంస్కరణ అనేది హిందువులకు కొత్తకాదు. భారతదేశ చరిత్ర పరిశీలిస్తే వేదకాలం నుంచి హిందూమతం సంస్కరణలకు లోనైనట్లు మనకు తెలుసు. వేదమతం నుంచి ఉపనిషత్తుల మతాలకు, బౌద్ధ, జైన మతాలకు మార్పులు గమనించడమైంది. తర్వాత కాలంలో ఇస్లాం మత ప్రభావం వల్ల హిందూ మతంలో జ్ఞాన, కర్మ మార్గాల స్థానంలో అందరికీ సులభమార్గమైన భక్తి మార్గం ద్వారా మోక్షాన్ని పొందవచ్చనే భావన కలిగి మధ్యయుగ శతాబ్దాల్లో చైతన్యుడు, వల్లభాచార్యుడు, కబీర్, తుకారాం, గురునానక్, రాందాస్ వంటి భక్తులు ప్రచారం చేశారు.
- 19వ శతాబ్దంలో క్రైస్తవ మతవ్యాప్తిని అరికట్టడం కోసం, తమ మతస్తులకు మతంపై విశ్వాసం సన్నగిల్లకుండా ఉండటం కోసం హిందూమత సంస్కరణోద్యమానికి పూనుకున్నారు. సూక్ష్మంగా పరిశీలిస్తే పునరుజ్జీవనోద్యమానికి ప్రాచీన భారతీయ సాహిత్య అధ్యయనం, ఆంగ్ల విద్య, సాహిత్య ప్రభావం, జాతీయతా భావాలు, భారత సంస్కృతిని అణచివేయడానికి విదేశీయులు పాటించిన విధానాలు ముఖ్య కారణంగా కనిపిస్తాయి. ఇందులో భాగంగా పాశ్చాత్య భావాలను అలవర్చుకోవడం, వితంతు పునర్వివాహం, కులాంతర వివాహాలు, స్త్రీ విద్య తదితర డిమాండ్ల మూలంగా, సాంఘిక ధోరణులు వాటంతటవే ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



రాజా రామ్మోహన్‌రాయ్ (1772-1833)

- 1772లో బెంగాల్‌లోని రాధానగర్‌లో రాజా రామ్మోహన్ రాయ్ జన్మించాడు.
- రాజారామ్మోహన్‌రాయ్‌ను భారతదేశంలో మొదటి 'మోడ్రన్ మ్యాన్'గా కీర్తిస్తారు.
- సాంఘిక, మత, రాజకీయ ఉద్యమాలకు నాంది పలికాడు. ఈయనను 'భారతదేశ సంఘ సంస్కరణ పిత'గా పేర్కొంటారు.
- ఈయన ఐరోపా ఉదారభావం వల్ల ప్రభావితుడయ్యాడు.
- వివిధ గ్రంథాల్లో వాస్తవంగా ఏం చెప్పారో తెలుసుకోవాలనే ఉద్దేశంతో పర్షియన్, అరబిక్, సంస్కృతం, ఇంగ్లిష్, ఫ్రెంచి, లాటిన్, గ్రీకు, హిబ్రూ భాషలను నేర్చుకున్నాడు.
- ఈయన ఏకేశ్వరోపాసనను నమ్మాడు. విగ్రహారాధనను వ్యతిరేకించాడు. ఈ నేపథ్యంలో 1803లో పర్షియన్ భాషలో 'తువఫత్ ఉల్ మొహావుద్దీన్' లేదా A GIFT TO MONOTHEISTS అనే గ్రంథం రాశాడు.
- మత అంశాల్లో హేతుబద్ధతకు, మానవ పరిశీలనా శక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పాడు.
- 1815లో హిందూమతంలోని సాంఘిక చెడులను తొలిగించడానికి 'ఆత్మీయ సభ'ను కలకత్తాలో ఏర్పాటు చేశాడు. ఇదే 1828లో 'బ్రహ్మ సమాజం'గా మారింది.
- క్రైస్తవ మతంలో హేతుబద్ధత లేని అంశాలను విమర్శిస్తూ 1820లో 'THE PRECEPTS OF JESUS, THE GUIDE TO PEACE AND HAPPINESS అనే గ్రంథాలు రాశాడు.
- క్రైస్తవ మిషనరీల విమర్శలకు వ్యతిరేకంగా వేదాంత తత్వంలోని గొప్పతనాన్ని బలపరిచాడు.
- ఈయన 1829లో సతీసహగమన చట్టం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించాడు.
- ఆధునిక విద్యావిధానం ఇంగ్లిష్ మాధ్యమం ద్వారా అందాలని పోరాడాడు. ఈ నేపథ్యంలో 'మెకాలే బిల్లు' వచ్చింది.
- భారతదేశంలో రాజకీయ ఆలోచనలను చేసిన మొదటి వ్యక్తి రాజా రామ్మోహన్‌రాయ్ ప్రజలకు సంబంధించిన అంశాలపై పాలనలో మార్పు రావాలని, ప్రజా ఆందోళనను నిర్వహించిన మొదటి వ్యక్తి.

బ్రహ్మ సమాజం (1828)

- హిందూ మతంలోని పవిత్రతను కాపాడాలని, ఏకేశ్వరోపాసనను పెంచాలనే లక్ష్యంతో 1828లో బ్రహ్మ సమాజాన్ని కలకత్తాలో స్థాపించాడు.
- బ్రహ్మ సమాజం సభ్యులు ఒకే దైవాన్ని నమ్మారు. రామ్మోహన్‌రాయ్ వర్ణవ్యవస్థను, ఛాందస బ్రాహ్మణుల క్రౌర్యాన్ని, కర్మకాండను, విగ్రహారాధనను ఖండించాడు.
- హిందూ మతంలోని లోపాలను తొలిగించి, వేదాలను, ఉపనిషత్తులను ఆధారంగా చేసుకుని, ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించాలనేదే బ్రహ్మసమాజం ప్రధాన ఆశయం.
- ఈయన నాయకత్వంలో బ్రహ్మ సమాజం సతీసహగమనాన్ని, బాల్య వివాహాలను తీవ్రంగా వ్యతిరేకించింది.
- బ్రహ్మసమాజం అనుసరించిన ముఖ్య సిద్ధాంతం ఏకేశ్వరోపాసన. ఇది విశ్వమానవ సౌభ్రాతృత్వ సిద్ధాంతాన్ని ఎలుగెత్తి చాటింది. అన్ని మతాలను, మత గ్రంథాలను గౌరవించాలని ఉపదేశించింది.
- కానీ, ఏ మత గ్రంథాన్ని ప్రామాణికంగా స్వీకరించలేదు. బ్రహ్మ సమాజాన్ని సాంఘిక మత సంస్కరణోద్యమంగా వర్ణించవచ్చు.
- రాజా రామ్మోన్‌రాయ్ తన భావాలను ప్రచారం చేయడానికి సంవాద కౌముది, మిరాత్ ఉల్ అక్బర్ అనే పత్రికలను స్థాపించాడు.
- ఈయనకు చివరి మొగల్ చక్రవర్తుల్లో ఒకరైన రెండో అక్బర్ 'రాజా' అనే బిరుదును 1830లో ఇచ్చాడు.
- 1833లో రాజా రామ్మోహన్‌రాయ్ రెండో అక్బర్ పెన్షన్ కోసం బ్రిటన్ కోర్టులో వాదిస్తూ 'బ్రిస్టల్' నగరంలో మృతిచెందాడు.
- ఈయన మరణానంతరం విశేషానుభవజ్ఞులు, సంస్కారవంతులైన ఇతని అనుచరులు దేవేంద్రనాథ్‌ఠాగూర్, కేశవ చంద్రసేన్‌లు బ్రహ్మ సమాజం బాధ్యతలను భుజానికెత్తుకున్నారు.

దేవేంద్రనాథ్ ఠాగూర్ (1817-1905)

- ఈయన రాజా రామ్మోహన్‌రాయ్ ఆలోచనలను, భావాలను వ్యాప్తి చేయడానికి 'తత్వబోధిని సభ'ను 1839లో స్థాపించాడు. బెంగాలీ భాషలో 'తత్వబోధిని' అనే పత్రికను ప్రారంభించాడు.
- ఈ పత్రికకు ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రాజేంద్ర లాల్‌లు వ్యాసాలు రాసి పంపేవారు.
- బ్రహ్మసమాజం నిర్వహణలో దేవేంద్రనాథ్ ఠాగూర్‌కు, కేశవచంద్రసేన్‌కు విభేదాలు వచ్చాయి.
- కేశవచంద్రసేన్ కులం పోవాలని, మతపరంగా బ్రహ్మ సమాజం హిందూ మతానికి దూరంగా ఉండాలని తెలిపాడు.
- దేవేంద్రనాథ్ ఠాగూర్ కులాన్ని పోగొట్టలేమని, అందులోని విచక్షణాయుత కాఠిన్యాన్ని తగ్గించేలా ప్రచారం చేయాలని, బ్రహ్మసమాజం హిందూమతంలో ఒక భాగంగా ఉండాలని తెలిపాడు.
- చివరి రోజుల్లో దేవేంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక, మత గ్రంథాల అధ్యయనంలో నిమగ్నమయ్యాడు.

రైతు ఉద్యమాలు

- **రామోసి విప్లవం:** ఈ ఉద్యమాన్ని మహారాష్ట్రలో 'వాసుదేవ్ బలవంత్ పాడ్కే' ప్రారంభించాడు. రామోసీలు, లంగర్‌లు అనే కింది కులాల వారిని చైతన్యపరిచి 1879లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ తిరుగుబాట్లు చేయించాడు.
- **బిజోల ఉద్యమం:** ప్రభుత్వం నిరంతరం పెంచుతున్న పన్నులను చెల్లించకూడదని 1905లో రాజస్థాన్‌లోని మేవార్ ప్రాంతంలో బిజోల రైతులు ఈ ఉద్యమాన్ని చేపట్టారు. దీనికి విజయ్‌సింగ్ పాతిక్, సాధు సీతారాందాస్, మాణిక్‌లాల్ వర్మ నాయకత్వం వహించారు.
- **చంపారన్ సత్యాగ్రహం:** బీహార్‌లోని చంపారన్‌లో 1860 నుంచి 'తీన్ కథియా విధానాన్ని' బ్రిటిష్‌వారు అమలుపరిచారు. 3/20 వంతు నీలిమందును పండించాలని రైతులపై ఒత్తిడి చేయడంతోపాటు ఆ పంటను తక్కువ ధరకు కొనేవారు. 1900లో సింథటిక్ డై నుంచి పోటీ రావడంతో బ్రిటిష్ వ్యాపారులు మరింత తక్కువకు నీలిమందును విక్రయించాలని రైతులను అనేక బాధలు పెట్టారు. ఈ నేపథ్యంలో 1916 లక్నో కాంగ్రెస్ సమావేశంలో 'రాజ్‌కుమార్ శుక్ల' మహాత్మాగాంధీని కలుసుకుని ఉద్యమం చేపట్టాలని కోరారు. 1917లో గాంధీ, బాబు రాజేంద్ర ప్రసాద్ (బీహార్ గాంధీ), నారాయణ సింహ, జేబీ కృపలాని తదితరులతో కలిసి ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం పెంచిన పన్నులను (షారాబేసి) తగ్గించడానికి అంగీకరించింది.
- **ఖేడా లేదా ఖైరా సత్యాగ్రహం:** గుజరాత్‌లోని ఖేరా ప్రాంతంలో పంటలు సరిగా పండకపోయినా పన్నులు చెల్లించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో 1917లో 'మోహన్ లాల్ పాండ్య' ఉద్యమం చేపట్టారు. ఆ తర్వాత ఈ ఉద్యమాన్ని మహాత్మాగాంధీ, వల్లభాయ్ పటేల్, మహాదేశ్ దేశాయ్ చేపట్టి ప్రభుత్వానికి విన్నవించి సానుకూల ఫలితాలు సాధించారు.
- **బర్డోలి సత్యాగ్రహం (1928):** ఉద్యమ నాయకుడు వల్లభాయ్‌పటేల్. అయితే, ఉద్యమ సన్నద్ధతను కళ్యాణ్‌జీ మెహతా, కునవర్జీ మెహతా అనే యువకులు చేశారు. గుజరాత్‌లోని బర్డోలిలో స్థానిక ప్రభుత్వం 22 శాతం భూమి పన్నులు పెంచడంతో ఉద్యమం చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం 'మాక్స్‌వెల్ బ్రూన్‌ఫీల్డ్' అధ్యక్షతన విచారణ కమిటీ వేయగా, నిజానిజాలు నిర్ధారించి పన్నును తగ్గించారు.
- **మోప్లా ఉద్యమం:** కేరళలో ముస్లిం రైతులు కౌలుదారి హక్కుల కోసం 1920లో ఉద్యమం చేపట్టారు. ఖిలాఫత్ ఉద్యమం వీరిని ఉత్తేజపరిచింది. బ్రిటిష్ ప్రభుత్వం ముఖ్య నాయకులను అరెస్టు చేయడంతో ప్రజలు హింసకు పాల్పడ్డారు. ఈ ఉద్యమానికి మహ్మద్ హాజి, అలీ ముసలియార్ నాయకత్వం వహించారు. వ్యవసాయ తిరుగుబాటు కాస్తా మతం రంగు పులుముకుంది. భూస్వాములు హిందూ అగ్రవర్ణాలైన నంబూద్రిలు, నాయర్‌లు అనే బ్రాహ్మణులు. దీంతో వీరిపై దాడులు జరిగాయి. ఈ తిరుగుబాటును బ్రిటిష్‌వారు అణచివేశారు. ఈ సమయంలో 'బ్లాక్ హోల్ పోడనుర్' సంఘటన జరిగింది. రైల్వేవ్యాగన్‌లో 200 మంది తిరుగుబాటుదారులను బంధించడంతో గాలి ఆడక 66 మంది మృతి చెందారు.
- **బోర్సాద్ సత్యాగ్రహం:** పెంచిన పోల్ ట్యాక్స్(దొంగలను అణచివేసి, శాంతిభద్రతలు కాపాడుతున్నామని, కాబట్టి పన్నులను పెంచాలని గుజరాత్‌లో ప్రభుత్వం ఒత్తిడి చేసింది)కు వ్యతిరేకంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ నాయకత్వాన 1923లో ఉద్యమం జరిగింది. ఈ పన్నును ప్రభుత్వం 1924లో ఎత్తివేసింది.
- **కిసాన్ సభ ఉద్యమం:** ఆల్ ఇండియా కిసాన్ సభను 1934లో లక్నోలో స్థాపించారు. ఈ సభకు అధ్యక్షులుగా స్వామి సహజానంద సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా ఎన్‌జీ రంగా వ్యవహరించారు. రైతులకు శిక్షణ ఇవ్వడం కోసం దేశంలో మొదటిసారి రైతు శిక్షణా సంస్థ 'ఇండియన్ పీసెంట్స్ ఇన్‌స్టిట్యూట్'ను ఎన్‌జీరంగా నిడబ్రోలులో ప్రారంభించాడు. బెంగాల్‌లో 1946లో జరిగిన రైతు ఉద్యమాన్ని 'తేబాగా' ఉద్యమం అంటారు. ఈ ఉద్యమానికి సంబంధించి 'ఫ్లాడ్ కమిషన్' వేసి నివారణ చర్యలు చేపట్టారు.



సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
పెద్దపల్లి డిగ్రీ కాలేజీ
9492 575 006

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 26 మార్చి 2018

సూచికలు

ప్రజాస్వామ్య సూచీ

- ప్రజాస్వామ్య సూచీ-2017ను బ్రిటన్‌కు చెందిన సంస్థ 'ది ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఎస్‌యూ)' విడుదల చేసింది. ఈ జాబితాలో మొదటి స్థానంలో నార్వే ఉండగా, ఆ తర్వాత వరుసగా ఐస్‌లాండ్, స్వీడన్, న్యూజిలాండ్, డెన్మార్క్, ఐర్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా, ఫిన్లాండ్, స్విట్జర్లాండ్ ఉన్నాయి. భారత్ 42వ స్థానంలో నిలిచి దోషపూరిత ప్రజాస్వామ్య దేశాల జాబితాలోనే కొనసాగుతుంది. 2016లో భారత్‌కు 32వ స్థానం దక్కింది.

అంతర్జాతీయ మేధో హక్కుల సూచీ

- అమెరికా చాంబర్స్ ఆఫ్ కామర్స్‌లో భాగమైన 'గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ)' 50 దేశాలకు చెందిన అంతర్జాతీయ మేధో హక్కుల సూచీ-2018ని విడుదల చేసింది. ఈ సూచీలో అగ్రస్థానంలో అమెరికా ఉండగా, బ్రిటన్, స్వీడన్, ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వెనెజులా, అల్జీరియా, ఈజిప్టు, పాకిస్థాన్, అర్జెంటీనా కింది నుంచి వరుస స్థానాల్లో ఉన్నాయి. ఈ జాబితాలో భారత్‌కు 44వ స్థానం దక్కింది.

సమ్మిళిత అభివృద్ధి సూచీ

- అభివృద్ధి చెందుతున్న దేశాల సమ్మిళిత అభివృద్ధి సూచీ-2018ని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసింది. ప్రపంచంలో అత్యంత సమ్మిళిత ఆధునిక ఆర్థిక వ్యవస్థల జాబితాలో నార్వే మొదటి స్థానంలో ఉండగా, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల జాబితాలో లిథువేనియా తొలి స్థానంలో ఉంది. భారత్‌కు 62వ స్థానం దక్కింది. అభివృద్ధి- సుస్థిర ప్రగతిలో 66వ స్థానం, తరాల మధ్య సమానత్వంలో 44వ ర్యాంకు వచ్చింది. 2017 జాబితాలో మొత్తం 79 అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ 60వ స్థానంలో ఉంది. 2018 సూచీలో 103 అభివృద్ధి చెందుతున్న దేశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

విశ్వసనీయత సూచీ

- ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ దేశంగా భారత్‌కు మూడో స్థానం లభించింది. ప్రభుత్వం, వ్యాపార రంగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా పనితీరుపై ఎడల్‌మెన్ ట్రస్ట్ బారోమీటర్ అనే సంస్థ అధ్యయనం చేసి ర్యాంకులను ఇచ్చింది. విశ్వసనీయతలో చైనా ప్రథమస్థానం, ఇండోనేషియా ద్వితీయ స్థానంలో నిలిచాయి. 28 దేశాల్లో సర్వే చేయగా, 20 దేశాలు అవిశ్వసనీయ ప్రాంతాలు అనే విభాగంలో చేరాయి.

ప్రతిభా పోటీతత్వ సూచీ

- అడెక్కో, ఇన్‌సీడ్, టాటా కమ్యూనికేషన్స్ సంస్థలు సంయుక్తంగా రూపొందించిన ప్రపంచ ప్రతిభా పోటీతత్వ సూచీలో భారత్‌కు 81వ ర్యాంకు దక్కింది. మేధావులను ఆకర్షించడంలో 98వ స్థానం, మేధావులను నిలుపుకోవడంలో 99వ స్థానం లభించాయి.

బతుకు చిత్రాలు
పండుగలు నృత్యాలు



ఒక ప్రాంత ప్రత్యేకతను, అక్కడి ప్రజల జీవన విధానాన్ని పండుగలు చాటిచెబుతాయి. వారి సంస్కృతి, చారిత్రక నేపథ్యం, వారసత్వాలకు సంప్రదాయ, జానపద నృత్యాలు ప్రతీకలుగా నిలుస్తాయి. ఇలా ప్రత్యేకమైన ఆహార్యం, కళలు తమ పూర్వీకులు ఇచ్చిన ఆస్తిగా భావిస్తూ అవి అంతరించిపోకుండా చూసుకుంటున్నారు గిరిజన, ఆదివాసీలు. సంస్కృతులు, కళలకు నిలయమైన మనదేశంలో వివిధ ప్రాంతాల్లోని పండుగలు, నృత్య రీతులు, గిరిజన జాతులు వంటి విషయాలను తెలుసుకుందాం..

తెలంగాణ

- తెలంగాణ గొప్పతనాన్ని, సంఘటిత జీవన విధానాన్ని చాటే బతుకమ్మ, బోనాలు, పీర్ల పండుగలు రాష్ట్రంలో ముఖ్యమైనవి.
- కాకతీయుల కాలం నుంచి పేరిణి శివతాండవం, బోనాల సందర్భంగా పోతరాజు శివసత్తుల నృత్యాలు, లంబాడీ నృత్యం వారసత్వంగా వస్తున్నాయి. వీటితోపాటు డప్పు నృత్యం కూడా రాష్ట్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది.
- గిరిజన జాతులైన కోయలు, చెంచులు ఇక్కడ ప్రధానంగా ఉన్నారు.

అసోం

- సత్రియా, బిహు వంటి నృత్యాలు సంప్రదాయంగా వస్తున్నాయి. దీంతోపాటు ఓజపాలి, బొహువా, బగురుంబా, ఝుముర్ నృత్యాలు జనాదరణ పొందాయి.
- ముఖ్యమైన పండుగ బోహగ్ బిహు. ఇది రంగాలి బిహు, కటి బిహు, భోగలి బిహు అనే మూడు పండుగల సమాహారం. దీంతో అక్కడ కొత్త ఏడాది ప్రారంభమవుతుంది.
- **గిరిజనతెగలు:** ఛక్మా, ఛుటియా, దిమాసా, హజోంగ్, గారోలు, ఖాసీలు, గంగ్టే.

ఒడిశా

- పంట కోతల సమయంలో జరుపుకొనే నౌఖాయ్, రాజ ప్రభ పండుగలు ఇక్కడ ప్రధానమైనవి. రాజ ప్రభ పండుగ సాంస్కృతిక వారసత్వంగా వస్తున్నది.
- ఒడిస్సీ ఇక్కడి సాంస్కృతిక నృత్యం. ఛౌ, దండ నట, చంగు, కర్మా ప్రధానమైన జానపద నృత్యాలు.
- గిరిజన తెగలైన గడాబా, ఘార, ఖరియా, ఖోండ్, మట్యా, ఓరాన్లు, సంతాళ్లు, రాజౌర్ ఇక్కడ ఉన్నాయి.



ఆంధ్రప్రదేశ్

- కూచిపూడి ఇక్కడి సంప్రదాయ నృత్యం. బుర్రకథ, వీరనాట్యం, బుట్టబొమ్మలు, థింసా, కోలాటం, తప్పెట గుళ్లు వంటి జానపద నృత్యాలు ఉన్నాయి.
- ఇక్కడ సంక్రాంతి, ఉగాది ముఖ్యమైన పండుగలు.
- చెంచులు, భిల్లులు, గోండులు, సవరలు, మన్నెదొర వంటి గిరిజన తెగలు ప్రధానమైనవి.

అరుణాచల్‌ప్రదేశ్

- పులి-నెమలి, బర్డో ఛం, ఛాలో, పోపిర్, అజిలాము వంటి గిరిజన జానపద నృత్యాలు ఉన్నాయి.
- జనవరి, ఫిబ్రవరి మధ్యకాలంలో నిర్వహించే లోసార్ పండుగ ఇక్కడ ప్రధానమైనది. ఇది టిబెటన్ల నూతన సంవత్సర వేడుక.
- అపటానిస్, అబోర్, దఫ్లా, గలోంగ్, మాంబా, షెర్డుక్‌పెన్, సింగ్‌ఫో గిరిజన జాతులు ఇక్కడ కన్పిస్తాయి.

బీహార్

- సంప్రదాయ నృత్యం 'ఛౌ'. బిడేసియా, జాట్-జతిన్, జిజియా, జుమారి, సోహార్-ఖిలౌనా, ఫగువా, డోమ్కచ్‌లు ప్రధాన జానపద, గిరిజన నృత్యాలు.
- ఛాత్ పూజ ఈ రాష్ట్రంలో ముఖ్యమైన పండుగ. దాల్ పూజ అని పిలిచే ఈ పండుగను అక్టోబర్-నవంబర్ నెలల్లో జరుపుతారు. ఈ సందర్భంగా సూర్యుడు, అతని భార్య ఉషలను పూజిస్తారు.
- రాష్ట్రంలో అసుర్, బైగా, బిహోర్, బిర్జియా, చెరో, గోండ్, పర్‌హైయా, సంతాల్, సవరలు వంటి ఆదిమ తెగలు ఉన్నాయి.

ఛత్తీస్‌గఢ్

- ఇక్కడ 'ఛౌ' సంప్రదాయ నృత్యం. పడ్వాని, సువా నాచా, పంతి, కర్మా, రౌత్ నాచా వంటి జానపద కళలు ఉన్నాయి.
- రాష్ట్రంలో ముఖ్యమైన పండుగ బస్తర్ దసరా. ఆగస్టులో ప్రారంభమయ్యే ఈ ఉత్సవం అక్టోబర్ నెల దాకా సుమారు 75 రోజులపాటు జరుగుతుంది. అందువల్ల దీన్ని ప్రపంచంలోనే ఎక్కువ రోజులు జరుపుకునే దసరా పండుగ అని పిలుస్తారు.
- అగరియా, బైనా, భత్రా, బియార్, ఖోండ్, మవసీ, నాగసియా వంటి గిరిజన జాతులు ఇక్కడ ఉన్నాయి.

నాగాలాండ్

- ఇక్కడ హార్న్‌బిల్ ప్రధాన పండుగ. తమ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలవారికి అందించేలా డిసెంబర్ 1 నుంచి 10 వరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహిస్తుంది.
- అంగామి, గారో, కచారి, కుకి, మికిర్, నాగాలు, సెమా వంటి గిరిజన జాతులు కన్పిస్తాయి.



గుజరాత్

- కృష్ణాష్టమి, దీపావళి ప్రధాన పండుగలు.
- సంప్రదాయ నృత్యం గార్బా. దాండియా రాస్, రాస్, తిప్పని, భావై, డాంగీ, హుడో వంటి జానపద, గిరిజన సంప్రదాయ నృత్యాలు ఉన్నాయి.
- బిర్డా, బమ్నా, భిల్, చరాన్, ధోడియా, గమ్టా, పరాధి, పటేలియా ఆదిమ తెగలు ఇక్కడ ప్రధానమైనవి.

గోవా

- పర్యాటకుల స్వర్గధామమైన గోవాలో ప్రధానమైన ఉత్సవం కార్నివాల్. ఫిబ్రవరి నెలలో జరిగే ఈ ఉత్సవం 18వ శతాబ్దం నుంచి ఆనవాయితీగా వస్తున్నది.
- దాలో, దిప్లీ నాచ్, ఘోడే మోడ్నీ, తాల్గాడి, గఫ్, మండో, కుంబీ ఇక్కడ జానపద నృత్యాలు. ప్రత్యేకంగా సంప్రదాయ నృత్యం లేదు.
- ధోడియా, దుబియా, నైక్డా, సిద్ది, వర్లీ అనే గిరిజన తెగలు ఇక్కడ కన్పిస్తాయి.

హర్యానా

- రాస్‌లీలా, ధమాల్, మంజీరా, ఘూమర్, ఫగ్ గిరిజన, జానపద నృత్యాలు ఉన్నాయి.
- రాష్ట్రంలో బైసాఖీ పండుగ ప్రధానమైనది. రబీ పంటకాలంలో ఏప్రిల్ 13 లేదా 14న ఈ పండుగ నిర్వహిస్తారు.

హిమాచల్‌ప్రదేశ్

- హిమాలయాల్లో శివాలయాలకు నెలవైన హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రధాన పండుగ మహాశివరాత్రి.
- ఇక్కడి జానపద, గిరిజన నృత్యాలు.. కుల్లు నాటి, థోడా డ్యాన్స్, దండ్రాస్, ఘురేహి
- గడ్డిస్, గుజ్జర్లు, ఖాస్, లంబా, లాహౌలాలు, పంగ్వాలా, స్వంగ్లా అనే గిరిజన జాతులు నివసిస్తాయి.

జమ్ముకశ్మీర్

- కుద్, దుమ్హాల్, రౌఫ్, భండ్ పతర్, హపిజా, భండ్ జాషన్, బచ్చా నగ్మా అనే జానపద కళారూపాలు ప్రముఖమైనవి.
- జమ్ములోని లఢక్ ప్రాంతంలో హెమీస్ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలో ప్రధాన పండుగల్లో రంజాన్ ఒకటి.
- ఆదిమ జాతులైన బకర్వల్, బల్టీ, బేడా, గర్రా, మోన్, పురిగ్పా, సిప్పి ఇక్కడ ప్రధానమైనవి.

తమిళనాడు

- ఇక్కడ పొంగల్ ప్రధానమైన పండుగ. దీన్ని తమిళనాడు క్యాలెండర్ చివరి రోజు (జనవరి నెలలో)న నిర్వహిస్తారు. జనవరి/ఫిబ్రవరి నెలల్లో వచ్చే ఈ పండుగ పంట కోతలకు సంబంధించినది.
- భరతనాట్యం ఇక్కడి సంప్రదాయ నృత్యం. దీంతోపాటు మయిల్ అట్టమ్, బొమ్మలట్టమ్, కుమ్మి, సిలంబు అట్టం వంటి జానపద కళలు ఉన్నాయి.
- అడియన్, అరనాదన్, ఎరవల్లన్, ఇరులార్, కనికర్, కోటాలు, తోడాలు ప్రధాన గిరిజన జాతులు.

పశ్చిమబెంగాల్

- దుర్గా పూజ ఇక్కడ ప్రధానమైన పండుగ. రాష్ట్రంలోని నలుమూలల్లో ఘనంగా జరుపుకొనే ఈ పండుగను దుర్గోత్సవం అనికూడా పిలుస్తారు.
- ఛవౌ ఇక్కడి సంప్రదాయ నృత్యం. దీంతోపాటు జట్రా, కతి వంటి జానపద కళారూపాలు ఉన్నాయి.
- అసుర, ఖోండ్, హజోంగ్, హో, పర్‌హైయా, రభా, సంతాల్, సవర వంటి గిరిజన జాతులు ఉన్నాయి.

సిక్కిం

- డిసెంబర్ నెలలో వచ్చే బమ్‌చు, పంగ్ లబ్సాల్ ప్రధానమైన పండుగలు. పంగ్ లబ్సాల్ పండుగ సందర్భంగా కాంచనజంగ పర్వతాన్ని సిక్కింను రక్షించే దేవతగా కొలుస్తారు. వీటితోపాటు లసూంగ్ (డిసెంబర్), సగా దవా ప్రధానమైన ఉత్సవాలు.
- ఛు ఫాట్, సింఘీ ఛామ్, యక్ ఛామ్, తషి యంగ్కూ, మరుని వంటి గిరిజన, జానపద నృత్యాలు ఇక్కడ ప్రధానమైనవి.
- గిరిజన జాతులకు చెందిన భుటియా, ఖాస్, లెప్చాలు అధికంగా కన్పిస్తారు.

రాజస్థాన్

- ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్‌లో గాంగౌర్ పండుగ ప్రధానమైనది. దీంతోపాటు పుష్కర్ ఫెయిర్ (పుష్కర్ ఒంటెల ప్రదర్శన) కూడా ప్రముఖమైనది.
- ఘూమర్, కాల్బెలియా, కత్పులి, భోపా, ఛంగ్ వంటి జానపద నృత్యాలు ప్రముఖమైనవి.
- ఆదిమ జాతులైన భిల్లులు, దమారియా, ధన్కా, మీనాలు, పటేలియా, సహరియా ఇక్కడ కన్పిస్తాయి.



పంజాబ్

- లోహ్రీ పండుగ ప్రధానమైనది. జనవరి నెలలో వచ్చే ఈ పండుగను పంజాబీలు, సిక్కులు జరుపుకొంటారు.
- జానపద కళారూపాలైన భాంగ్రా, గిధా, ఝుమర్, లుద్ది, దంకారా ప్రధానమైనవి.

జార్ఖండ్

- తుసు పండుగ ప్రధానమైనది. దీన్ని జనవరి నెలలో పంట కోతల సమయంలో నిర్వహిస్తారు. దీంతోపాటు హోలీ కూడా ఆడుతారు.
- జానపద నృత్యాలైన కర్మా, పైకా, హంటా డ్యాన్స్, ముండారి, బారౌ డ్యాన్స్, జెననా ఝుమర్ ప్రధానమైనవి.
- ఆదివాసీలైన బిర్హోస్, భుమిజ్, గోండ్లు, ఖరియా, ముండా, సంతాల్, సవరలు రాష్ట్రంలో ప్రధానంగా కన్పిస్తారు.

మణిపూర్

- రాష్ట్రంలో కుట్ పండుగ ప్రముఖమైనది. నవంబర్ నెలలో కుకి-చిన్ గిరిజన తెగలు ఈ పండుగను నవంబర్ నెలలో జరుపుకొంటాయి. దీంతోపాటు యోషంగ్ పండుగ కూడా ముఖ్యమైనది.
- మణిపురి డ్యాన్స్ లేదా జగోయ్ ఇక్కడి సంప్రదాయ నృత్యం. దీంతోపాటు థంగ్ టా, ధోల్ చోలమ్, లాయ్ హరౌబా వంటి జానపద నృత్యాలు ఉన్నాయి.
- ఐమోల్, అంగామి, చిరు, కుకి, మొసంగ్, పురుమ్, థడౌ వంటి గిరిజన జాతులు ప్రధానమైనవి.

... గణేష్ సుంకరి

RRB స్పెషల్

జనరల్ సైన్స్ ప్రాక్టీస్ బిట్స్

1. కింది వాటిలో అధిక ప్రొటీన్లుగల ఆహారం? (1)
1) పాలు 2) నూనె 3) చపాతి 4) అన్నం

2. పత్రరంధ్రాల ద్వారా నీటిని ఆవిరి రూపంలో కోల్పోవడాన్ని ఏమంటారు? (1)
1) భాష్పోత్సేకం 2) భాష్పీభవనం
3) బిందు స్రావం 4) విసరణ

3. కింది వాటిలో మలేరియా నివారణకు తోడ్పడే ఔషధం? (2)
1) మార్ఫిన్ 2) క్వినైన్
3) సింకోనా 4) టానిన్స్

4. తాజా ఫలాలు, కూరగాయలు తినడంవల్ల స్కర్వీ వ్యాధి రాదని కనుగొన్న శాస్త్రవేత్త? (4)
1) లెవోయిజర్ 2) లూయీపాశ్చర్
3) విట్టేకర్ 4) జేమ్స్ లిండ్స్

5. కింది వాటిని జతపర్చండి. (2)
ఎ. బ్రయోఫైటా — 1. నాళికాపుంజ కణజాలం ఉంటుంది
బి.టెరిడోఫైటా — 2. నాళికాపుంజ కణజాలం ఉండదు
సి. వివృత బీజాలు — 3. విత్తనాలు బయటకు కనిపిస్తాయి
డి. ఆవృత బీజాలు — 4. విత్తనాలు ఫలం లోపల ఉంటాయి
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-2, బి-1, సి-3, డి-4
3) ఎ-2, బి-1, సి-4, డి-3
4) ఎ-3, బి-4, సి-1, డి-2

6. కిరణజన్య సంయోగక్రియ అంత్యపదార్థం? (1)
1) కార్బోహైడ్రేట్స్ 2) ప్రొటీన్స్
3) విటమిన్స్ 4) లిపిడ్స్

7. కింది వాటిలో ఏ పంటకు ఎక్కువ మొత్తంలో నీరు అవసరం? (3)
1)మ క్కజొన్న 2) పత్తి
3) వరి 4) గోధుమ

8. హానికర రక్తహీనతను కలుగజేసే విటమిన్? (4)
1) B_1 2) B_2 3) B_6 4) B_{12}

9. 'కణశక్తి భాండాగారాలు' అని వేటిని అంటారు? (1)
1) మైటోకాండ్రియా 2) హరిత రేణువులు
3) గాల్జీ సంక్లిష్టం 4) రైబోజోమ్‌లు

10. కింది వాటిలో ద్రవరూప కణజాలం? (2)
1) టెండాన్ 2) రక్తం
3) ఎడిపోజ్ 4) ఏరియోలార్

11. కణంలో నిర్జీవ భాగం ఏది? (2)
1) జీవపదార్థం 2) కణ కవచం
3) ప్లాస్టిడ్స్ 4) ఏదీకాదు

12. కింది వాటిలో నిశాచర జీవి? (4)
1) బొద్దింక 2) గబ్బిలం
3) గుడ్లగూబ 4) పైవన్నీ

13. అతి పురాతన జీవులు ఏ రాజ్యానికి చెందినవి? (3)
1) మెటాఫైటా 2) మెటాజోవా
3) మొనిరా 4) ఫంగై

14. 'సముద్రంపై తేలియాడే పచ్చిక బయళ్లు' అని వేటిని అంటారు? (1)
1) డయాటమ్స్ 2) శిలీంధ్రాలు
3) వైరస్‌లు 4) బ్యాక్టీరియాలు

15. కింది వాటిలో ఏది సరైన వాక్యం? (2)
ఎ. ట్రిపనోసోమా గాంబియన్సీ మానవునిలో 'అతినిద్ర వ్యాధి'ని కలుగజేస్తుంది
బి. ఎంటమీబా హిస్టాలిటికా వల్ల జిగట విరేచనాలు కలుగుతాయి
1) ఎ 2) ఎ, బి 3) బి 4) ఏదీకాదు

16. ప్రపంచంలో మొదట భూమిని చుట్టి వచ్చిన నావికుడు? (1)
1) మాజిలాన్ 2) కోజిలాన్
3) కొలంబస్ 4) కెప్టెన్ కుక్

17. భూమికి సమీపంగా ఉన్న నక్షత్రం? (3)
1) ఓరియన్ 2) ధ్రువ నక్షత్రం
3) సూర్యుడు 4) ఏదీకాదు

18. భూమి చుట్టు కొలత? (3)
1) 45,000 కి.మీ. 2) 43,000 కి.మీ.
3) 40,000 కి.మీ. 4) 42,000 కి.మీ.

19. 'మృత గ్రహం' అని దేన్నంటారు? (1)
1) ప్లూటో 2) బుధుడు
3) శుక్రుడు 4) నెప్ట్యూన్

20. కింది వాటిని జతపర్చండి. (1)
ఎ. పౌనఃపున్యం — 1. హెర్ట్జ
బి. శక్తి — 2. జౌల్
సి. బలం — 3. న్యూటన్
డి. పీడనం — 4. పాస్కల్
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-2, బి-3, సి-4, డి-1
3) ఎ-3, బి-4, సి-1, డి-2
4) ఎ-4, బి-1, సి-2, డి-1

21. స్క్రూగేజీని ఉపయోగించి కొలువగలిగే అతితక్కువ కొలత? (2)
1) 0.001 మి.మీ. 2) 0.001 సెం.మీ.
3) 0.01 సెం.మీ. 4) 0.01 మి.మీ.

22. కింది వాటిలో బొగ్గు అసంపూర్ణంగా మండినప్పుడు విడుదలయ్యే వాయువు? (1)
1) CO 2) CO_2 3) SO_2 4) SO_3

23. సబ్బులో అధికంగా ఉండే పదార్థం? (3)
1) సోడియం సల్ఫేట్
2) పొటాషియం స్టియరేట్
3) సోడియం స్టియరేట్
4) పొటాషియం పెర్మ్యుటేట్

24. గోబర్ గ్యాస్‌లో అధికంగా ఉండేది? (4)
1) ఈథేన్ 2) ప్రొఫేన్
3) బ్యూటేన్ 4) మీథేన్

25. విమానాలు, పక్షులు ఏ సూత్రం ఆధారంగా పైకి ఎగురుతాయి? (1)
1) బెర్నౌలీ 2) పాస్కల్
3) ఆర్కిమెడిస్ 4) బాయిల్

26. ఒక రాయి బరువు గాలిలో 10 గ్రాములు, నీటిలో 8 గ్రాములు. అయిన రాయి సాపేక్ష సాంద్రత ఎంత? (2)
1) 4 2) 5 3) 6 4) 7

27. గుండు పిన్ను పాదరసంపై తేలుతుంది ఎందుకు? (1)
1) సాంద్రత తక్కువ 2) సాంద్రత ఎక్కువ
3) రెండూ సమాన సాంద్రత కలిగి ఉంటాయి
4) ఏదీకాదు

28. కింది వాటిని జతపర్చండి. (3)
ఎ. వైర్‌లెస్ — 1. మార్కోని
బి. సబ్‌మెరైన్ — 2. డేవిడ్ బుష్నల్
సి. టెలిఫోన్ — 3. గ్రాహంబెల్
డి. ఫిల్మ్ — 4. లూయీస్ ప్రిన్స్
1) ఎ-1, బి-2, సి-4, డి-3
2) ఎ-2, బి-1, సి-3, డి-4
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-1, బి-2, సి-3, డి-4

29. కింది వాటిలో త్వరగా ఆవిరయ్యే గుణం కలిగినది? (2)
1) నీరు 2) కిరోసిన్ 3) నూనె 4) ఆముదం

30. ప్రతిధ్వని ఏర్పడటానికి ఉండాల్సిన కనీస దూరం? (1)
1) 11 మీ. 2) 15 మీ. 3) 13 మీ. 4) 9 మీ.

31. బేరియం క్లోరైడ్‌పై వేడిమి చర్య? (4)
1) రసాయన మార్పు 2) భౌతిక మార్పు
3) రసాయన మార్పు, ద్విగత చర్య
4) భౌతిక మార్పు, ద్విగత చర్య

32. చల్లని స్థితిలో జింక్ ఆక్సైడ్ రంగు? (3)
1) పసుపు 2) ఊదా 3) తెలుపు 4) ఎరుపు

33. కింది వాటిలో ఉత్పతనం చెందే పదార్థం? (4)
1) పారఫిన్ మైనం 2) నీరు
3) లెడ్ నైట్రేట్ 4) అయోడిన్

34. కింది వాటిని జతపర్చండి. (2)
ఎ. బెంజీన్ — 1. C_6H_6
బి. ఎసిటలీన్ — 2. C_2H_2
సి. ఎథిలీన్ — 3. C_2H_4
డి. డై బోరేన్ — 4. B_2H_6
1) ఎ-3, బి-1, సి-4, డి-2
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-2, బి-4, సి-1, డి-3

35. టిన్, లెడ్, ఆంటిమొని సంకేతాలు వరుసగా ... (1)
1) Sn, Pb, Sb 2) Sb, Pb, Sn
3) Sb, Pb, An 4) W, Pb, Sb

36. కింది వాటిలో స్వతంత్రంగా ఉండగల పరమాణువు ఏది? (3)
1) హైడ్రోజన్ 2) నైట్రోజన్
3) హీలియం 4) ఆక్సిజన్

37. సంకేతం అనే పదాన్ని మొదటిసారి ప్రవేశపెట్టింది ఎవరు? (1)
1) బెర్జీలియస్ 2) లెవోయిజర్
3) ఓలర్ 4) జోసఫ్‌ప్రౌస్ట్

38. రెండు పదార్థాలు తమలోని మూలకాలను పరస్పరం మార్చుకునే చర్యను ఏమంటారు? (1)
1) రసాయన ద్వంద్వ వినియోగం
2) రసాయన సంయోగం
3) రసాయన వియోగం
4) రసాయన స్థానభ్రంశం

39. నీటిని 'విశ్వ ద్రావణి' అంటారు ఎందుకు? (3)
1) నీరు ప్రపంచంలో చాలా చోట్ల దొరుకుతుంది
2) నీరు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది
3) నీటికి అనేక పదార్థాలను కరిగించుకునే గుణం ఉంది
4) పైవన్నీ

40. తేమ సమక్షంలో సల్ఫర్ డై ఆక్సైడ్ చర్య? (2)
1) భౌతిక చర్య 2) విరంజన చర్య
3) పై రెండూ 4) ఏదీకాదు

41. నేలను సారవంతం చేసే బ్యాక్టీరియా? (1)
1) రైజోబియం బ్యాక్టీరియా
2) నైట్రసో బ్యాక్టీరియా
3) నైట్రిఫయింగ్ బ్యాక్టీరియా
4) డీనైట్రిఫయింగ్ బ్యాక్టీరియా

42. కృత్రిమ సిల్క్ రసాయన నామం? (3)
1) సెల్యులోజ్ ఎసిటేట్ 2) సెల్యులోజ్ క్లోరైడ్
3) సెల్యులోజ్ నైట్రేట్ 4) సెల్యులోజ్ బ్రోమైడ్

43. ఫాస్ఫరస్‌ను శుద్ధిచేయడంలో వాడే రసాయనాలు? (1)
1) $K_2Cr_2O_7$ 2) సజల HCl
3) గాఢ H_2SO_7 4) 1, 3

44. $4P + 3NaOH + 3H_2O \rightarrow PH_3 + A$. ఈ సమీకరణంలో A అంటే? (2)
1) సోడియం హైపోఫాస్ఫైడ్
2) సోడియం హైపోఫాస్ఫేట్
3) సోడియం థయోసల్ఫైడ్
4) సోడియం థయోసల్ఫేట్

45. NaOH ద్రావణానికి ఫినాప్తలీన్ సూచికను కలిపిన ఏర్పడే రంగు? (3)
1) పసుపు 2) నారింజ
3) ఊదా 4) ఆకుపచ్చ

46. చారిత్రక కట్టడాలు రూపు కోల్పోవడానికి ప్రధాన కారకం? (1)
1) SO_2 2) CO_2 3) Cl_2 4) P_2O_5

... తోట నాగరాజు

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 26 మార్చి 2018

విరచిస్తా నేడే నవశకం

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకుడు. డి.వి.వి.ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై దానయ్య నిర్మిస్తున్నారు. కైరా అద్వాణీ కథానాయిక. ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ చిత్రంలోని తొలిపాటను ఆదివారం విడుదల చేశారు. 'విరచిస్తా నేడే నవశకం. నినదిస్తా నిత్యం జనహితం. అలుపెరుగని సేవే అభిమతం. కష్టం ఏదైనా సమ్మతం. భరత్ అనే నేను..హామీ ఇస్తున్నాను. బాధ్యుడనై ఉంటాను. ఆఫ్ ద పీపుల్, బై ద పీపుల్, ఫర్ ద పీపుల్ ప్రతినిధిగా..దిస్ ఈజ్ మి' అనే పల్లవితో సాగే ఈ గీతాన్ని రామజోగయ్యశాస్త్రి రచించారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ పాటను డేవిడ్ సైమన్ ఆలపించారు. 'సంగీతం, సాహిత్యం అర్థవంతంగా కుదిరిన గీతమిది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్, విజన్ ఆఫ్ భరత్ టీజర్‌లకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రవి.కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, సంగీతం: దేవిశ్రీప్రసాద్, సమర్పణ: డి. పార్వతి.



'భరత్ అనే నేను' చిత్రంలో మహేష్‌బాబు



కృష్ణచైతన్య, తమన్, పవన్‌కల్యాణ్, నితిన్, సుధాకర్‌రెడ్డి, మేఘా ఆకాష్, నిఖితారెడ్డి

పవన్‌కల్యాణ్ నాతో సినిమా తీయడం నా అదృష్టం!

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న 25వ చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. కృష్ణచైతన్య దర్శకుడు. మేఘా ఆకాష్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు త్రివిక్రమ్ కథ అందిస్తున్నారు. పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ట్ మూవీస్ పతాకంపై ఎన్.సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పవన్‌కల్యాణ్ ఈ చిత్ర రిలీజ్ లుక్‌ను విడుదల చేశారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 'ఎలాంటి సపోర్ట్ లేకుండా ఫిల్మ్ ఇండస్ట్రీకి వస్తే ఆ బాధ ఎలా వుంటుందో నాకు బాగా తెలుసు. అలాంటి సమయంలో ఎవరికైనా ఒక ఎమోషనల్ సపోర్ట్ వుంటే బాగుంటుందనిపిస్తుంది. అలాంటి సపోర్ట్‌ని నితిన్‌కు అందించాలనే 'ఇష్క్' ఆడియో ఫంక్షన్‌కు వెళ్లడం.. అది విజయం సాధించడం జరిగింది. నితిన్ చెప్పినట్టు చాలా మందికి నా మీద ప్రేముంది. కొంత మంది నా సినిమాలు చూసి ఐటీకి వెళ్లిన వాళ్లున్నారు. అలాగే సినిమాల్లోకి వచ్చిన వాళ్లున్నారు. అయితే వచ్చిన అపజయాలకు కుంగి పోకుండా విజయాలకు పొంగిపోకుండా 16 ఏళ్లలో నితిన్ 25 సినిమాలు చేశాడు. అతనికి నాకు సినిమాల పరంగా నాలుగైదేళ్ల వ్యత్యాసమే. నితిన్, అతని తండ్రి నాకు ఇష్టమైన వ్యక్తులు. కృష్ణచైతన్య బలమైన కథతో ఈ సినిమా చేశాడు. తమన్ సంగీత దర్శకుడు కాకముందు నుంచి నాకు తెలుసు. సంగీత దర్శకుడు మణిశర్మ 'ఖుషీ' చిత్రంలోని 'ఏ మేరా జహా' పాట బాధ్యతను తమన్‌కు అప్పగించారు. ఈ రోజుకూ ఆ పాట అదే స్థాయిలో అలరించడానికి కారణం తమనే. అలాంటి తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకోవాలి' అన్నారు. నితిన్ మాట్లాడుతూ 'ఎవరి సినిమాలు చూస్తూ పెరిగానో... ఎవరిని చూసి హీరో అవుదాం అనుకున్నానో.. ఎవరి సినిమాల కోసం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో బ్యానర్‌లు కట్టి బట్టలు చింపుకుని పేపర్లు ఎగిరేసానో.. ఎవరినైతే ఒక్కసారి చూస్తే చాలు అనుకున్నానో..ఒక్కసారి కలిస్తే చాలు అనుకున్నానో..ఒక్కసారి వారితో ఫొటో దిగితే చాలు అనుకున్నానో..ఒక్కసారి మాట్లాడితే చాలు అనుకున్నానో.. ఆ దేవుడి దయవల్ల అలాంటి పవన్‌కల్యాణ్ అండ నాకు దొరికింది. ఇండస్ట్రీలో నాకున్న అండ పవన్‌కల్యాఖణ్,త్రివిక్రమ్ అని గట్టిగా చెప్పగలను. అభిమాని అయిన నాతో పవన్‌కల్యాణ్‌గారు నిర్మాతగా సినిమా తీయడం నేను చేసుకున్న అదృష్టం. ఈ సందర్భంగా అభిమానుల తరుపున ఒకే ఒకటి ఆయనను అడుగుతున్నాను. సార్ మీకు వీలున్నప్పుడు సినిమాలు చేయండి. చేయనని మాత్రం చెప్పకండి' అని అన్నారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్, త్రివిక్రమ్‌గారిని ఎప్పుడైనా చూస్తే చాలు అనుకున్నాను. నిజంగా నిజాయితీగా ఏదైనా చేస్తే అది నెరవేరుతుందంటారు. నితిన్ చెప్పినట్టు నేను కూడా బలంగా కోరుకున్నానేమో అందుకే పవన్‌కల్యాణ్, తిత్రివిక్రమ్‌తో కలిసి ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మించిన నితిన్ 25 సినిమాకు దర్శకుడినయ్యాను' అని తెలిపారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ ప్రొడక్షన్‌లో నితిన్ నటించడం, పైగా అది అతని 25వ సినిమా కావడం నితిన్ అదృష్టం.సినిమా పెద్ద సక్సెస్ అయి ఈ సమ్మర్‌లో మంచి ఎంటర్‌టైనర్ మూవీ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు. లిజీ మాట్లాడుతూ 'యూత్ స్టార్ నితిన్‌కిది 25వ చిత్రం. తెలుగులో 25 ఏళ్ల తరువాత ఇది నా రీ ఎంట్రీ సినిమా కావడం యాదృచ్ఛికం. రీ ఎంట్రీ కోసం చాలా కథలు విన్నాను. ఫైనల్‌గా ఈ సినిమా ఓకే చేశాను. కృష్ణచైతన్య మంచి ప్యాషన్ వున్న దర్శకుడు. నేను సినిమాల నుంచి తప్పుకునే సందర్భంలో తెలుగులో 20వ శతాబ్దం, మగాడు వంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాను'అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేఘా ఆకాష్, నిఖితారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తమన్, సుధాకర్‌రెడ్డి, జెమిని కిరణ్, బీవీఎస్‌ఎన్ ప్రసాద్, రావు రమేష్, నటరాజ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఇలియానా

ప్రేమకు ఫిదా


చిరకాల ప్రేమికుడు, ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూనీ బోన్‌ను గత ఏడాది చివరలో రహస్య వివాహం చేసుకున్నది గోవా సుందరి ఇలియానా. అయితే తమ ప్రేమ, పెళ్లి వ్యవహారాన్ని ప్రపంచానికి తెలియకుండా గోప్యంగా దాచుతున్నది ఈ సొగసరి. కొంతకాలం క్రితం తన భర్త అంటూ ఆండ్రూ నీబోన్‌ను ఉద్దేశిస్తూ ఓ సామాజిక మాధ్యమంలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా మరోసారి ఎప్పటికి నువ్వే ఉత్తమ భర్త అంటూ ఆండ్రూను ప్రశంసించింది. వివరాల్లోకి వెళితే...ఇటీవలే ఇలియానా అనారోగ్యం బారిన పడిన సమయంలోఆమెను కంటికి రెప్పలా చూసుకున్నారట ఆండ్రూ. దాంతో భర్త ప్రేమకు ఫిదా అయిపోయిన ఇలియానా అతడిని పొగడ్తలతో ముంచెత్తింది. మా ఆయన బెస్ట్ అంటూ కితాబిచ్చింది. ఇలియానా కామెంట్స్ నెటిజన్లను తెగ ఆకట్టుకుంటున్నాయి.



వెంకటేష్

వినోదాలకు సిద్ధం

తెలుగు చిత్రసీమలో మరో సరికొత్త మల్టీస్టారర్‌కు రంగం సిద్ధమైంది. వెంకటేష్, వరుణ్‌తేజ్ కలిసి ఓ సినిమా చేయబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రూపొందనున్న ఈ మల్టీస్టారర్ చిత్రానికి 'ఎఫ్2' అనే పేరును ఖరారు చేశారు. 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' ఉపశీర్షిక. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్నారు. దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'చక్కటి సందేశం మిళితమైన వినోదభరిత చిత్రమిది. పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్ చిత్రాలతో హ్యాట్రిక్ సక్సెస్‌ను అందుకున్న అనిల్‌రావిపూడి కుటుంబవిలువలతో కూడిన అద్భుతమైన కథను సిద్ధంచేశారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి సన్నివేశం నవ్విస్తుంది. వెంకటేష్, వరుణ్‌తేజ్ పాత్రలు నవ్యరీతిలో సాగుతాయి. జూలైలో చిత్రీకరణ ప్రారంభిస్తాం. త్వరలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడిస్తాం' అని చిత్రబృందం ప్రకటించింది.



వరుణ్‌తేజ్

రచయితగా కత్రినా?



పదిహేనేళ్ల తన సినీ ప్రయాణంపై ఓ పుస్తకాన్ని రాయబోతున్నట్లు ప్రకటించింది బాలీవుడ్ నటి కత్రినాకైఫ్. కెరీర్‌లోని ఎత్తుపల్లాలు, పరాజయాలు, సంతోషకర సందర్భాల్ని గురించి స్వీయ రచనలో ఆవిష్కరించనున్నట్లు తెలిపింది. సినీ పరిశ్రమలో నిలదొక్కుకునే క్రమంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని చెప్పింది కత్రినాకైఫ్. తొలినాళ్లలో నేను నటించిన సినిమాలు కొన్ని పరాజయం పాలవ్వడంతో కెరీర్ ముగిసిపోతుందని భయపడ్డాను. కానీ ఏరోజు ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. నేను ఎదుర్కొన్న ఆటుపోట్లను పుస్తకంలో వెల్లడిస్తానని అని చెప్పింది.

ఇలాంటి సినిమాలు ఎవరు చూస్తారన్నారు!



నారా రోహిత్, శ్రీవిష్ణు, వేణు ఊడుగుల, దేవిప్రసాద్

శ్రీవిష్ణు, సత్న టిటుస్ జంటగా నటించిన చిత్రం 'నీదీ నాదీ ఒకే కథ'. వేణు ఊడుగుల దర్శకుడు. అరన్ మీడియా వర్క్స్, శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై రోహిత్ సమర్పణలో ప్రశాంతి, కృష్ణవిజయ్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కాగా ఈ చిత్ర థ్యాంక్స్ మీట్‌ని చిత్ర బృందం ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ 'సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు, సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. ఇండస్ట్రీ నుంచే కాకుండా బయటి నుంచి చాలా మంది మంచి సినిమా తీశారని అభినందిస్తున్నారు. 40 థియేటర్‌లు పెరిగాయి. ఇంకా బెటర్ స్టేజ్‌కి వెళుతుంది. కొత్తదనం వున్న కథలతో మా సంస్థలో మరిన్ని సినిమాలొస్తాయి. ఈ రోజుల్లో ఇలాంటి సినిమాలు ఎవరు చూస్తారు? అని చాలా మంది అన్నారు. అయినా నా డబ్బు, నా ఇష్టం. నాకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాను. ప్రేక్షకులు ఆదరిస్తున్నారు' అన్నారు. 'ఇందులో నేను నటించి వుండకపోతే ఒక గొప్ప గౌరవాన్ని కోల్పోయేవాడినని ఖచ్చితంగా చెప్పగలను. నా పాత్రకు లభిస్తున్న ప్రతి ప్రశంస దర్శకుడికే చెందుతుంది' అని దేవిప్రసాద్ తెలిపారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ 'చిన్న సినిమాలు కాన్సెప్ బేస్డ్ చిత్రాలు చేసిన ప్రతీసారి ప్రేక్షకులు మమ్మల్ని ఆదరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఏ ముహూర్తాన దర్శకుడు వేణు ఈ టైటిల్ పెట్టాడో అప్పుడే షూర్ షాట్ హిట్ అనుకున్నాం. సినిమా చూసిన ప్రతి ఒక్కరు ఇది నా కథ, మా ఇంట్లో జరిగిన కథ అని ఫీలవుతున్నారు. చూసిన ప్రతి ఒక్కరు బాగుందని అభినందిస్తున్నారు. ప్రేక్షకులు ఆదరించి చిత్రాన్ని పెద్ద సక్సెస్ చేశారు' అని అన్నారు. 'అంతకు ముందు వేణు ఎవరో నాకు తెలియదు. కానీ సినిమా చూశాక నేను అతనికి పెద్ద ఫ్యాన్ అయిపోయాను. చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికి కృతజ్ఞతలు' అని సమర్పకుడు అట్లూరి నారాయణరావు తెలిపారు. వేణు ఊడుగుల మాట్లాడుతూ 'హీరో నారా రోహిత్‌గారికి, చిత్ర నిర్మాతలకు జీవితాంతం రుణపడి వుంటాను. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రశంసలతో పాటు కొన్ని విమర్శలు వినిపించాయి. వాటన్నింటిని సరిదిద్దుకుని మరో మంచి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తాను' అన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, రాజ్ కందుకూరి, సురేష్ బొబ్బిలి, రాజ్ తోట, లక్ష్మీభూపాల్, సాగర్ చంద్ర, పవన్ సాదినేని, మదన్, వీఎన్ ఆదిత్య, కిషోర్ తిరుమల, విరించి వర్మ, బెక్కెం వేణుగోపాల్, జి.నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సౌమ్య

నలుగురు మిత్రుల కథ

నందు, సౌమ్య వేణుగోపాల్, పూజ రామచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. వరప్రసాద్ వరికూటి దర్శకుడు. హరి హర చలన చిత్ర పతాకంపై శ్రీకాంత్‌రెడ్డి, రామమోహన్‌రావు ఇప్పిలి నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 6న ప్రేక్షకులముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నలుగురు మిత్రుల కథ ఇది. అనుకోని సంఘటనల వల్ల వారు ఎదుర్కొన్న పరిస్థితులేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా ఆద్యంతం ఆసక్తికరమైన మలుపులతో సాగుతుంది. ఇటీవల విడుదలైన ఆడియోకు మంచి స్పందన లభిస్తున్నది' అని చెప్పారు. యువతరాన్ని ఆకట్టుకునే చిత్రమిదని నిర్మాత పేర్కొన్నారు. గగన్‌విహారి, ఆర్.కె, దువ్వాసి మోహన్, మీనా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళీమోహన్‌రెడ్డి, సంగీతం: యాజమాన్య.

పాత కౌన్సిల్‌హాల్‌లో చాంబర్ల ముస్తాబు

■ సభ్యులతో కలిసి పరిశీలించిన మండలి చైర్మన్ స్వామిగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనమండలిలోని వివిధ చాంబర్లను సభ్యులు వీ గంగాధర్‌గౌడ్, ఎన్ రాంచందర్‌రావుతో కలిసి కౌన్సిల్ చైర్మన్ కే స్వామిగౌడ్ ఆదివారం పరిశీలించారు. మండలి సమావేశం ముగిసిన అనంతరం పరిషత్ భవన ప్రాంగణంలోని ఆయా చాంబర్లకు వెళ్లి చూశారు. వీటిలో కొన్ని చాంబర్లు ఇప్పటికే ప్రభుత్వ విప్‌లు, ప్రతిపక్ష నేత, ఆయా పార్టీల నేతలకు కేటాయించారు. మరికొన్ని చాంబర్లు కమిటీల చైర్మన్ల కోసం ముస్తాబవుతున్నాయి. ఇదివరకు జూబ్లీహాల్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు జరిగేవి. ఏపీ రాజధాని అమరావతిలో శాసనసభ సమావేశాలు జరుగుతుండటంతో ఆంధ్రప్రదేశ్ సర్కార్.. తెలంగాణ ప్రభుత్వానికి పాత కౌన్సిల్‌హాల్‌ను అప్పగించింది. ప్రస్తుతం తెలంగాణ శాసనమండలి బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇటీవల సీఎం కేసీఆర్ జూబ్లీహాల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. పాత జూబ్లీహాల్‌లో ఇప్పటివరకు కొనసాగిన తెలంగాణ కౌన్సిల్‌హాల్‌ను తొలిగించి ప్రభుత్వ కార్యక్రమాలు, అతిథులకు ప్రభుత్వం తరఫున ఇచ్చే విందుల కోసం వాడుకోవాలని, ఈ మేరకు మరమ్మతు చేయాలని అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ మండలి చైర్మన్ చక్రపాణి ఉపయోగించిన చాంబర్‌ను ముఖ్యమంత్రికేసీ ఆర్‌కుకేటా యించాలని అధికారులు నిర్ణయించారు.

‘తెలుగు’ బిల్లుకు మండలి ఆమోదం

బిల్లు ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం కడియం ■ డీజీపీ నియామక బాధ్యత ఇకనుంచి రాష్ట్రాలకే..

మరో నాలుగుబిల్లులకూ ఆమోదం తెలిపిన మండలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగు బోధనన తప్పనిసరిచేస్తూ ఇటీవల శాసనసభ ఆమోదించిన బిల్లును ఆదివారం శాసనమండలి ఆమోదించింది. ఈ బిల్లును డిప్యూటీసీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి మండలిలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగుభాషకు పూర్వవైభవం తీసుకురావాలని సంకల్పించారని, అందులోభాగంగా 1-10 వరకు తెలుగు భాషను తప్పనిసరిగా అమలుచేయాలని నిర్ణయించారని చెప్పారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు రాజధాని హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగుమహాసభలను నిర్వహించుకున్నామన్నారు. ఈ బిల్లుకు మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. 2018-19 నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటుకు సంబంధించిన అన్నిరకాల యాజమాన్యాల పరిధిలో కొనసాగుతున్న పాఠశాలల్లో తెలుగుభాషను బోధనాంశంగా అమలుచేయాల్సి ఉంటుంది. కాగా, పోలీస్ డైరెక్టర్ జనరల్(డీజీపీ) నియామకబాధ్యత రాష్ట్రాలకే ఉండాలంటూ ఉద్దేశించిన బిల్లును సీఎం కేసీఆర్ తరుపున ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు మండలిలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల అంశం రాష్ట్రాల పరిధిలోనే ఉంటుందని, డీజీపీ నియామకం అధికారం రాష్ట్రాలకే ఉండాలని తెలిపారు. బిల్లుకు అధికార, ప్రతిపక్షపార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. మండలి ఆదివారం మరో నాలుగు బిల్లులు .. న్యాయవాదుల గుమస్తాల సంక్షేమనిధి సవరణ బిల్లు, తెలంగాణ న్యాయవాదుల సంక్షేమనిధి సవరణ బిల్లు, తెలంగాణ అసైన్డ్ చేసిన భూముల (బదిలీ నిషేధం) సవరణ బిల్లు, తెలంగాణ వైద్యవృత్తిదారుల రిజిస్ట్రీకరణ సవరణ బిల్లులకు ఆమోదం తెలిపింది. అనంతరం శాసనమండలి సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ స్వామిగౌడ్ ప్రకటించారు.

ఉభయ సభలు మంగళవారానికి వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ, మండలి మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఆదివారం ఉభయసభల్లో ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం ఆర్థిక పద్దులపై చర్చ జరిగింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు బిల్లులకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. అనంతరం ఉభయ సభలను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు అసెంబ్లీలో స్పీకర్ మధుసూదనాచారి, మండలిలో చైర్మన్ స్వామిగౌడ్ ప్రకటించారు. సోమవారం శ్రీరామనవమి కావడంతో ఉభయసభలకు సెలవు ప్రకటించారు. మంగళవారం తిరిగి సమావేశమవుతాయి.

రేపు సభ ముందుకు ద్రవ్యవినిమయ బిల్లు

ప్రశ్నోత్తరాల సమయం రద్దు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం అసెంబ్లీ, శాసనమండలిలో ప్రభుత్వం ద్రవ్య వినిమయబిల్లును ప్రవేశపెట్టనుంది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా జరిగిన ఉభయసభల బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) ల సమావేశాల్లో ఈ మేరకు ద్రవ్యవినిమయ బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఉభయసభల్లో మంగళవారం ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లను రద్దుచేశారు. ఆ రోజు ఉదయం 11గంటలకు అసెంబ్లీ ప్రారంభం కాగానే బిల్లు ప్రవేశపెట్టనుండగా, మండలిలో తొలుత చేనేత రంగంపై చర్చించి.. ఆ తర్వాత ద్రవ్య వినిమయబిల్లును ప్రవేశపెట్టనున్నారు.




అసెంబ్లీ ఆవాజ్



నేనెందుకు పోతాసార్.. హైదరాబాద్‌కి..

రైతుతో సంభాషణను అసెంబ్లీలో వివరించిన హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ఏర్పడిన తర్వాత సాగునీటి రంగంలో వచ్చిన మార్పులను మంత్రి హరీశ్‌రావు ఆదివారం అసెంబ్లీలో ఒక చిన్న సంఘటనను ఉదాహరణగా చెప్తూ వివరించారు. ‘ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డితో కలిసి బుద్దారం చెరువు చూసేందుకు వెళ్లా. అక్కడ తెనుగు రాములు అనే రైతు మమ్మల్ని చూసి పొలంలో నుంచి వచ్చాడు. అతడిని యోగక్షేమాలు అడిగాక.. పొలం గురించి అడిగితే.. ‘సార్, నేను ఇంతకాలం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో అడ్డాకూలీగా పనిచేసిన. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీళ్లు పుల్లు, కరెంటు పుల్లు.. అందుకే సొంతూరుకొచ్చి నాకున్న రెండెకరాల భూమి చేసుకుంటున్న’ అని చెప్పాడు. మళ్లీ హైదరాబాద్ పోతావా అని అడిగితే.. ‘నేనెందుకు పోతా సార్.. హైదరాబాద్‌కి..’ అని చెప్పిండు. ఇది తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పు. రాములు లాంటి వాళ్ల కోసమే తెలంగాణ రాష్ట్రం వచ్చింది’ అని హరీశ్‌రావు చెప్పారు.

ప్రభుత్వానికి మంచిపేరొస్తే.. కిషన్‌రెడ్డికి నచ్చదు..

ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందంటే బీజేపీ పక్షనేత కిషన్‌రెడ్డికి నచ్చదు అని మంత్రి హరీశ్‌రావు చురకలంటించారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో ఏనాడూ సింగూరు ప్రాజెక్టుకింద మెదక్ జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా సాగునీరివ్వలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో 40 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు, రామచంద్రాపురంల్లో అడ్డాకూలీలుగా పనిచేస్తున్న వారంతా తిరిగి సొంత ఊళ్లకొస్తున్నారని చెప్పారు. అందోల్, పుల్కల్ మండలాల్లో 750 మంది కూలీలు వారి రేషన్‌కార్డులు పునరుద్ధరించాలంటూ దరఖాస్తులు చేసుకున్నారని, వలసలు వాపస్ అవుతున్నాయనడానికి ఇంతకంటే ఉదాహరణ మరొకటి ఉండదని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరుకు ఇది నిదర్శనమని, అనవసర ఆరోపణలు మానుకుని వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలంటూ కిషన్‌రెడ్డికి మంత్రి హరీశ్‌రావు సూచించారు.



జిల్లాకో తీరుగా కాంగ్రెస్..

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లాకోతీరుగా ఉందని హరీశ్‌రావు విమర్శించారు. రంగారెడ్డి జిల్లాలో సాగునీరందడం లేదని అక్కడి ఎమ్మెల్యే ధర్నాలు చేస్తుంటే, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ నాయకుడు హర్షవర్దన్‌రెడ్డి అదే పనులు అడ్డుకోవడానికి కోర్టుల్లో కేసులు వేస్తున్నారని, కాంగ్రెస్ నాయకుల తీరు జిల్లాకోవిధంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేపట్టిన పనులు త్వరగా చేయాలని పాదయాత్రలు చేసిన ప్రతిపక్షాలను చూశామని, కానీ కాంగ్రెస్ నాయకులు పనులకు అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. కోర్టుల్లో ఉన్న కేసులన్నింటినీ త్వరలో వెకెట్ చేయించి షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరందిస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు.

ప్రశ్నోత్తరాల సమయం

రైతును యూనిట్‌గా పరిగణిస్తేనే

పంటల బీమా ప్రయోజనం

శాసనమండలిలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన (పీఎంఎఫ్‌బీవై) ద్వారా రైతులకు బీమాసౌకర్యం పూర్తిగా కలుగాలంటే.. ఈ పథకంలో ప్రస్తుతమున్న గ్రామం, మండలాన్ని యూనిట్‌గా కాకుండా రైతును యూనిట్‌గా పరిగణించాల్సిన అవసరం ఉన్నదని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పీఎంఎఫ్‌బీవై పథకంపై ఆదివారం శాసనమండలిలో సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పోచారం సమాధానమిచ్చారు. ఈ పథకాన్ని రైతు యూనిట్‌గా అమలుచేయాలని గతంలోనే రాష్ట్ర ఉభయసభలలో తీర్మానంచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని వెల్లడించారు. పలుమార్లు ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌ను కలిసి ఈ అంశాన్ని గుర్తుచేశామన్నారు. ప్రధానమంత్రి మోదీ దృష్టికి కూడా ఈ విషయం తీసుకెళ్లామని మంత్రి సభకు వివరించారు.

సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు

రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



ఈ ఏడాది సెప్టెంబర్‌నాటికి ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తుందని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలిలో ఎలక్ట్రిక్ బస్సులపై మండలిలో సభ్యుడు పాతూరి సుధాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి మహేందర్ రెడ్డి సమాధానమిచ్చారు. ఫేమ్‌ఇండియా పథకం కింద కేంద్ర ప్రభుత్వం.. హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా 11నగరాల్లో ఎలక్ట్రిక్ బస్సులను నడిపించాలని నిర్ణయించిందన్నారు. తొలి దశలో 40, రెండోదశలో 60 బస్సులను ప్రవేశపెడుతామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్కేజీ, యూకేజీ

ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిసరాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్కడ ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలని ఆలోచిస్తున్నట్టు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 11,800 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నామని, ఇవి పాఠశాలల్లోనే ఉన్నందున అక్కడే ఎల్కేజీ , యూకేజీ నిర్వహించడంపై ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు, ప్రైవేటు విద్యాసంస్థల అనుమతులు, పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శాసనమండలిలో సభ్యులు కాటేపల్లి జనార్దన్ రెడ్డి, పూల రవీందర్ అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి సమాధానం ఇచ్చారు.



కార్యాలయాల్లో ప్రీపెయిడ్ మీటర్లు

విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి



ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ దుబారాను అరికట్టడానికి ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటుచేసినట్టు విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. మండలిలో సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్ల టారిఫ్‌లో తేడా ఉండదని, ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో కొత్తగా వీటిని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణను తట్టుకోలేక విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. 24 గంటల విద్యుత్‌తో భూగర్భజలాలు తగ్గుతున్నాయనడంలో వాస్తవంలేదని వెల్లడించారు. యాసంగిలో పంట పొట్టకొచ్చిన దశలో అధిక నీరు అవసరమని, తద్వారా నీటివినియోగం పెరుగుతుందన్నారు.

హైకోర్టును విభజించకపోవడంతో సమస్యలు

న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్టు హైకోర్టు విభజనకాకపోవడంతో పలురకాల సమస్యలు ఎదురవుతున్నాయని న్యాయశాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. నూతన జడ్జీల నియామకం, ఇతర పోస్టుల భర్తీ ప్రక్రియ ముందుకు సాగడం లేదన్నారు. ఆదివారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా మాట్లాడిన ఆయన ఎంపీలు పార్లమెంట్‌లో ఎంత పోరాడుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు.

బోదకాలు రోగులకు పింఛన్లు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి



దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ మానవతా దృక్పథంతో బోదకాలు రోగులకు పింఛన్లు ఇస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 60వేల మంది బోదకాలు రోగులు ఉన్నారని చెప్పారు. ఆదివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా బోదకాలు రోగులకు పింఛన్లపై ఎమ్మెల్యేలు వేముల వీరేశం, చింతా ప్రభాకర్, బానోత్ మదన్‌లాల్, సండ్ర వెంకటవీరయ్య అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. బోదకాలు రోగుల్లో కొందరు కాలకృత్యాలు సైతం తీర్చుకోలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారి కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో వెస్ట్రన్ టాయిలెట్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో ప్రారంభించినట్టు తెలిపారు. పాలేరులో ప్రత్యేక ఫైలేరియా యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి హామీఇచ్చారు.

అన్ని పట్టణాల్లోనూ బస్తీ దవాఖానల ఏర్పాటు

హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లోని మురికివాడల్లో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. బస్తీ దవాఖానల ఏర్పాటుపై ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, సాయన్న, మాధవరం కృష్ణారావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు మొత్తం 45 మురికివాడల్లో బస్తీ దవాఖానలు అందుబాటులోకి తేనున్నట్టు పేర్కొన్నారు. వీటిలో 17 ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతాయన్నారు.

త్వరలో కొత్తగూడెం ఆబ్కారీ కార్యాలయానికి శంకుస్థాపన: పద్మారావు

త్వరలోనే కొత్తగూడెం వద్ద ఆబ్కారీ కార్యాలయానికి శంకుస్థాపన చేయనున్నట్టు ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావు తెలిపారు. ఎమ్మెల్యే జలగం వెంకటరావు అడిగిన ప్రశ్నకు మంత్రి పద్మారావు సమాధానమిస్తూ..కొత్తగూడెం వద్ద బెవరేజెస్ గోదాం నిర్మాణానికి సైతం పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు.

మీడియా పాయింట్

సజావుగా అసెంబ్లీ సమావేశాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఎన్నడూ లేనివిధంగా అసెంబ్లీ సమావేశాలు సజావుగా నడుస్తున్నాయి. కాంగ్రెస్ నేతల వద్ద సబ్జెక్టు లేకపోవడంతో గవర్నర్ ప్రసంగానికి అడ్డుపడ్డారు. కాంగ్రెస్ బస్సుయాత్ర అంగడి యాత్రలా మారింది. రెండోదఫా బస్సుయాత్ర చేసినా, మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు ఆదరించరు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్, బీజేపీలను ఆదరించే అవకాశం లేదు. ఆ పార్టీల కార్యాలయాలు కూడా మూతపడుతాయి.

– జీవన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

జర్నలిస్టులు, ఉద్యోగులకు ఇండ్లు ఇవ్వాలి

తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టులకు, ఉద్యోగులకు ఇండ్లు ఇవ్వాలి. గత ఎన్నికల ముందు సీఎం హామీ ఇచ్చారు. జర్నలిస్టులు, ఉద్యోగులకు అమలవుతున్న హెల్త్ స్కీమ్‌ను యథావిధిగా కొనసాగించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేపట్టాలి. పీఆర్సీ బకాయిలు చెల్లించడంతోపాటు ఏపీలో పనిచేస్తున్న 1200 మంది తెలంగాణ ఉద్యోగులను వెంటనే రాష్ట్రానికిరప్పి ంచాలి.

– లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలు

కార్మికులకు కనీస వేతనాలు ఇప్పించాలి

రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల్లో లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి కనీస వేతనాలు అందడంలేదు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని, కార్మికులకుక నీసవేత నాలుఅ ందేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– సున్నం రాజయ్య, సీపీఎం ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

గురుకుల పాఠశాలల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పర్చినప్పుడే పేద విద్యార్థులకు చదువుకునే అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీచేయాలి.

– ఆర్ కృష్ణయ్య, టీడీపీ ఎమ్మెల్యే

మార్చిలోనూ చెరువులు మత్తడి దుంకుతున్నయ్

చంద్రసాగర్ కాల్వప్రతిపాదన పరిశీలనలో ఉంది. ■ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూల్ జిల్లాలో మార్చి నెలలోనూ చెరువులు మత్తడి పోస్తున్నాయని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలో చంద్రసాగర్ కాల్వ పనులపై ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జనార్దన్ రెడ్డి, అంజయ్యయాదవ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి హరీశ్‌రావు సమాధానమిచ్చారు. అచ్చంపేట నియోజకవర్గంలో చంద్రసాగర్ కాలువ తవ్వే ప్రతిపాదన ఉన్నదని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల సాగునీటి పథకం కింద 14 కిలోమీటర్ల పొడవున అచ్చంపేట బ్రాంచి కాలువ విస్తరణ పని ప్రతిపాదనలో ఉందన్నారు. ప్రతిపాదిత అదనపు ఆయకట్టు కింద ఉప్పునూతల మండలంలో పదివేల ఎకరాలు, అచ్చంపేట మండలంలో ఐదువేల ఎకరాలకు సాగునీళ్లు ఇస్తామని తెలిపారు. ఫారెస్టు అనుమతులు రాగానే అచ్చంపేట నియోజకవర్గంలో వీలైన చోట్ల చెక్‌డ్యాంల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో జల విజయయాత్ర పేరిట మర్రి జనార్దన్‌రెడ్డి పాదయాత్రచేయడం అభినందించదగ్గ విషయమన్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని కాల్వల పనులు ఈ ఏడాది చివరి వరకు పూర్తిచేస్తామని హరీశ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. ‘కరువు పీడిత ప్రాంతమైన నల్లగొండ జిల్లాకు తాగు, సాగునీరు అందిస్తామని సీఎం కేసీఆర్ నల్లగొండ జిల్లాలో ఒక సభ సందర్భంగా హామీ ఇచ్చారు. అక్కడినుంచే ఆదేశాలు జారీ చేశారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ చేరుకునేవరకే రూ. 284.85 కోట్లతో సదరు కాల్వల పనులకు జీవో జారీచేశాం‘అని హరీశ్‌రావు గుర్తుచేశారు.



శాసనసభ కమిటీహాల్‌లో అసెంబ్లీ నియమాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ కే స్వామిగౌడ్, వైస్‌చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు టీ హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, జోగురామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు పాషాఖాద్రి, షకీల్

ఉర్దూలోనూ అసెంబ్లీ నిబంధనలు

శాసనసభ, మండలికి సంబంధించిన ఐదు పుస్తకాల ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ, మండలికి సంబంధించి ఐదు పుస్తకాలను స్పీకర్ ఎస్ మధుసూదనాచారి, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి టీ హరీశ్‌రావుతో కలిసి మండలి చైర్మన్ కే స్వామిగౌడ్ ఆదివారం శాసనసభ కమిటీహాల్‌లో ఆవిష్కరించారు. ‘అసెంబ్లీ నియమాలు’ పుస్తకంలో శాసనసభ నిబంధనలను ఉర్దూ భాషలోనూ రూపొందించారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ తరువాత మన రాష్ట్ర అసెంబ్లీలోనే నిబంధనల పుస్తకాన్ని ఉర్దూలో ముద్రించారు. మండలి సభ్యుల వివరాలతో కూడిన పుస్తకం, ఉభయసభల కమిటీల విధులు, లైబ్రరీ రిసెర్చ్ రిఫరెన్స్ ఎట్ గ్లాన్స్, సభ్యులు, మాజీ సభ్యులకు వసతులపై పుస్తకాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మండలి వైస్‌చైర్మన్ నేతి విద్యాసాగర్, విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, శాసనసభకార్యదర్శి నరసింహాచార్యులు, ఎమ్మెల్యేలు పాషా ఖాద్రి, షకీల్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎంబీసీ కార్పొరేషన్ మట్టికూజాలు

ఎంబీసీ కార్పొరేషన్ తయారుచేసిన మట్టికూజాలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఆదివారం శాసనసభ కమిటీహాల్‌లో శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి మట్టికూజాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టీ హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావు, జీ జగదీశ్ రెడ్డి, జోగురామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు ఏడురెట్లు అధికం

■ మూసీకాల్వల పనుల్లో వేగం పెంచండి
■ అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం
■ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది: మంత్రి జగదీశ్‌రెడ్డి
■ ఉమ్మడి నల్లగొండ ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షాసమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లాలోని పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునియాదిగానిపల్లి కాల్వల పనుల్లో వేగం పెంచాలని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు కలగా మిగిలిన పనులను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సాకారం చేస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన 24 గంటల్లోనే జీవో విడుదల చేయడంతోపాటు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ప్రయోజనం కంటే ఏడురెట్ల అదనపు ఆయకట్టుతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నదన్నారు. ఆదివారం అసెంబ్లీ కమిటీ హాలులో మూసీకింద మూడు కాల్వలకు భూసేకరణ, ఇతర పనులను ఆయన మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. కాల్వల నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల్లో వేగం పెంచేందుకు కాలినడకన కాల్వల వెంట పర్యటించాలని ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను కోరారు. ప్రతి ఐదుకిలోమీటర్ల దూరంలో ఏఈఈ, డీఈలను డిప్యూటేషన్‌పై నియమించాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఈ కాల్వలకు తిరిగి ప్రాణం వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. పిల్లాయిపల్లి కింద భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల, మునుగోడు మండలాల్లోని 32 గ్రామాలకు, బునియాదిగానిపల్లి కింద బీబీనగర్, భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు, మోత్కూరు, మోటకొండూరు, అడ్డగూడూరు మండలాల్లోని 48 గ్రామాల రైతులకు సాగునీరు అందుతుందని చెప్పారు. ధర్మారెడ్డిపల్లి పథకంలో వలిగొండ, రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లోని 40 గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని హరీశ్‌రావు చెప్పారు. బునియాదిగానిపల్లి, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పనులు పూర్తయితే యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరతుందని మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఈ కాల్వల పనులను గతంలో కాంగ్రెస్ అటకెక్కించిందని విమర్శించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, గాదరి కిశోర్, సీఈ సురేశ్, ఎస్ఈ హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.

మూడు కాల్వల కింద ఆయకట్టు పెరుగుదల వివరాలు..

కాల్వ పేరు	గత సర్కారు హయాంలో			తెలంగాణ సర్కారు హయాంలో		
	డిస్ట్రిబ్యూటరీలు	నింపేచెరువులు	ఆయకట్టు	డిస్ట్రిబ్యూటరీలు	నింపేచెరువులు	ఆయకట్టు
పిల్లాయిపల్లి	18	30	7717	46	80	22,500
ధర్మారెడ్డిపల్లి	–	15	2360	16	36	17,787
బునియాదిగానిపల్లి	–	57	6000	18	96	20,575

11 చోట్ల వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లు

● పంట ఉత్పత్తులకు అనుగుణంగా కేంద్రాలు అవసరం
● వేరుశనగ, మక్కజొన్న యూనిట్ల ఏర్పాటుపై ప్రభుత్వానికి వ్యవసాయ వర్సిటీ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సాగవుతున్న పంటల ఆధారంగా 100 నియోజకవర్గాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ఏర్పాటుపై భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా వివిధ రంగాలవారి నుంచి అభిప్రాయాలు, సూచనలను ప్రభుత్వం కోరింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అధికంగా పండే వేరుశనగ, మక్కజొన్న, వరి, కంది వంటి పంట ఉత్పత్తులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసే రైతులకు లాభదాయకంగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి నివేదించారు. వేరుశనగ అత్యధికంగా సాగవుతున్న 11 నియోజకవర్గాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. సిద్దిపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌బాద్ లేదా జనగామ, ఇబ్రహీంపట్నం లేదా కుత్బుల్లాపూర్, మెదక్ లేదా గజ్వేల్, కామారెడ్డి, వికారాబాద్, కరీంనగర్, జగిత్యాల లేదా కోరుట్ల, నిర్మల్, మధిర లేదా వైరా నియోజకవర్గాల్లో పొడి, తడి మరయంత్రాలు ఏర్పాటుచేయాలని నివేదించారు. వేరుశనగతో వెన్న, మక్కజొన్నతో స్వీట్ కార్న్, బేబి కార్న్ వంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మక్కజొన్న పంట దాదాపు 19.76 లక్షల ఎకరాల్లో సాగవుతున్నది. 28.82 లక్షల టన్నుల దిగుబడి వస్తున్నది. ఇందులో కోళ్ల దాణాకు 49 శాతం, పశువుల దాణాకు 12 శాతం వినియోగమవుతున్నది.



ఆదివారం ప్రగతిభవన్‌లో ఎంపీ కవిత, చెల్లెలు సౌమ్యతో సెల్ఫీ తీసుకుంటున్న ఎంపీ సంతోష్‌కుమార్

దేశం దృష్టి మన ఐటీరంగం వైపు!

- ఉద్యోగాల కల్పన, ఐటీ ఎగుమతుల్లో రికార్డుస్థాయి వృద్ధి
- రాష్ట్రం ఏర్పడిన తర్వాత విశేష పురోగతి
- రెండేండ్లలో 25% వృద్ధిరేటు నమోదు
- దేశ ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం వాటా పది శాతం పైనే
- 2020 నాటికి ఎగుమతుల విలువ రూ.1.20 లక్షల కోట్లకు చేరే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఐటీరంగం దేశం చూపును తనవైపు తిప్పుకొంటున్నది. ఇటు ఉద్యోగాల కల్పన అటు ఐటీ ఎగుమతుల్లో ఐటీ పరిశ్రమ దేశం కంటే ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. ప్రధానంగా రాష్ట్ర విభజన తర్వాత ఐటీరంగం వృద్ధిరేటు పురోగామి పథంలో ఉండటం విశేషం. సోషియో ఎకనమిక్ అవుట్‌లుక్ -2018లోనూ ఇవే అంశాలు వెల్లడయ్యాయి. 2014-15లో ఐటీ, ఐటీ అనుబంధ రంగాల్లో 1,200 సంస్థలు తెలంగాణలో ఏర్పడగా, 2016-17లో 1,500 సంస్థలు హైదరాబాద్‌లో తమ వ్యాపార కార్యకలాపాలు మొదలుపెట్టాయి. అంటే రెండేండ్ల కాలంలో 25 శాతం వృద్ధిరేటు నమోదయింది. అదేవిధంగా ఈ రెండేండ్ల కాలంలో ఐటీ ఉద్యోగాల కల్పనలో 16 శాతం వృద్ధి కనిపించడం గమనార్హం. ఐటీరంగం ఎగుమతుల్లో కూడా గణనీయమైన పెరుగుదల ఉండటం నమోదవుతుండటం విశేషం. ఏటా దాదాపు 13 శాతం వృద్ధిరేటు నమోదు అవుతున్నది. జాతీయ స్థాయి వృద్ధి రేటుకు ఇది మూడు శాతం ఎక్కువ. జాతీయ ఐటీ ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 10 శాతానికి పైగానే ఉండటం గమనార్హం. ఐటీరంగంలోని మొత్తం ఆదాయంలో రాష్ట్రం రెండోస్థానంలో ఉన్నది. రాష్ట్రం మొత్తం ఎగుమతుల్లో ఐటీరంగం ఎగుమతులు 50 శాతానికి పై మాటే. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఐటీ రంగం ఎగుమతుల విలువ రూ.85,470 కోట్లు కాగా ఈ ఏడాది 14 శాతం వృద్ధి రేటుతో ఇది దాదాపు రూ.97 వేల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఐటీరంగంలో దాదాపు 4.5 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. పరోక్షంగా 10 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. 2020 నాటికి రాష్ట్ర ఐటీ ఎగుమతుల విలువ రూ.1.20 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా. తద్వారా మరో నాలుగు లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, పరోక్షంగా పది లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని భావిస్తున్నారు. ప్రధాన ఐటీ పాలసీతో పాటు పది అనుబంధ పాలసీలతో ఐటీ రంగం వృద్ధి చెందేందుకు గల ప్రతి అవకాశాన్ని మంత్రి కేటీఆర్ పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

రాష్ట్ర ఐటీ ఎగుమతులు

సంవత్సరం	ఎగుమతుల వృద్ధి (రూ.కోట్లలో)	విలువ శాతం
2014-15	64,000	11.77
2015-16	75,070	17.29
2016-17	85,470	13.85

ప్రణాళికాబద్ధమైన కృషి వల్లే

ఐటీ పరిశ్రమ ఎగుమతుల వృద్ధిరేటులో తెలంగాణలో ప్రథమస్థానంలో ఉండటం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధమైన కృషితోనే సాధ్యమైందని తెలంగాణ ఐటీ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల తెలిపారు. ఐటీ, ఐటీ అనుబంధ రంగాల కంపెనీలు రావడానికి టీఎస్ఐపాస్ పెద్ద ఊతంగా నిలుస్తున్నదన్నారు. మంత్రి కేటీఆర్ వరుసగా చేస్తున్న పర్యటనల ఫలితంగా ఈ విశేష వృద్ధి సాధ్యమైందని స్పష్టంచేశారు. ఇదేరీతిలో ముందుకు సాగితే రూ.1.20 లక్షల కోట్ల విలువైన ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

కాళేశ్వరం బాహుబలికి.. 'విద్యుత్' శక్తి..!

యుద్ధప్రాతిపదికన సాగుతున్న విద్యుత్ పనులు

సమాంతరంగా సబ్ స్టేషన్లు, లైన్ల నిర్మాణం

ఈ వర్షాకాలం పంపులను నడిపేందుకు వీలుగా వేగంగా విద్యుత్ పనులు

ఇబ్బందులు తలెత్తకుండా.. కీలకమైన సబ్ స్టేషన్లకు రెండేసి లైన్లు







కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బాహుబలి మోటర్లు పనిచేసేందుకు అవసరమైన విద్యుత్ కోసం తెలంగాణ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణ పనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బాహుబలిలాంటి కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. వచ్చే వానకాలంలో గోదావరి జలాలను ఖచ్చితంగా ఎత్తిపోయాల్సిందేనన్న పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. ఏకకాలంలో అన్నిపనుల వేగం పెంచుతున్నది. ఓవైపు గోదావరి నీటిని ఎత్తిపోసేందుకుకు వీలుగా బరాజ్‌లు, పంప్‌లు, టన్నెళ్లను వేగంగా నిర్మిస్తుండగా, మరోవైపు ఆ నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన మోటర్లు, పంపులను నడిపేందుకు కావాల్సిన విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల పనులను అంతకంటే వేగంగా విద్యుత్ శాఖ పూర్తిచేస్తుండటం విశేషం. వచ్చే జూన్‌కల్లా విద్యుత్ పనులను పూర్తిచేయాలన్న లక్ష్యంతో షిఫ్టులవారీగా పనిచేస్తున్నట్టు ట్రాన్స్‌కో డైరెక్టర్ లిఫ్ట్ ఇరిగేషన్ సూర్యప్రకాశ్ 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బిగిస్తున్న మోటరే పెద్ద బాహుబలి. దీని సామర్థ్యం 139 మెగావాట్లు. ఇంతపెద్ద మోటరు, పంపు ప్రపంచంలో మరెక్కడా లేదు. ఇలాంటి బాహుబలి మోటర్లు మొత్తం ఏడు ఏర్పాటుచేస్తున్నారు. ఈ బాహుబలి మోటరు ఒక్కొక్కటి సుమారు 2,100 క్యూసెక్కుల నీటిని దాదాపు 125 మీటర్ల ఎత్తుకు తీసుకెళ్తుంది. అంత నీటిని, అంత ఎత్తుకు తీసుకెళ్లాలంటే అదే స్థాయిలో విద్యుత్‌ను సరఫరా చేయాలి. అందుకు సంబంధించిన ఏర్పాట్లను జూన్ నాటికల్లా పూర్తిచేయడానికి తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు నేతృత్వంలో అధికారుల బృందం తీవ్రంగా శ్రమిస్తున్నది. ట్రాన్స్‌కో విభాగం 400 కేవీ, 220 కేవీ, 132/11 కేవీ సబ్‌స్టేషన్లతోపాటు.. 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ విద్యుత్ లైన్లను కూడా శరవేగంగా పూర్తిచేస్తున్నది. ఈ పనులను జూన్‌కల్లా 100 శాతం పూర్తి చేయాలన్నది ట్రాన్స్‌కో సంకల్పం. ముఖ్యంగా లింక్-1లో భాగంగా ఉన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లతోపాటు.. మేడిగడ్డ-ఎల్లంపల్లి-మిడ్‌మానేరులోకి గోదావరి నీటిని ఎత్తిపోయాలనే లక్ష్యంతో విద్యుత్ పనులను చేపడుతున్నారు. ఇప్పటికే మేడారం, అన్నారం, సుందిళ్ళ వద్ద సగటున 93 శాతం మేర సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల పనులు పూర్తయ్యాయి. ప్యాకేజీ 6, 7, 8లకు సంబంధించిన పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. వీటిలో కొన్ని పనులు 100 శాతం పూర్తవ్వడం విశేషం. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు రాకుండా.. అత్యవసర సమయాల్లో ఉపయోగించేలా.. కీలకమైన పంప్‌హౌజ్‌లకు రెండు లైన్ల ద్వారా విద్యుత్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. ఉదాహరణకు తిప్పాపూర్ పంప్ హౌజ్‌ను తీసుకొంటే.. రామడుగు నుంచి తిప్పాపూర్ వరకు 40 కి.మీ. పొడవునా 400 కేవీ డబుల్ సర్క్యూట్ లైనుతోపాటు.. తిప్పాపూర్ నుంచి చందలాపూర్ వరకు 400 కేవీ డబుల్ సర్క్యూట్ లైను కూడా వేస్తున్నారు. ఒకవేళ ఒకవైపు నుంచి వచ్చే లైన్లో విద్యుత్ అంతరాయం కలిగితే.. మరో లైను ద్వారా విద్యుత్ సరఫరా చేస్తారు. యుద్ధప్రాతిపదికన సాగుతున్న విద్యుత్ పనులను ఎప్పటికప్పుడు సీఎం కేసీఆర్, నీటిపారుదలశాఖమంత్రి హరీశ్‌రావు, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు పర్యవేక్షిస్తున్నారు. వీరితోపాటు విద్యుత్‌శాఖ తరఫున ఒక సీఈ, ఇద్దరు ఎస్ఈలు, ఆరుగురు డీఈలు, ఎనిమిదిమంది ఏడీఈలు, పదిమంది ఏఈలతోపాటు.. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రతిషిఫ్ట్‌లో కనీసం 50 మంది విద్యుత్ కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నారు. ఇలా రోజుకు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. విద్యుత్ లైన్లను పూర్తిచేసేందుకు 20 మందికి ఒక గ్యాంగుగా కార్మికులు శ్రమిస్తున్నారు. ఒక్కోచోట కనీసం రెండు గ్యాంగుల కార్మికులు పని చేస్తున్నారు.

భారీ మోటర్లు.. భారీగా లైన్లు..

ఇంతటి భారీ ప్రాజెక్టుకు.. అదేస్థాయిలో భారీ సామర్థ్యం ఉన్న పంపులు, మోటర్లను బీహెచ్ఈఎల్ సమకూరుస్తున్నది. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులో 82 పంపులను ఉపయోగిస్తుండగా.. ఇందులో అన్నింటికంటే అత్యధిక సామర్థ్యంతో ఉన్న బాహుబలిలాంటి 139 మెగావాట్ల మోటారును రామడుగులో ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి ఏడు మోటర్ల కోసం 160 ఎంవీఏ సామర్థ్యం ఉన్న 7 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేస్తున్నారు. ఇందు కోసం మంచిర్యాల సమీపంలోని జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టు నుంచి గజ్వేల్ -రామడుగుకు 400 కేవీ డబుల్ సర్క్యూట్ లైను వేశారు.

భారీ మోటర్లు, పంపుల కోసం.. భారీగా చేస్తున్న ఏర్పాట్లు ఇలా ఉన్నాయి.

మొత్తం పనులు	-	16
మొత్తం లోడు	-	4843.68 మెగావాట్లు
మొత్తం పంపులు	-	82
400 కేవీ సబ్‌స్టేషన్లు	-	6
220 కేవీ సబ్‌స్టేషన్లు	-	7
132 కేవీ సబ్ స్టేషన్లు	-	3
400 కేవీ లైన్ పొడవు(సీకేఎం)	-	316
220 కేవీ లైన్ పొడవు(సీకేఎం)	-	228.5
132 కేవీ లైన్ పొడవు(సీకేఎం)	-	50.6
మొత్తం ఖర్చు		**- రూ. 2,865.27 కోట్లు**

సీఎం కేసీఆర్ కల నెరవేర్చడంలో భాగస్వాములం అవుతున్నందుకు సంతోషం



కోటి ఎకరాలకు సాగునీరు అందించాలన్న సీఎం కేసీఆర్ కలను సాకారంలో చేయడంలో మేము కూడా భాగస్వామ్యం అవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ జూన్‌కల్లా విద్యుత్ పనులను పూర్తిచేయాలన్నది లక్ష్యం. ముందుగా ప్యాకేజీ 6, 8తోపాటు లింక్-1లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరాచేసి.. అక్కడి నుంచి నీటిని పంపింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు కావాల్సిన సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు చివరి దశలో ఉన్నాయి. మలక్‌పేట సబ్‌స్టేషన్ కూడా కీలకమైనదే. ఇవి పూర్తి చేయడం ద్వారా మేడిగడ్డ-ఎల్లంపల్లి-మిడ్‌మానేరు వరకు గోదావరి నీటిని మొదటి దశలో పంపింగ్ చేసేలా విద్యుత్ సరఫరా నిర్మాణ పనులు చేస్తున్నాం. తిప్పాపూర్ -చందులాపూర్-తుక్కాపూర్ లింక్‌ను 2018 డిసెంబరు వరకు పూర్తిచేస్తాం. మేడారంలో మూడు షిఫ్టుల్లో కార్మికులు, విద్యుత్ ఇంజినీర్లు, నిపుణులు పనిచేస్తున్నారు. మిగతాచోట్ల రోజుకు 12 గంటలపాటు శ్రమిస్తున్నారు.

-సూర్యప్రకాశ్, డైరెక్టర్ (లిఫ్ట్ ఇరిగేషన్), ట్రాన్స్‌కో

సబ్ స్టేషన్లు.. విద్యుత్ లైన్ల పనులు పూర్తయిన శాతం ఇలా ఉంది

ప్యాకేజీ పేరు	మొత్తం పంపులు	ఒక్కో పంప్ సామర్థ్యం (మెగావాట్లలో)	మొత్తం లోడు (మెగావాట్లలో)	సబ్ స్టేషన్ సామర్థ్యం	పూర్తయిన శాతం	విద్యుత్ లైన్ సామర్థ్యం	(కి.మీ. పొడవు)	పూర్తయిన శాతం
మేడారం	7	124.4	874.8	400/11 కేవీ	70	400 కేవీ క్వాడ్ మూస్ డీసీ లైన్	(21 కి.మీ)	100
రామడుగు	7	139	977	400/11 కేవీ	100	400 కేవీ క్వాడ్ మూస్ డీసీ లైన్	(2x18 కి.మీ)	100
మలక్‌పేట్	2	30	64	132/11	27	132 కేవీ డీసీ లైన్	(12 కి.మీ)	87
తిప్పాపూర్	4	106	428	400/11 కేవీ	40	400 కేవీ క్వాడ్ మూస్ డీసీ లైన్	(50+21 కి.మీ)	45
చందులాపూర్	4	134.8	544	400/11 కేవీ	45	400 కేవీ ట్విన్ మూస్ డీసీ లైన్	(2 x 41 కి.మీ)	40
తుక్కాపూర్	8	43	348	400/11 కేవీ	50	400 కేవీ ట్విన్ మూస్ డీసీ లైన్	(30+70 కి.మీ)	55
మేడిగడ్డ	11	40	444	220/11 కేవీ	90	220 కేవీ ట్విన్ మూస్ డీసీ లైన్	(80 కి.మీ)	90
అన్నారం	8	40	324	220/11 కేవీ	90	220 కేవీ టీఎండీసీ లైన్	(28 కి.మీ)	95
సుందిళ్ల	9	40	364	400/220/11 కేవీ	87	400 కేవీ క్యూఎండీసీ లైన్	(2 x 3 కి.మీ)	98
కనకాపూర్	2	7.15+5.23	12.38	132/11 కేవీ	85	132 కేవీ డీసీ లైన్	(20 కి.మీ)	100

* వీటితోపాటు మిగతా ప్యాకేజీలకు సంబంధించిన విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల నిర్మాణానికి సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.



కమిటీ సభ్యులను అభినందిస్తున్న టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

సింగపూర్ టీఆర్ఎస్ ఎన్నారైశాఖ ఆవిర్భావం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగపూర్ టీఆర్ఎస్ ఎన్నారైశాఖ ఆదివారం ఏర్పాటయింది. టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ముఖ్యఅతిథిగా హాజరై ఈ శాఖను ప్రారంభించారు. అనంతరం మర్రి వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, జితేందర్‌రెడ్డి, శ్రీకాంత్ ఉప్పులూరి, సుశీల్‌లతో తాత్కాలిక కమిటీని ప్రకటించారు. ఎంపీ కవితతో చర్చించి పూర్తిస్థాయి కమిటీని త్వరలోనే ప్రకటిస్తామని మహేశ్ బిగాల చెప్పారు.

తక్కువ ధరకు వరిధాన్యం విక్రయించొద్దు: ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తక్కువ ధరకు వరిధాన్యం అమ్ముకోవద్దని నిజామాబాద్ జిల్లా రైతాంగాన్ని ఎంపీ కల్వకుంట్ల కవిత కోరారు. ఏప్రిల్ మొదటివారంలో జిల్లావ్యాప్తంగా 209 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎంపీ కవిత ఒక ప్రకటన విడుదల చేశారు.

విత్తన సమన్వయకర్తగా ధ్రువీకరణ సంస్థ సంచాలకుడు కేశవులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విత్తన సమన్వయకర్తగా విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకుడు డాక్టర్ కే కేశవులును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయసహ కారశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి ఉత్తర్వులు జారీచేశారు.

చెట్లను కొట్టేయడంతో ఎండల తీవ్రత: ఈటల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చెట్లను కొట్టేయడంతో ఎండల తీవ్రత పెరుగుతున్నదని, అడవులు తగ్గడంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఎండల తీవ్రత తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 240 కోట్ల మొక్కలు నాటినట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సెస్‌భవన్‌లో వాతావరణ, ప్రణాళిక శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'వడదెబ్బ-తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. చెట్లను కొట్టేయడం, చెరువులు నిర్లక్ష్యానికి గురవడంతో సమస్య ఏర్పడిందని చెప్పారు.

ఎండలు భగ భగ!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. ఆదివారం రాష్ట్రంలో అత్యధికంగా కుమ్రంభీం-ఆసిఫాబాద్‌లో 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత న మోదైంది. ఆదిలాబాద్, జగిత్యాల, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వనపర్తి, వరంగల్(రూరల్), సంగారెడ్డి జిల్లాల్లో 40 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలున మోదైనట్టుటీఎ స్‌డీపీఎస్ వెల్లడించింది.





ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన సకల ఉద్యోగుల మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు

సీపీఎస్ రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి...

ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యకార్యాచరణసమితి మహాసభ తీర్మానించింది. తెలంగాణ ఉద్యమకాలంలో సకల జనుల సమ్మె, సహాయనిరాకరణ, సాగరహారం, సంపూర్ణ తెలంగాణ ఉద్యమం, వంటవార్పు, సడక్ బంద్ వంటి మహోద్యమాలు నిర్వహించిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ద్వారానే సీపీఎస్ రద్దు వంటి సమస్యలు పరిష్కారమవుతాయని మహాసభ అభిప్రాయపడింది. ఈ సభలో కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎనిమిదేండ్లుగా బదిలీలు లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని.. ఏప్రిల్, మే నెలల్లో బదిలీల ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్డర్ టు సర్వ్ ప్రకారం ఉద్యోగులు కొత్త జిల్లాల్లో విధుల్లో చేరి 18 నెలలు గడిచిపోయాయని.. దీనివల్ల మారుమూల జిల్లాల్లో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ మహాసభను ఉద్యోగుల అక్రందన, ఆక్రోశం, మొర, విజ్ఞప్తుల సభగా భావించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఏపీలో మనవాళ్లను వాపస్ తీసుకురావాలి

జేఏసీ సెక్రెటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు వీ మమత మాట్లాడుతూ ఏపీలో అష్టకష్టాలు పడుతున్న 1200 మంది తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకురావాలని కోరారు. ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారానే సాధ్యం అవుతుందని మమత అన్నారు. టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ మాట్లాడుతూ నూరురోజుల్లోనే ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనచేసి ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా నిలిచిన తెలంగాణ ఉద్యోగులు దేశానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. సకల ఉద్యోగుల మహాసభ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి సమస్యలను నివేదిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడినప్పుడు తెల్లవారితే దసరా పండుగ ఎక్కడికి పోవాలో తెలియక బస్టాండ్ అవరణలోనే అర్డర్లు తీసుకొని కొత్త జిల్లాలకు వెళ్లామని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఉద్యోగులు పాటించిన నిబద్ధతను, మా ఉద్యోగుల ఆవేదనను సీఎం పరిష్కరించాలని కోరారు. గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు సమస్య దేశానిదా.. రాష్ట్రానిదా అనే ప్రశ్న ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నదని.. సీఎం కేసీఆర్ సీపీఎస్‌ను రద్దుచేసి 29 రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని కోరారు. పంజాబ్ చట్టం ప్రకారం సీపీఎస్‌ను రద్దుచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదని గుర్తు చేశారు. అనేక సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడుతున్న సీఎం కేసీఆర్ ఆలోచనలతో జేఏసీ ఏకీభవిస్తున్నదన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయడం సీఎంకు సాధ్యమని అన్నారు. ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ పీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు, సీపీఎస్ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉన్నదని గుర్తించడం సంతోషమన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ విధానం రద్దుచేసి దేశవ్యాప్తంగా ఉన్న 50 లక్షల ఉద్యోగుల మద్దతును పొందాలని కోరారు. టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. టీటీఎఫ్ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సీఎం కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రశంసించారు. ఇదే పద్ధతితో సీపీఎస్ విధానం రద్దుచేసి ఉద్యోగులకు అండగా ఉండాలని కోరారు. హైదరాబాద్ జేఏసీ అధ్యక్షుడు ముజీబ్ మాట్లాడుతూ.. ఉద్యోగులు సాధించుకున్న 43 శాతం ఫిట్‌మెంట్ తెలంగాణ ఉద్యోగుల మహోన్నత త్యాగాల ఫలితమేనని చెప్పారు. కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఏ పద్మాచారి మాట్లాడుతూ.. సెక్రెటేరియట్‌లో ఇప్పటికీ ఆంధ్ర ఉద్యోగుల పెత్తనం కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ సెక్రటేరియట్ ఖాళీల్లోకి అక్రమంగా ఆంధ్ర ఉద్యోగులు వచ్చి చేరిపోయారని తెలిపారు. ఈ మహాసభలో టీఎస్ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఆశ్వత్థామరెడ్డి, తెలంగాణ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘం అధ్యక్షుడు జగన్నాథం ప్రవీణ్, తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు జానయ్య, మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, స్వామిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రేచల్, శివశంకర్, గోల్కొండ సతీశ్, కోడి లింగయ్య, ముజీబ్, కృష్ణయాదవ్, ప్రతాప్, వెంకట్, 31 జిల్లాల జేఏసీ, టీఎన్జీవో, టీజీవో, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం సీఎం కేసీఆర్‌కే సాధ్యం

ప్రభుత్వ విజయాలన్నీ ఉద్యోగుల శ్రమ ఫలితమే ● సకల ఉద్యోగుల మహాసభలో ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక రంగాల్లో జాతీయ స్థాయిలో నంబర్ వన్ స్థానం సాధించడం ఉద్యోగుల శ్రమ ఫలితమేనని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, టీజీవో వ్యవస్థాపక అధ్యక్షులు వీ శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయలో ఉద్యోగులు అనేక బాధలు పడుతున్నప్పుడు, కేసులపాలైనప్పుడు అప్పటి ఉద్యమ నేత, ఇప్పటి సీఎం కేసీఆరే ఉద్యోగులను కాపాడుకున్నారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా అనేక మార్పుల కోసం నూతన ఎజెండాను రూపొందిస్తున్న సీఎం కేసీఆర్ సీపీఎస్‌ను రద్దుచేస్తారని, పాతపెన్షన్ విధానాన్ని అమలుల్లోకి తెస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఉద్యోగులకు అనేక సమస్యలు ఉన్నమాట వాస్తవమేనని, ఆవేశం ద్వారా సమస్యలు పరిష్కారం కావని హితవు చెప్పారు. సరూర్‌నగర్ మైదానంలో ఆదివారం జరిగిన సకల ఉద్యోగుల మహాసభలో ముఖ్యఅతిథిగా ప్రసంగించిన శ్రీనివాస్‌గౌడ్.. ఒక ఉద్యమనేతగా, తెలంగాణ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతున్న పాలకుడిగా సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని వివరించారు. సమస్యలన్నింటినీ సకాలంలో సీఎం కేసీఆర్ పరిష్కరిస్తారని స్పష్టంచేశారు. నూటికి నూరుశాతం ఉద్యోగుల సీపీఎస్ రద్దు జరుగుతుందన్నారు. బదిలీలపై నిషేధాన్ని త్వరలో ఎత్తివేస్తారని తెలిపారు. సీఎం కేసీఆర్ చేసే అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక కొన్ని ఉద్యోగ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఆ సంఘాలు ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు అద్భుత ఆవిష్కరణలని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించాయని పేర్కొన్నారు. ఈ అద్భుతాలను మన తెలంగాణ ఇంజినీర్లే సాధించారని ప్రశంసించారు.

రూ.850కే ఎయిర్ ఏషియా టికెట్

న్యూఢిల్లీ, మార్చి 25: ప్రైవేటు రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఏషియా తమ ప్రయాణికులకు సరికొత్త ప్రమోషనల్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ మధ్య కాలంలో ఎయిర్ ఏషియా వెబ్‌సైట్ నుంచి లేదా మొబైల్ యాప్ నుంచి టికెట్లు బుక్ చేసుకునే వారికి రాయితీ ధరలతో టికెట్లు అందజేస్తామని, దేశీయ మార్గాల్లో ప్రయాణించే వారికి రూ.850 ప్రారంభ ధరతోనూ, అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే వారికి రూ.1,999 ప్రారంభ ధరతోనూ ఈ టికెట్లు లభిస్తాయని ఆ సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే అక్టోబర్ 1 నుంచి మే 28వ తేదీ మధ్య కాలంలో ఒకవైపు ప్రయాణాలకు మాత్రమే ఈ చార్జీలు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

రూ.4,300 కోట్లతో బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ విస్తరణ

న్యూఢిల్లీ, మార్చి 25: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ 2018-19 ఆర్థిక సంవత్సరంలో నెట్‌వర్క్ విస్తరణకు దాదాపు రూ.4,300 కోట్ల పెట్టుబడులు వెచ్చించడంతో పాటు ప్రభుత్వ టెలికం ప్రాజెక్టుల కోసం మరో రూ.5,000-6,000 కోట్లు వినియోగించనున్నది. ఆ సంస్థ ఉన్నతాధికారి ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. బీఎస్‌ఎన్‌ఎల్ విస్తరణ కోసం రూ.4,300 కోట్లు కేటాయించడం జరిగిందని, మొబైల్ నెట్‌వర్క్‌తో పాటు కోర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవడం, బ్రాడ్‌బ్యాండ్ మౌలిక వసతులను మెరుగుపర్చుకోవడం ఈ విస్తరణలో ప్రధాన భాగాలని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అనుపమ్ శ్రీవాస్తవ పీటీఐ వార్తా సంస్థకు వివరించారు. ఈ విస్తరణతో పాటు భారత్ నెట్, స్పెక్ట్రమ్ నెట్‌వర్క్ లాంటి ప్రభుత్వ ప్రాజెక్టులకు మరో ఐదారు కోట్ల రూపాయలు వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ద్వైపాక్షిక వాణిజ్యంపై

భారత్, చైనా దృష్టి

- నేడు సంయుక్త ఆర్థిక బృంద సమావేశం



న్యూఢిల్లీ, మార్చి 25: భారత్-చైనా దేశాలు సోమవారం ఇక్కడ జరిగే సంయుక్త ఆర్థిక బృంద (జేఈజీ) సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నాయి. ముఖ్యంగా వాణిజ్య లోటును ఎలా భర్తీ చేయాలన్నదానిపై ఈ సమావేశంలో పాల్గొనే ఇరు దేశాల వాణిజ్య మంత్రులు, ఉన్నతాధికారులు సమాలోచనలు చేయనున్నారు. చైనా ఎగుమతుల కంటే భారత్ ఎగుమతులు చాలా తక్కువగా ఉండటంతో ఐటీ సేవలు, వ్యవసాయోత్పత్తులు, ఔషధ రంగాల్లో తమ ఎగుమతులను ప్రోత్సహించాలని చైనా వాణిజ్య మంత్రి జోంగ్ షాన్‌ను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు, అధికారులు కోరే వీలున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) ఏప్రిల్-అక్టోబర్ వ్యవధిలో చైనాతో భారత్ వాణిజ్య లోటు 36.73 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒంటెత్తు పోకడ నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇదిలావుంటే ఆఫ్రికాతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందానికి ప్రయత్నిస్తున్నట్లు ఆదివారం ఇక్కడ జరగిన సీఐఐ-ఎగ్జిమ్ బ్యాంక్ సదస్సులో మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు.

భారత్‌పై వాణిజ్య యుద్ధ ప్రభావం: అసోచామ్

అంతర్జాతీయ విపణిలో నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింతగా పెరిగితే భారతీయ ఎగుమతులపై దాని ప్రభావం ఉండవచ్చన్న ఆందోళనను పారిశ్రామిక, వ్యాపార సంఘం అసోచామ్ వ్యక్తం చేసింది. కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) ఒత్తిడికి గురికావచ్చని, జీడీపీ కూడా మందగించే వీలుందని ఆదివారం ఓ ప్రకటనలో అసోచామ్ అభిప్రాయపడింది. విదేశీ మారక ద్రవ్య విలువల్లో హెచ్చు తగ్గులు కూడా భారత్‌నుఇ బ్బందులకు గురిచేయవచ్చన్నది.

కోటి ఉద్యోగాలొస్తాయ్!

రాబోయే ఐదేండ్లలో టెలికం రంగంపై టీఎస్‌ఎస్‌సీ అంచనా





న్యూఢిల్లీ, మార్చి 25: వచ్చే ఐదేండ్లలో కోటి ఉద్యోగాలను టెలికం రంగం సృష్టిస్తుందని ఆ రంగ నైపుణ్య మండలి (టీఎస్‌ఎస్‌సీ) అంటున్నది. రిలయన్స్ జియో రాకతో దేశీయ టెలికం రంగ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిన విషయం తెలిసిందే. ఓవైపు ఈ సంచలన 4జీ టెలికం కంపెనీ నిర్ణయాలతో భారతీ ఎయిర్‌టెల్, ఐడియా సెల్యులార్, వొడాఫోన్ వంటి దిగ్గజాల లాభాలు ఆవిరైపోతుంటే.. మరోవైపు ధరల యుద్ధంతో రిలయన్స్ కమ్యూనికేషన్స్, టాటా టెలీ, ఎయిర్‌సెల్ వంటి సంస్థలు వ్యాపారాల్నే మూసేసుకుంటున్నాయి. ఇంకోపక్క పెద్ద ఎత్తున విలీనాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 'ప్రస్తుతం టెలికం రంగంలో 40 లక్షల ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాబోయే ఐదేండ్లలో ఈ సంఖ్య కోటీ 43 లక్షలకు చేరనున్నది. టెలికం, టెలికం తయారీ విభాగాల్లో భారీగా ఉద్యోగావకాశాలు ఏర్పడనున్నాయి' అని టెలికం రంగ నైపుణ్య మండలి సీఈవో ఎస్పీ కొచ్చర్ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. మెషీన్-టు-మెషీన్ కమ్యూనికేషన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలు, టెలికం తయారీ, మౌలిక, సేవల కంపెనీల నుంచి మున్ముందు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీఎస్‌ఎస్‌సీ అంచనా వేస్తున్నది. 'దేశంలో ఉత్పాదక రంగం బలపడుతుండటాన్ని మేము చూస్తున్నాం. ఈ సంకేతాలు టెలికం రంగంలో కొత్త ఆశల్ని రేకెత్తిస్తున్నాయి. టెలికం తయారీ పరిశ్రమ సామర్థ్యం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే వచ్చే ఐదేండ్లలో కోటికిపైగా ఉద్యోగాలు పుట్టుకువస్తాయని అంచనా' అని కొచ్చర్ అన్నారు. కాగా, జాతీయ వృత్తి ప్రమాణాల ఆధారంగా శిక్షణ విధానాలను రూపొందించే దిశగా టీఎస్‌ఎస్‌సీ వెళ్తున్నది. నైపుణ్యం పెరిగితే ఉద్యోగావకాశాలు మెరుగుపడుతాయని చెబుతున్నది. ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, టవర్ కంపెనీలు ఈ శిక్షణ కేంద్రంలో భాగస్వాములు కావాలన్న ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయని కొచ్చర్ చెప్పారు. అన్ని టవర్ టెక్నీషియన్లకు ఇక్కడ శిక్షణ ఇస్తామని, అప్పుడు వారికి సులభంగా ఉద్యోగాలు లభించగలవన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా కొచ్చర్ వ్యక్తం చేశారు. ఈ ట్రైనింగ్ సెంటర్ కోసం టీఎస్‌ఎస్‌సీ కొంతమేర పెట్టుబడులు పెట్టనుందని, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా మరికొన్ని పెట్టుబడులు కార్పొరేట్ సంస్థల నుంచి వస్తాయన్నారు.

పోనున్న మరో 40-50 వేల ఉద్యోగాలు

సీఐఈఎల్ హెచ్‌ఆర్ నివేదిక ప్రకారం ప్రస్తుతం సంక్షోభంలో చిక్కుకున్న దేశీయ టెలికం పరిశ్రమలో గడిచిన ఏడాది కాలంగా దాదాపు 40,000 ఉద్యోగాలు పోయాయి. రాబోయే 6-9 నెలల్లో మరిన్ని ఉద్యోగాలు పోతాయన్న అంచనాలుండగా, ఈ సంఖ్య 80,000-90,000కు చేరుకుంటుందని భావిస్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో బడా సంస్థలన్నీ ఏకమవుతున్న విషయం తెలిసిందే. ఐడియా, వొడాఫోన్ సంస్థలు విలీనం కానుండగా, ఎయిర్‌టెల్‌లో టెలీనార్, టాటా టెలీ కలిసిపోతున్న సంగతీ విదితమే. ఎయిర్‌సెల్, రిలయన్స్ కమ్యూనికేషన్స్ కూడా మూతబడుతుండటంతో ఉద్యోగులపై వేటు తప్పదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

జియో రాకతో లాభాలు ఆవిరి

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రాకతో టెలికం కంపెనీల ఆర్థిక పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యాయి. ఏడాదికిపైగా జియో ఉచిత సేవలను అందించడంతో ఆయా సంస్థల లాభాలు ఆవిరైపోయాయి. కస్టమర్లూ తగ్గిపోయారు. ఆ తర్వాతి కాలంలోనూ జియో టారిఫ్‌లను భారీగా తగ్గించగా, ఎయిర్‌టెల్, జియో మధ్య ధరల యుద్ధానికి బీజం పడింది. దీంతో అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్, టాటా గ్రూప్‌నకు చెందిన టాటా టెలీ, ఎయిర్‌సెల్ తదితర కంపెనీల ఉనికికే ప్రమాదం ఏర్పడింది. వ్యాపారం లేక ఆదాయం పడిపోగా, పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయాయి. ఎయిర్‌టెల్ లాభాలు దిగజారగా, ఐడియా ఏకంగా నష్టాల్నే ప్రకటించిన విషయం తెలిసిందే.

ప్రైవేటీకరించాలి

- పీఎస్‌బీలపై అరవింద్ పనగరియా ఉద్ఘాటన



న్యూఢిల్లీ, మార్చి 25: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో గత కొన్ని సంవత్సరాల నుంచి కుంభకోణాలు, నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) విచ్చలవిడిగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న డిమాండ్ రోజురోజుకూ ఊపందుకుంటున్నది. ప్రస్తుతం ఈ డిమాండ్‌ను గట్టిగా వినిపిస్తున్న ఆర్థిక నిపుణుల జాబితాలో నీతి ఆయోగ్ మాజీ చైర్మన్ అరవింద్ పనగరియా కూడా చేరారు. ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో అతిపెద్దదైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ని మినహాయించి మిగిలిన అన్ని పీఎస్‌బీలను ప్రైవేటీకరించాల్సిన అవసరం ఉన్నదని ఆయన ఉద్ఘాటించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పోటీపడే అన్ని రాజకీయ పార్టీలు తమతమ ఎన్నికల ప్రణాళికల్లో (మ్యానిఫెస్టోల్లో) ఈ ప్రతిపాదనను పొందుపర్చాలని ఆయన సూచించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కుంభకోణాలు, నిరర్థక ఆస్తులు యథేచ్ఛగా పెరిగిపోతుండటమే పీఎస్‌బీలను ప్రైవేటీకరించాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి ప్రధాన కారణమని ప్రస్తుతం కొలంబియా యూనివర్సిటీలో ఎకనమిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పనగరియా స్పష్టం చేశారు. 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను మినహాయించి దేశంలోని మిగిలిన అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాల్సిన అవసరం ఉన్నదని నేను గట్టిగా అభిప్రాయపడుతున్నా. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన అనంతరం కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నించే రాజకీయ పార్టీలన్నీ తమ ఎన్నికల ప్రణాళికల్లో ఈ ప్రతిపాదనను పొందుపర్చి తీరాలి' అని పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పనగరియా పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీగా డిపాజిట్లను కలిగి వున్నప్పటికీ అనేక పీఎస్‌బీల మార్కెట్ విలువ నానాటికీ దిగజారుతున్నదని, ఉత్పాదకతను, సామర్థ్యాన్ని పెంపొందించి ఈ బ్యాంకులను మళ్లీ గాడిలో పెట్టాలంటే వాటిపై ప్రభుత్వం పెత్తనాన్ని వదులుకోవాల్సిందేనని ఆయన అన్నారు. ప్రభుత్వం తన సామాజిక లక్ష్యాలను సాధించాలంటే కనీసం రెండు డజన్ల బ్యాంకులైనా ప్రభుత్వ రంగంలో ఉండాలని కొంత మంది చేస్తున్న వాదనలో అర్థం లేదని, ఇది 'చిత్తశుద్ధి లేని శివపూజ' లాంటిదేనని పనగరియా విమర్శించారు. ప్రాధాన్యతా రంగాల రుణ అవసరాలను తీర్చడంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే ప్రైవేటు రంగ బ్యాంకులే చక్కగా పనిచేస్తున్నాయని ఆయన అన్నారు.



అంబానీ ఇంట పెండ్లి బాజా

- డిసెంబర్‌లో ఆకాశ్-శ్లోకా వివాహం
- గోవాలో ఘనంగా నిశ్చితార్థం

న్యూఢిల్లీ, మార్చి 25:

దేశంలోనే అత్యంత సంపన్నవంతుడైన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అధినేత ముఖేశ్ ఇంటిలో పెండ్లి బాజాలు మోగబోతున్నాయి. ఆయన కుమారుడైన ఆకాశ్ అంబానీ తన స్కూల్‌మేట్ శ్లోకా మెహతా (ప్రముఖ వజ్రాల వ్యాపారి రసెల్ మెహతా చిన్న కుమార్తె)ను త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. డిసెంబర్ నెల ఆరంభంలో 4-5 రోజుల పాటు ఈ వివాహ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలుస్తున్నది. ఆకాశ్-శ్లోకా పెండ్లి గురించి చాలా కాలం నుంచి వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాహ నిశ్చితార్థం శనివారం గోవాలోని ఒక ఫైవ్‌స్టార్ రిసార్టులో ఘనంగా జరిగింది. ఆకాశ్ తరఫున తల్లిదండ్రులు ముఖేశ్, నీతా అంబానీతో పాటు ఆయన నానమ్మ కోకిలా బెన్ కూడా ఈ నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్నారు. నిశ్చిర్థానికి ముందు రెండు కుటుంబాల సభ్యులు పరస్పర పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను అభిమానులు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేసుకుంటున్నారు. వీటిలో శ్లోకా మెహతాకి ముఖేశ్ అంబానీ స్వీట్ తినిపిస్తున్న ఫొటో వైరల్‌గా మారింది. ఆకాశ్-శ్లోకా దేశంలోనే అత్యంత సంపన్నవంతమైన కుటుంబాలకు చెందినవారు కావడంతో గత కొంత కాలం నుంచి వీరి వివాహం హాట్ టాపిక్‌గా మారింది. ఆకాశ్ అంబానీ దేశంలోనే అత్యంత శ్రీమంతుడైన ముఖేష్ అంబానీ పెద్ద కుమారుడు కాగా, శ్లోకా మెహతా రోసీ బ్లూ డైమండ్స్ సంస్థ అధినేత రసెల్ మెహతా కుమార్తె కావడం ఇందుకు కారణం. ఆకాశ్-శ్లోకాకి మధ్య చాలా కాలం నుంచి పరిచయం ఉన్నది. ముంబైలోని ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వీరిద్దరూ కలసి చదువుకున్నారు. ఆకాశ్ ప్రస్తుతం రిలయన్స్ జియో డైరెక్టర్ల బోర్డులో సభ్యుడిగా కొనసాగుతుండగా, 2009లో పాఠశాల విద్య పూర్తి చేసుకుని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఆంత్రోపాలజీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన శ్లోకా మెహతా 2014 జూన్ నుంచి రోసీ బ్లూ ఫౌండేషన్‌లో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నది. రసెల్, మోనా మెహతా దంపతులకు కలిగిన ముగ్గురు పిల్లల్లో శ్లోకా అందరి కంటే చిన్నది. కాగా, ఆమె తల్లి మోనా మెహతాకు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13.600 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి మధ్య బంధుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది.

ఫైర్‌స్టార్ దివాలా కేసులో

భాగస్వామి కానున్న పీఎన్‌బీ

- న్యాయ నిపుణుల నియామకానికి కసరత్తు
- విచారణ నిలిపివేతకు ఎంసీఏ ప్రయత్నాలు

న్యూఢిల్లీ, మార్చి 25: ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఆధ్వర్యంలోని కంపెనీల్లో ఒకటైన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థపై అమెరికాలో జరుగుతున్న దివాలా కేసు విచారణలో పాలు పంచుకోవాలని పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) యోచిస్తున్నది. పీఎన్‌బీలో జరిగిన రూ.13,600 కోట్ల భారీ కుంభకోణంలో నీరవ్ మోదీ ప్రధాన నిందితునిగా ఉన్న విషయం తెలిసిందే. నీరవ్ నుంచి బకాయిలను వసూలు చేసేందుకు ఫైర్‌స్టార్ డైమండ్‌పై దివాలా కేసు విచారణలో పాల్గొనడం సహా అన్ని అవకాశాలను పీఎన్‌బీ పరిశీలిస్తున్నదని, ఈ విషయంలో ముందడుగు వేసేందుకు వేసేందుకు వీలుగా న్యాయ నిపుణులను నియమించుకునేందుకు పీఎన్‌బీ కసరత్తు చేస్తున్నదని అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ విషయాన్ని ధృవీకరించేందుకు పీఎన్‌బీ నిరాకరించింది.

ఇదిలావుంటే, ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ దివాలా పిటీషన్‌పై అమెరికాలో విచారణను నిలిపివేయించేందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) ప్రయత్నిస్తున్నది. పీఎన్‌బీ కుంభకోణంపై వివిధ సంస్థలు దర్యాప్తును ముమ్మరం చేసిన నేపథ్యంలో ఫైర్‌స్టార్ దివాలా పిటీషన్‌పై విచారణను నిలిపివేయించేందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ ప్రయత్నిస్తున్నదని, ఇందుకు గల న్యాయపరమైన అవకాశాలను ఆ శాఖ పరిశీలిస్తున్నదని ఉన్నతాధికారులు వెల్లడించారు. పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన నిందితులైన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు చెందిన సంస్థలు, ఎల్‌ఎల్‌పీ (లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్) కంపెనీలు సహా 60కిపైగా సంస్థలు, పలువురు వ్యక్తులకు చెందిన ఆస్తులను విక్రయించకుండా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఇప్పటికే నిషేధాన్ని విధించిన నేపథ్యంలో ఎంసీఏ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. నీరవ్ ఆధీనంలోని ఫైర్‌స్టార్ సంస్థ గత నెల న్యూయార్క్ కోర్టులో దివాలా పిటీషన్ దాఖలు చేసింది. నీరవ్‌తో పాటు ఆయన మామ మెహుల్ చోక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంకులోని కొంత మంది సిబ్బందితో కుమ్మక్కై తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్లతో ఆ బ్యాంకును రూ.13,600 కోట్లకు మోసగించిన విషయం విదితమే. ముంబైలోని బ్రాడీ హౌస్ పీఎన్‌బీ శాఖ 2011 నుంచి నీరవ్, చోక్సీ గ్రూపుల సంస్థలకు జారీచేసిన 1,590 తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్లను ఆసరాగా చేసుకుని వారు ఈ భారీ మోసానికి పాల్పడ్డారు. వీటిలో 1,213 ఎల్‌వోయూలు నీరవ్ మోదీ గ్రూపు సంస్థలకు, మరో 377 ఎల్‌వోయూలు మెహుల్ చోక్సీ గ్రూపు సంస్థలకు జారీ అయ్యాయి. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ చరిత్రలోనే అతిపెద్దదిగా 'ఘనత'కెక్కిన ఈ కుంభకోణంపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సహా వేర్వేరు సంస్థలు విస్తృత దర్యాప్తు జరుపుతున్నాయి. ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో కార్పొరేట్ సంస్థలకు బ్యాంకులు అండర్‌టేకింగ్ లెటర్లు, కంఫర్ట్ లెటర్లు జారీ చేయకుండా ఆర్బీఐ నిషేధాన్ని విధించిన విషయం తెలిసిందే.

వెంటాడనున్న వాణిజ్య యుద్ధం

ఈ వారం మార్కెట్ తీరుపై నిపుణుల అంచనా

మదుపరులను భయపెడుతున్న అమెరికా, చైనా ప్రతీకార చర్యలు



న్యూఢిల్లీ, మార్చి 25: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం అంతర్జాతీయ పరిణామాల ఆధారంగా నడుస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సృష్టించిన వాణిజ్య యుద్ధ భయాలు మదుపరులను వెంటాడుతాయన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. చైనా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించిన నేపథ్యంలో చైనా కూడా ప్రతీకార చర్యలకు దిగుతుండటం.. అమెరికా దిగుమతులపై 3 బిలియన్ డాలర్ల విలువైన సుంకాలు మోపనున్నట్లు ప్రకటించడం.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కలవరపెడుతున్నది. అంతర్జాతీయ విపణిలో చోటుచేసుకున్న ఈ వాణిజ్య యుద్ధం.. సహజంగానే ప్రపంచ మార్కెట్లకు ముప్పు తెచ్చిపెడుతుందన్న ఆందోళనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వాణిజ్యపరంగా అగ్రరాజ్యాల రక్షణాత్మక ధోరణులు ప్రపంచీకరణను మందగింపజేస్తాయన్న భయాలనూ రేకెత్తిస్తున్నాయి. ఇక మార్చి నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగుస్తుండటంతో ఈ వారం ఒడిదుడుకులకూ ఆస్కారం ఉందని నిపుణులు అంటున్నారు. ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల కదలికలు, గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు.. భారతీయ స్టాక్ మార్కెట్లను నిర్దేశించగలవని చెబుతున్నారు. కాగా, మహావీర్ జయంతి సందర్భంగా గురువారం, గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం మార్కెట్లకు సెలవు. దీంతో ఈ వారం మూడు రోజులు మాత్రమే స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ జరుగనున్నది. గత వారం సెన్సెక్స్ 579.46 పాయింట్లు, నిఫ్టీ 211.58 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

నష్టాల్లో అగ్రశ్రేణి కంపెనీలు

భారీ నష్టాల మధ్య గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోని టాప్-10 కంపెనీల్లో తొమ్మిదింటి మార్కెట్ విలువ రూ.36,468 కోట్లు తరిగిపోయింది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో వెలుగుచూస్తున్న వరుస కుంభకోణాలు, మోసాల నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.15,537.7 కోట్లు పడిపోయింది. ఐటీసీ (రూ.5,306.73 కోట్లు), రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.4,846 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.4,642.83 కోట్లు), మారుతి సుజుకీ (రూ.2,381.9 కోట్లు), టీసీఎస్ (రూ.1,732.43 కోట్లు), ఇన్ఫోసిస్ (రూ.1,102.98 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ (రూ.724.87 కోట్లు), ఓఎన్‌జీసీ (రూ.192.5 కోట్లు) షేర్లు క్షీణించాయి. అయితే హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) మార్కెట్ విలువ మాత్రమే రూ.140.69 కోట్లు పుంజుకున్నది. ఇక మార్కెట్ విలువ ఆధారంగా రూ.5,65,589.32 కోట్లతో రిలయన్స్ అగ్రస్థానంలో ఉండగా, రూ.5,39,149.53 కోట్లతో టీసీఎస్ రెండో స్థానంలో ఉన్నది.

పెట్టుబడుల జోష్‌లో ఎఫ్‌పీఐలు

విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ).. మళ్లీ పెట్టుబడుల బాట పట్టారు. దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఈ నెలలో ఇప్పటిదాకా రూ.8,440 కోట్ల పెట్టుబడులను పట్టుకొచ్చారు. గత నెల ఫిబ్రవరిలో రూ.11,000 కోట్లకుపైగా పెట్టుబడులను లాగేసుకున్న విషయం తెలిసిందే. రుణ మార్కెట్ల నుంచి కూడా రూ.250 కోట్లను ఉపసంహరించుకున్న ఎఫ్‌పీఐలు.. ఈ నెలలోనైతే ఏకంగా సుమారు రూ.10,000 కోట్ల పెట్టుబడులను తిరిగి తీసేసుకున్నారు. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పడుతుండటం, ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు బాగుంటాయన్న అంచనాలుండటంతోనే ఎఫ్‌పీఐలు.. మళ్లీ స్టాక్ మార్కెట్లలోకి పెట్టుబడులతో వస్తున్నారు.

క్యూఐపీల జోరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) ఏప్రిల్-జనవరి వ్యవధిలో సంస్థాగత మదుపరులకు షేర్లను జారీ చేయడం ద్వారా భారతీయ కంపెనీలు రూ.58,520 కోట్ల నిధులను సమీకరించాయి. గత ఆర్థిక సంవత్సరం (2016-17)తో పోల్చితే ఇది 12 రెట్లు అధికం కావడం గమనార్హం. నిరుడు ఏప్రిల్-జనవరి మధ్య దేశీయ సంస్థలు క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ల (క్యూఐపీ) ద్వారా సేకరించిన నిధుల విలువ రూ.4,664 కోట్లుగానే ఉన్నది. 2016-17 మొత్తంగా చూసినా.. రూ.8,464 కోట్లుగానే ఉన్నది. కాగా, నిరుడు 16 ఇష్యూలుండగా, ఈసారి 41 ఇష్యూలున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

పారాహుషార్

- స్మార్ట్‌ఫోన్లపై థర్డ్ పార్టీ యాప్స్‌తో జాగ్రత్త
- వినియోగదారులను హెచ్చరిస్తున్న నిపుణులు



న్యూఢిల్లీ, మార్చి 25: ఫేస్‌బుక్ డాటా లీకేజీ వ్యవహారం నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారు లు జాగ్రత్తా.. అంటున్నారు నిపుణులు. కేవలం సోషల్ మీడియా వేదికగానే మీ డాటాను దొంగిలించగలరని అనుకోవద్దంటూ సూచిస్తున్న నిపుణులు.. స్మార్ట్‌ఫోన్లపైనా అపహరణ జరుగవచ్చని హెచ్చరిస్తున్నారు. థర్డ్-పార్టీ అప్లికేషన్ల (యాప్)కు అనుమతి విషయంలో ఏమరుపాటు పనికిరాదని, జాగ్రత్త వహించకపోతే విలువైన సమాచారం పోవడం ఖాయమని అంటున్నారు. సోషల్ మీడియా ఖాతాల్లోనే గాకుండా, స్మార్ట్‌ఫోన్లలోనూ అనామక యాప్‌లకు అనుమతివ్వవద్దని, ఇస్తే ఫోన్లలోని విలువైన సమాచారం చౌర్యానికి గురయ్యే వీలుందని నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్ అంతర్జాతీయ వ్యాపారాధిపతి అల్తాఫ్ హల్దే పీటీఐతో అన్నారు. ఇక ఫేస్‌బుక్ ఘటన ఓ గుణపాఠంగా పరిగణించాలని కాస్పర్‌స్కై ల్యాబ్ (దక్షిణాసియా) జనరల్ మేనేజర్ శ్రేణిక్ భయాని అన్నారు. థర్డ్-పార్టీ యాప్ డెవలపర్లకు, మార్కెటీర్లకు భారత్ ఆకర్షణీయమైన మార్కెట్ అని, భారతీయ యూజర్లు వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫ్రోస్ట్ అండ్ సుల్లీవన్ ఇండస్ట్రీ అనలిస్ట్ రాజర్షి ధార్ అన్నారు.

పత్రికల ద్వారా ఫేస్‌బుక్ క్షమాపణలు

లండన్: మరోవైపు బ్రిటన్‌కు చెందిన దాదాపు అన్ని జాతీయ పత్రికల్లో ఫేస్‌బుక్ క్షమాపణ ప్రకటనల్ని వేసింది. ఆదివారం ఈ మేరకు ఫుల్ పేజీ యాడ్‌లను ఇచ్చింది. 'మీ సమాచార రక్షణ బాధ్యత మాపై ఉన్నది. జరిగినదానికి విచారిస్తున్నాం. నన్ను క్షమించండి. మరోసారి ఇలాంటి తప్పు జరుగదని హామీ ఇస్తున్నాను' అని బ్యాక్ పేజీ మొత్తం ఫేస్‌బుక్ ప్రకటన ఇచ్చింది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి అనుబంధంగా పనిచేసిన రాజకీయ కన్సల్టింగ్ సంస్థ కేంబ్రిడ్జ్ అనలిటికాకు 5 కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం చిక్కిందన్న దానిపై ప్రస్తుతం పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే.

మృత్యుబావి

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ వద్ద ఘోరం..

వ్యవసాయ బావిలో ఆటో బోల్తా పడి 11మంది దుర్మరణం.. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

పరిమితికి మించి ఆటోలో 19మంది ప్రయాణం.. మృతుల్లో ఆరుగురు చిన్నారులు, ఐదుగురు మహిళలు

ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి.. సంఘటనపై ఆరా తీసిన మంత్రులు పోచారం, పట్నం



బావిలోంచి ఆటోను తీస్తున్న స్థానికులు

కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ/మెండోరా/ముప్కాల్/ఏర్గట్ల :



సాయమ్మ(ఫైల్)

నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావిలో ఆటో బోల్తా పడగా, 11మంది మృతి చెందారు. ఆటో డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది ప్రాణాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మెండోరా మండలం కొడిచర్లకు చెందిన పెద్దోళ్ల మల్లవ్వ తన మనువరాలు విన్యశ్రీ(6), ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన నాగంపేట్ సాయమ్మ(50), విజయ, సుమలత, ధర్మోర మద్దికుంట లక్ష్మి(45), డిచ్‌పల్లి మండలం కేశాపురానికి చెందిన కేశాపురం గంగవ్వ(45), గుండం గంగామణి(48), వర్ని మండలం మోస్రాకు చెందిన పెద్దోళ్ల సంపత్(12), బొప్పారం చిన్నరాజు, ఆర్మూర్ మండలం ఆలూరుకు చెందిన సంగీత, మనస్విని(3), సుమన్, బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన తెడ్డు రోజా (25), కొడుకు తెడ్డు చిన్నా (2), కూతురు తెడ్డు చక్కని(6) తెడ్డు రోజా బావ కూతురు ప్రశంస(7), మెండోరాకు చెందిన సత్తెమ్మ(60) ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గోపీశ్రీను ఆటోలో మెండోరాకు బయలుదేరారు. ఆటో 2.5 కిలోమీటర్ల దూరం వచ్చాక బీటీ రోడ్డుకు అతి సమీపంలో ఆటో పల్టీలు కొడుతూ ఎడమ వైపు ఉన్న వ్యవసాయ బావిలో ప్రయాణికులతో సహా మునిగింది. విన్యశ్రీ, సాయమ్మ, లక్ష్మి, గంగవ్వ, పెద్దోళ్ల సంపత్, గంగామణి, మనస్విని, రోజా, చిన్నా, చక్కని, సత్తెమ్మ నీట మునిగి మృతి చెందగా, విజయ, సుమలత, చిన్నరాజు, మల్లవ్వ, సంగీత, సుమన్, ప్రవీణ, ఆటోడ్రైవర్ గోపీను స్థానికులు రక్షించారు. నీట మునిగిన వారిని స్థానికులు నిర్మల్, ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానలకుతర లించారు.



గుండం గంగామణి(ఫైల్)



లక్ష్మి(ఫైల్)



తెడ్డు రోజా(ఫైల్)



పెద్దోళ్ల సంపత్(ఫైల్)



విన్యశ్రీ(ఫైల్)



ప్రశంస(ఫైల్)



తెడ్డు చక్కని(ఫైల్)



తెడ్డు చిన్నా(ఫైల్)

బాధితులను బయటకు తీసిన రైతులు

బావిలో పడిన వారిని సమీపంలోనే ఉన్న ముస్కు రాజారెడ్డి, ముస్కు మోహన్, గుర్రం మహేశ్, స్లెండర్ రాజారెడ్డి, రాము, లింగారెడ్డి, పల్లె లింగారెడ్డి అనే రైతులు తక్షణం స్పందించి బావిలో దిగి పైప్ ఆధారంగా వేలాడుతున్న వారిని క్షేమంగా బయటకు తీశారు.

సంఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, సీపీ

ప్రమాద స్థలాన్ని కలెక్టర్ రామ్మోహన్‌రావు, సీపీ కార్తీకేయశర్మ, జేసీ రవీందర్‌రెడ్డి సందర్శించారు. బావిలో మృతదేహాల గాలింపు చర్యలను పరిశీలించారు. స్థానిక అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బావిలో ఉన్న నీటిని తొలిగించేందుకు ప్రత్యేకంగా మోటార్లను ఏర్పాటు చేయించారు. చీకటి పడుతుండటంతో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి పొద్దు పోయే వరకు గాలింపు చర్యలు కొనసాగాయి. అలాగే, సంఘటనా స్థలాన్ని సందర్శించిన మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి సందర్శించారు. అధికారులతో మాట్లాడారు. అంతకు ముందు ఆర్మూర్ ఏరియా దవాఖానలో మృతదేహాలను పరిశీలించారు. మృతదేహాల తరలింపునకు వాహనాలను ఏర్పాటుచేశారు. మృతుల అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా ప్రతీ కుటుంబానికి రూ.10 వేల చొప్పున తన సొంత డబ్బులను అందజేశారు. ప్రభుత్వ సహాయం అందేలా కృషిచేస్తామన్నారు.

ప్రాణాలు కాపాడిన ఫుట్‌వాల్వ్ పైప్

ఈ ఘటనలో ఐదుగురు మహిళలు బావిలో ఉన్న ఫుట్‌వాల్వ్ పైప్ ఆధారంగా ప్రాణాలతో బయటపడ్డారు. నీటిలో పడ్డ సంగీత తన ఆరు నెలల వయస్సున్న కుమారుడు సుమన్‌ను చంకలో ఉంచుకుని ఫుట్‌వాల్వ్ పైపును పట్టుకుంది. ఆమె కూతురు మనస్విని(3) అప్పటికే నీట మునిగింది. సంగీతతో పాటు పైప్‌ను పట్టుకున్న చిన్నరాజు, విజయ, సుమలత, ప్రవీణను స్థానికులు ఒడ్డుకు చేర్చారు.

శుభకార్యాలకు వెళ్తూ..

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారు శుభ కార్యాలకు వెళ్తూ మృత్యు ఒడికి చేరారు. మెండోరాకు నిమ్మ సత్తెమ్మ కూతురు సంగీతను ఆర్మూర్ మండలం ఆలూరు నుంచి పండుగకు పుట్టింటికి తీసుకొస్తుండగా ఇద్దరూ మృత్యువాత పడ్డారు. చిట్టాపూర్‌కు చెందిన తెడ్డు రోజా, చక్కని, చిన్ని, ప్రశంస ఓ పుట్టిన రోజు ఫంక్షన్‌కు వెళ్తూ ఈ ప్రమాదంలో మృతిచెందారు. మోర్తాడ్ మండల ధర్మోరకు చెందిన మద్దికుంట లక్ష్మి మెండోరాలో పోచమ్మ పండుగకు వెళ్తూ ఈఘటనలో మృతి చెందింది.

రోదనలతో దద్దరిల్లిన ఘటనా స్థలం..

విషయం తెలియగానే సంఘటనా స్థలానికి మృతుల బంధువులు, కుటుంబీకులు చేరుకోవడంతో రోదనలు మిన్నంటాయి. అక్కడి హృదయ విదారక దృశ్యాలు అందరినీ కలిచి వేశాయి. చిన్నారుల మృతదేహాలు వెలికి తీసే క్రమంలో అక్కడ్డున్న వారు బాధను తట్టుకోలేక పోయారు. రోదనలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.

సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

ముప్కాల్ ఘటనపై ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. సీఎం కేసీఆర్‌తో పాటు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, బాల్కొండ ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనపై మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆరా తీశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబీకులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అక్రమంగా, ఓవర్ లోడ్‌తో తిరిగే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని, రోడ్డు భద్రతా ప్రమాదాల మీద ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని మంత్రి మహేందర్ రెడ్డి రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.



బావిలోంచి మృతదేహాలకు బయటికి తీస్తున్న రైతులు

అతివేగమే ప్రమాదానికి కారణం

ముప్కాల్ నుంచి బయలుదేరిన ఆటో, 2.5 కిలోమీటర్ల దూరం చేరగానే బావిలో బోల్తా కొట్టింది. ఆటోడ్రైవర్ అతివేగంగా నడపడంతోనే ప్రమాదం సంభవించింది. వేగంగా వెళ్తున్న ఆటో డ్రైవర్‌ను వేగం తగ్గించాలని వారించామని ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు తెలిపారు.



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోనంపేటలో మిషన్‌భగీరథ పనులను పరిశీలిస్తున్న మిశ్రా

మిషన్ భగీరథ అద్భుతం

కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దుర్గాశంకర్‌మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటన

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఇంటింటికీ నల్లాల ద్వారా ప్రజలకు శుద్ధిచేసిన జలాలను అందించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ కార్యక్రమం పనులు అద్భుతంగా జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దుర్గా శంకర్‌మిశ్రా ప్రశంసించారు. దుర్గా శంకర్ మిశ్రా శనివారం రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం చేరుకున్నారు. రాత్రి తొలుత కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా కాళేశ్వరం సమీపంలోని కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్ పనులను పరిశీలించారు. అనంతరం కాళేశ్వరంలోనే రాత్రి బస చేశారు. ఆదివారం కలెక్టర్ అమయ్‌కుమార్, జిల్లా అటవీ అధికారి రవికిరణ్‌తో కలిసి వారు మహాదేవ్‌పూర్, కాటారం, మహాముత్తారం, భూపాలపల్లి, రేగొండ మండలాల్లో పర్యటించారు. విద్య, వైద్య, మౌలిక వసతుల కల్పన, వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధరంగాల ప్రగతి, పౌష్టికాహారం తదితర అంశాలపై జిల్లాలో గల పరిస్థితిని తెలుసుకున్నారు. మహాదేవ్‌పూర్ మండలం కుదురుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. మహాదేవ్‌పూర్ మండలంలోని ప్రభుత్వ సామాజిక దవాఖానను సందర్శించి కేసీఆర్ కిట్‌పై బాలింతలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ.. తల్లీబిడ్డలకు కేసీఆర్ కిట్ పథకం చాలా ఉపయోగకరంగా ఉన్నదని కితాబిచ్చారు.

కమ్యూనిస్టు, బీజేపీ నేతల మధ్య ఘర్షణ

నారాయణపేట, నమస్తే తెలంగాణ: మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మండలం అభంగాపూర్‌లో ఆదివారం బీజేపీ, కమ్యూనిస్టు నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకొని ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శ్రీరామ నవమి వేడుకల ర్యాలీ నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. అదే సమయంలో ఆలయ సమీపంలో కమ్యూనిస్టు జెండా దిమ్మె వద్ద భగత్‌సింగ్ వర్ధంతిని కమ్యూనిస్టులు నిర్వహించారు. ఇరు పార్టీల నాయకులు మైక్‌సెట్లు వాడటంతో శబ్ద కాలుష్యం ఏర్పడటం.. తామే మొదట కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇరు పార్టీల మధ్య మాటామాటా పెరిగి, ఘర్షణకు దారితీయగా, పరస్పరం నాయకులు దాడులకు దిగారు. బీజేపీకి చెందిన అయ్యగారి హన్మంతు, శేఖర్ శెట్టి, కనకప్ప, కమ్యూనిస్టు పార్టీకి చెందిన రాము, నారాయణతోపాటు పలువురికి గాయాలయ్యాయి. సంఘటనపై ఇరుపార్టీల నాయకులు నారాయణపేట ఠాణాలో ఫిర్యాదు చేయగా, ఎస్సై కృష్ణయ్య గ్రామాన్ని సందర్శించి వివరాలను అడిగితెలు సుకున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వరంగల్ కాంగ్రెస్‌లో అసంతృప్తులు

నాయకుల ఏకపక్ష నిర్ణయాలతో మాజీ మేయర్ దంపతుల కినుక

పార్టీ వీడే అవకాశాలు!

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నేతల ఏకపక్ష వైఖరితో వరంగల్‌లోని ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు విసిగిపోతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మొదలు డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి వరకు అన్ని స్థాయిల్లో నాయకులు వ్యవహరిస్తున్న తీరుతో వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఆమె భర్త సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. దాదాపు 40 ఏండ్లుగా పార్టీలో కష్టపడి పనిచేస్తున్నా గుర్తింపు లేకుండాపోయిందని, పైగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలుస్తున్నది. చాలారోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో 'ఈ పార్టీలో ఉండి ఎందుకు? అనే ఆలోచనకు వచ్చినట్టు సమాచారం. మరోవైపు వచ్చేనెల 4, 5వ తేదీల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లాలో బస్సుయాత్ర నిర్వహించాలని భావిస్తున్నది. పీసీసీ గానీ, డీసీసీ గానీ తమ అభిప్రాయాలకు కనీసం విలువ ఇవ్వలేదని తెలుస్తున్నది. ఈ దశలో 'ఈ పార్టీలో ఎందుకుండాలి? అనే అభిప్రాయానికివచ్చినట్టు సమాచారం. ఇదే జరిగితే బస్సు యాత్ర జరిగే లోగానే వారు పార్టీ వీడే అవకాశాలున్నట్టువి శ్వసనీయ వర్గాల సమాచారం.



గుల్బర్గా ప్రమాద మృతులు లక్ష్మి, పద్మ, సాయి, సునీత (ఫైల్).. షాద్‌నగర్‌లో హెడ్‌కానిస్టేబుల్ ఖుర్షీద్, పెద్దపల్లి జిల్లా మంథనిలో మరణించిన సాయితేజ (ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 10 మంది దుర్మరణం

- గుల్బర్గాలో సంగారెడ్డి జిల్లావాసులు నలుగురు
- నల్లగొండ, ఖమ్మం జిల్లాలో ఇద్దరు చొప్పున.. రంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో ఒక్కొక్కరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పది మంది దుర్మరణం చెందారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా వద్ద జరిగిన ప్రమాదంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఇద్దరు చొప్పున, పెద్దపల్లి, రంగారెడ్డి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు వదిలారు. వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం వల్లూర్ గ్రామానికి చెందిన లక్ష్మి(40) తన మనమడు కంగ్టి మండలం నాగూర్(బి)కి చెందిన పండరి, ముత్తమ్మల కొడుకు సాయి(2) పుట్టు వెంట్రుకలు తీసేందుకు కర్ణాటకలోని మొగల్‌కోట్‌కు బస్సులో బయలు దేరారు. ఆదివారం తెల్లవారుజామున వీరు గుల్బర్గా సమీపంలో బస్సు దిగి కాలకృత్యాల కోసం రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టడంతో గొల్ల లక్ష్మి(40), సాయి(2), గొల్ల పద్మ(35), సునీత(6) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అతివేగంగా ఢీకొనడంతో వీరి మృతదేహాలు చెల్లాచెదురుగా పడి నుజ్జునుజ్జయ్యాయి. లక్ష్మి కూతురు ముత్తమ్మ కూడా వీరి వెంటే ఉన్నప్పటికీ వెంట్రుకవాసిలో స్వల్ప గాయాలతో బయపడింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో వల్లూర్, నాగూర్(బి) గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందంపల్లి వద్ద 65వ జాతీయ రహదారిపై ఆటో, కారు ఢీకొనడంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సిక్కాపూర్ తాలూకా పాసు గ్రామానికి చెందిన మహ్మద్ షాకీర్‌ఖాన్(24), మహ్మద్ తస్లీం(35) మృతి చెందారు. వీరు దుప్పట్లు విక్రయించేందుకు ఆటోలో చందంపల్లికి బయలుదేరగా, గ్రామ మలుపు వద్ద హైదరాబాద్ నుంచి రావులపాలెం వెళ్తున్న కారు వేగంగా బస్సును ఓవర్ టేక్ చేయబోయి ఆటోను ఢీకొట్టింది. ఆటో పల్టీలు కొట్టి రోడ్డుకిందికి పడిపోవడంతో డీజిల్ ట్యాంక్ పేలి మంటలంటుకున్నాయి. ఆటోలో ఉన్న ఐదుగురు రోడ్డుపై పడిపోయారు. షాకీర్‌ఖాన్, తస్లీంలు అక్కడికక్కడే మృతి చెందారు. జావిద్, సాదిక్, ఆటో డ్రైవర్ రహమత్‌లకు గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి విజయవాడ నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రేజర్లకు చెందిన వెంకటేశ్వర్లు(28), జక్కుల భానుచందర్(28) మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం రాత్రి రెండు బైకులు ఢీకొనడంతో కేశంపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎండీ ఖుర్షీద్ మృతిచెందాడు. ఖుర్షీద్ బైక్‌పై షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా పాత జాతీయ రహదారి పెట్రోల్ పంపు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఖుర్షీద్ మరణించాడు. పెద్దపల్లి జిల్లా మంథని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ కమిటీ కార్యాలయం సమీపంలోని మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై బైకును ట్రాక్టర్ ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న సాయితేజ(21) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.



నల్లగొండ జిల్లా చందంపల్లి వద్ద కారు ఢీకొనడంతో బోల్తాపడి దగ్ధమవుతున్న ఆటో



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో పోచారం భాస్కర్ రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

టీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లో వివిధ పార్టీల నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో కేశవపట్నం, ఇప్పలపల్లె గ్రామాల ఉప సర్పంచులు బొంగోని కుమారస్వామి(బీజేపీ), గీట్ల లక్ష్మారెడ్డి(కాంగ్రెస్)తోపాటు బీజేపీకి చెందిన దాదాపు 150 మంది కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్, వర్ని, రుద్రూర్, కోటగిరి, బాన్సువాడ, బీర్కూర్, మండలాల్లోని కాంగ్రెస్ యువజన విభాగం యువకులు 150మంది దేశాయిపేట్ సొసైటీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కేకే బస్తీ నుంచి రైతులు, యువజన సంఘాల నాయకులు, వివిధ పార్టీల నుంచి 50మందికి పైగా మంది టీఆర్‌ఎస్‌లో చేరగా, మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి వారికి కండువాలను కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు.




కరీంనగర్ జిల్లా కేశవపట్నంలో టీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలు, నాయకులకు కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

వరంగల్‌కు మహర్దశ

మాస్టర్‌ప్లాన్‌తో మారనున్న మహానగర రూపురేఖలు

సంపూర్ణ ప్రగతి దిశగా అడుగులు.. అంతర్జాతీయ నగరాల సరసన చోటుదక్కేలా కసరత్తు

ప్రణాళికకు తుది మెరుగులు.. ఏప్రిల్ 15 నాటికి తుది ముసాయిదా



వరంగల్ మహా నగరం ఏరియల్ వ్యూ

(నూర శ్రీనివాస్/వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ): ఓరుగల్లు మహానగర చారిత్రక ఘన వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని భవిష్యత్ ఆధునిక మహానగరంగా అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకునేందుకు తెలంగాణ సర్కార్ నడుం బిగించింది. శతాబ్దాల చరిత్రగల ఓరుగల్లు మహానగరం దశాబ్దాల క్రితం రూపొందించిన పాత పద్ధతుల్నే అనుసరిస్తుండటంతో ప్రగతిలో వెనుకబడింది. కాకతీయుల ఘనచరిత్రను చెప్పుకుంటూ సాగిందే కానీ చారిత్రక వైభవస్థాయిలో దేశంలోని మిగితా నగరాలతో పోటీపడలేకపోయింది. దీన్ని గమనించిన తెలంగాణ సర్కార్ వరంగల్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని శాస్త్రీయ పద్ధతిలో నగరాన్ని ఆవిష్కరించాలని సంకల్పించింది. సీఎం కేసీఆర్ గతంలో వరంగల్ పర్యటన సందర్భంగా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అందు లో భాగంగానే ప్రభుత్వం వరంగల్‌కు కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నది. రెండు మూడు దశాబ్దాల తరువాత పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడున్న చారిత్రక, భౌగోళిక, ఆర్థిక స్థితిగతుల్ని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)ను ఆదేశించారు. 'కుడా' ఈ బాధ్యతను లీ అసోసియేట్స్‌కు అప్పగించింది. ఆ సంస్థ దాదాపు రెండేండ్లుగా 'కుడా' పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను సేకరించింది. 'కుడా' స్వరూప స్వభావాల (భౌగోళిక, చారిత్రక, పారిశ్రామిక, ఆర్థిక తదితర) పరిగణనలోకి తీసుకొని కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నది. దీనిపై ఇప్పటికే రెండు విడుతలుగా సమీక్ష నిర్వహించారు. అనేక సూచనలు, సమీకరణలు, సలహాలు పరిగణనలోకి తీసుకొని తుది ముసాయిదాను వచ్చేనెల 15 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

సానుకూల అంశాలు..

తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ వరంగల్ మహా నగరానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. బడ్జెట్‌లో ఏటా రూ. 300 కోట్లను కేటాయించారు. ఇప్పటికే మూడు దఫాలుగా రూ.900 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో ఓవైపు పనులు సాగుతున్నాయి. వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో రెండు వేల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్క్‌కు గత అక్టోబర్‌లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. వరంగల్ మహానగర ప్రగతిలో అత్యంత కీలకమైన ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. 163వ, 563వ జాతీయ రహదారులు మహానగరం మీదుగా వెళుతున్నాయి. వీటికితోడు ఉత్తర, దక్షిణ వారధిగా కాజీపేట రైల్వే జంక్షనే కాకుండా 'కుడా' పరిధిలో మొత్తం 12 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం హృదయ్, స్మార్ట్‌సిటీ, అమృత్ పథకాల కింద సహకరిస్తున్నది.

శాటిలైట్ టౌన్‌షిప్‌లు..

ఓవైపు ఓఆర్‌ఆర్ (ఔటర్ రింగ్‌రోడ్డు) రెండు జాతీయ రహదారుల మేళవింపుగా విస్తృతమైన రోడ్ కనెక్టివిటీకి అవకాశాలున్నందున శాటిలైట్ టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని అంచనావేసి ప్లాన్‌ను రూపొందించనున్నారు. మాస్టర్ ప్లాన్‌ను వచ్చే నెల15 నాటికి తుది ముసాయిదాను సిద్ధం కానున్నది. ఆ తరువాత అన్నీ అనుకున్నట్టు జరిగితే ఆ తరువాత నెలా, నెలన్నరలోగా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తీసుకువచ్చేలా పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో సమగ్ర విధానానికి ఆమోదం పొంది తద్వారా వరంగల్ కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తెచ్చేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి.

ఏ దిక్కులో దేనికి ప్రాధాన్యం..?

వరంగల్ ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్‌లో నగరం నలువైపులా భవిష్యత్ అభివృద్ధిని అంచనా వేసి దానికి అనుగుణమైన అంశాలను పొందుపరుస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ టు వరంగల్ ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్మించేందుకు ప్రతిష్ఠాత్మక టీఎస్ ఐపాస్‌లో ప్రతిపాదించారు. దీన్ని మాస్టర్ ప్లాన్‌లో ఈ అంశాన్ని అతిముఖ్యమైన అంశంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. మడికొండ ఐటీ పార్క్ సహా అనేక పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణమైన ప్రతిపాదనలు పొందుపరచాలని ప్రభుత్వం నిర్దేశించింది. వరంగల్ టు నర్సంపేట్ దారిలో ఒకవైపు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, మరోవైపు ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ ఏనుమాముల మార్కెట్ ఉన్న నేపథ్యంలో దానికి అనుబంధంగా వ్యవసాయ అనుబంధ పారిశ్రామిక యూనిట్లు (ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజీలు మొదలైనవి) ఉండేలా, వరంగల్ టు కరీంనగర్ వైపు గృహ నిర్మాణాలకు అనువైన అంశాలు, వరంగల్ టు భూపాలపట్నం జాతీయ రహదారి (ములుగు రోడ్‌వైపు) ట్రక్ టర్మినల్స్ ఉండేలా, వరంగల్ టు ఖమ్మం వైపు (మామునూర్ వైపు) ఇలా నగరానికి నలువైపులా భవిష్యత్ విస్తరణ అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్లాన్‌ను రూపొందిస్తున్నారు.

స్మిత్, వార్నర్‌పై జీవితకాల నిషేధం!

బాల్ టాంపరింగ్ ఊబిలో స్మిత్, వార్నర్ మరింత కూరుకుపోయే అవకాశం కనిపిస్తున్నది. స్మిత్, బాన్‌క్రాఫ్ట్‌పై ఐసీసీ నామమాత్రపు చర్యలు తీసుకోగా, సీఏ మాత్రం జీవితకాల నిషేధం విధించేందుకు అడుగులు వేస్తున్నది. ఆస్ట్రేలియా ప్రధానితో పాటు స్పోర్ట్స్ కమీషన్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఆస్ట్రేలియా చిత్తు చిత్తు

322 పరుగులతో దక్షిణాఫ్రికా ఘనవిజయం.. సిరీస్‌లో 2-1తో ఆధిక్యం



కేప్‌టౌన్: ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో ఆదివారం ఓ దుర్దినం. బాల్ టాంపరింగ్ వివాదంతో ఓ మాయని మచ్చను తెచ్చుకున్న కంగారూలు..దక్షిణాఫ్రికాతో కీలకమైన మూడో టెస్ట్‌లో చిత్తుచిత్తుగా ఓడిపోయారు. ట్యాంపరింగ్‌తో చచ్చి చెడి బరిలోకి దిగిన కంగరూలు ఏ దశలోనూ సఫారీలకు పోటీగా నిలువలేకపోయారు. ఫలితంగా నాలుగు రోజుల్లోనే ముగిసిన కేప్‌టౌన్ టెస్ట్‌లో దక్షిణాఫ్రికా 322 పరుగుల తేడాతో ఆసీస్‌పై ఘనవిజయం సాధించింది. దీంతో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. సఫారీలు నిర్దేశించిన 430 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆసీస్ 39.4 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. సీనియర్ పేసర్ మోర్నీ మోర్కెల్(5/23) విజృంభణతో కంగారూల ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. వార్నర్(32) మినహా ఎవరూ రాణించలేకపోయారు. మోర్కెల్ పేస్ ధాటికి ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. ఖవాజ(1), కెప్టెన్ స్మిత్(7), షాన్‌మార్ష్(0), పెయిన్(9 నాటౌట్) ఘోరంగా విఫలమయ్యారు. అంతకుముందు 238/5 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 373 పరుగులకు ఆలౌటైంది. డివిలీయర్స్(63), డీకాక్(65), ఫిలాండర్(52 నాటౌట్) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. హాజిల్‌వుడ్(3/69), కమ్మిన్స్(3/67), లియాన్(3/102)మూడేసి వికెట్లు తీశారు. తొమ్మిది వికెట్లతో రాణించిన మోర్కెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య నాలుగో టెస్ట్ ఈనెల 30 నుంచి జొహెన్నెస్‌బర్గ్‌లో మొదలవుతుంది.

విండీస్‌కు ఆఫ్ఘన్ షాక్

క్వాలిఫయింగ్ ఫైనల్లో గెలుపు



హరారే: ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో పసికూన ఆఫ్ఘనిస్థాన్ సంచలనం చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. టాస్ గెలిచిన విండీస్ 46.5 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. పావెల్ (44) టాప్ స్కోరర్. హెట్మెర్ (38), లెవిస్ (27) ఫర్వాలేదనిపించారు. 16 ఏండ్ల లెగ్ స్పిన్నర్ ముజీబ్ 4 వికెట్లు తీశాడు. తర్వాత ఆఫ్ఘనిస్థాన్ 40.4 ఓవర్లలో 3 వికెట్లకు 206 పరుగులు చేసింది. మహ్మద్‌షెహ జాద్ (84), రహమత్ షా (51), మహ్మద్ నబీ (27) చెలరేగారు.

రషీద్ @100

ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగవంతంగా 100 వికెట్లు (44 మ్యాచ్‌ల్లోనే) తీసిన తొలి బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. షై హోప్ వికెట్ తీయడం ద్వారా అతను ఈ మైలురాయిని అందుకున్నాడు. దీంతో ఇప్పటివరకు మిచెల్ స్టార్క్ (52 మ్యాచ్‌లు) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు.

ఫెదరర్ నం.1 గల్లంతు

హాలెప్, వోజ్నియాకి ఔట్.. మియామి మాస్టర్స్



మియామి: ప్రపంచ టెన్నిస్ నంబర్‌వన్ ప్లేయర్ రోజర్ ఫెదరర్‌కు ఊహించని షాక్ తగిలింది. మియామి మాస్టర్స్ టోర్నీలో క్వాలిఫయర్ చేతిలో ఓడిన ఈ 20 గ్రాండ్‌స్లామ్‌ల వీరుడు.. టోర్నీ నుంచి నిష్క్రమించడంతో పాటు నంబర్‌వన్ ర్యాంక్‌ను కోల్పోనున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండోరౌండ్‌లో టాప్‌సీడ్ ఫెదరర్ 6-3, 3-6, 6-7 (4/7)తో ప్రపంచ 175వ ర్యాంకర్ తనాసి కొకినాకిస్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడాడు. దీంతో వరల్డ్ నంబర్‌వన్‌ను ఓడించిన అతి తక్కువ ర్యాంక్ ప్లేయర్‌గా 21 ఏండ్ల కొకినాకిస్ రికార్డులకెక్కాడు. 2003లో 178వ ర్యాంకర్ ఫ్రాన్సిస్కో క్లావెట్ (స్పెయిన్).. లిటన్ హెవిట్‌ను ఓడించి అప్పట్లో సంచలనం సృష్టించాడు.

నాదల్‌కు నంబర్‌వన్!

కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ గెలువడంతో ఫిబ్రవరిలో నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకున్న ఫెదరర్ ఇప్పుడు దానిని నాదల్‌కు కోల్పోనున్నాడు. మియామి టోర్నీలో కనీసం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నా.. ఫ్రెడ్డీ టాప్ ర్యాంక్ పదిలంగా ఉండేది. కానీ అనూహ్య ఓటమితో ర్యాంక్ చేజారనుంది. టోర్నీ ముగిసిన తర్వాత తాజా ర్యాంక్‌లనుప్ర కటించనున్నారు.

టాప్ 1, 2లు ఔట్: ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్‌లో రెండో రౌండ్‌లో 30వ సీడ్ రద్వాన్‌స్కా (పోలెండ్) 3-6, 6-2, 6-3తో ప్రపంచ నంబర్ వన్ హాలెప్ (రొమేనియా)పై గెలిచింది. మరో మ్యాచ్‌లో వోజ్నియాకి 6-0, 4-6, 4-6తో మోనికా ప్యూగ్ (పుర్టారికో) చేతిలో కంగుతిన్నది.

ఇదేం తీర్పు..!

స్మిత్‌పై ఒక్క మ్యాచ్ నిషేధం
బాన్‌క్రాఫ్ట్ మ్యాచ్ ఫీజులో 75శాతం కోత
ఐసీసీ నిర్ణయంపై మాజీల విమర్శలు



ఆస్ట్రేలియా క్రికెటర్లు.. వాళ్లంతే..అప్పుడూ, ఇప్పుడూ..మాటలతో ప్రత్యర్థులపై విరుచుకుపడినా, వెకిలి చేష్టలతో విస్తుగొలిపినా, నిబంధనలను తుంగలో తొక్కుతూ జెంటిల్ మెన్‌లా చెలామణి అయ్యారు..తాజాగా దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో బాల్ టాంపరింగ్‌తో క్రికెట్‌కే మచ్చ తెచ్చారు..కెప్టెన్ స్మిత్, బాన్‌క్రాఫ్ట్ ఆటను అపహాస్యం చేశారు.. మ్యాచ్‌ను గెలువడమే లక్ష్యంగా, క్రీడా స్ఫూర్తిని ఓడించారు..దేనికైనా హద్దు ఉంటుంది.. హద్దు మీరితే బుద్ధి చెప్పాల్సిందే. గీత దాటితే వాత పెట్టాల్సిందే, అంటూ ఆస్ట్రేలియా ప్రధాని నుంచి సగటు అభిమాని వరకు అంతా శిక్షించాలని కోరిన వేళ ..ఐసీసీ స్మిత్‌పై ఒక్క మ్యాచ్ నిషేధం, బాన్‌క్రాఫ్ట్‌కు మ్యాచ్ ఫీజులో కోత విధించింది.. స్మిత్‌పై ఒక్క మ్యాచ్ నిషేధంతో సరిపెట్టుతారా..? టాంపరింగ్ చేసిన ఆటగాడిపై నిషేధమే లేదా..? ఇదేం తీర్పు అంటూ మాజీలంతా ఐసీసీ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు.

స్మిత్ వివాదాలు

యాషెస్ సిరీస్ సందర్భంగా అడిలైడ్ టెస్ట్‌కు ముందు ఇంగ్లండ్ పేస్ బౌలర్ జేమ్స్ అండర్సన్, స్మిత్ మధ్య తీవ్ర వాగ్వాదం నడిచింది. ఆస్ట్రేలియా క్రికెటర్లు నిబంధనలు ఉల్లంఘిస్తూ వేధిస్తారని ఆరోపించగా..స్మిత్ కూడా దీటుగా స్పందించి అండర్సన్‌ను మించిన స్లెడ్జర్ మరొకరు ఉండరంటూ తీవ్ర స్థాయిలో విమర్శించాడు. మైదానంలో వీరు పరస్పరం దాడి చేసుకునేందుకు ప్రయత్నించగా అంపైర్ అలీమ్‌దార్ కలుగజేసుకుని వారిని శాంతింపజేశాడు.

2016 ఫిబ్రవరిలో క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లోనూ స్మిత్ అంపైర్ నిర్ణయాన్ని తప్పు పట్టినందుకు మ్యాచ్ ఫీజులో 30 శాతం కోతకు గురయ్యాడు. అనంతరం తన తప్పు తెలుసుకున్న స్మిత్..మంచి నాయకుడిగా ఎదుగుతానని, లోపాలను సరిదిద్దుకుంటానని చెప్పాడు. కానీ అదే పనిగా వివాదాలకు కేంద్ర బిందువవుతున్నాడు.

దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్ సందర్భంగా పేస్ బౌలర్ రబాడతో రచ్చ చేసుకున్నాడు. రబాడ తనను భౌతికంగా తగిలాడంటూ ఆరోపణలు చేయగా.. ఐసీసీ రబాడపై మ్యాచ్ నిషేధాన్ని విధించింది. అయితే రబాడ దాన్ని సవాల్ చేయడంతో ఐసీసీ మరల ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. ఐసీసీ నిర్ణయంపై స్మిత్ బాహాటంగానే విమర్శలు గుప్పించడం అతడిని మరోసారి వార్తల్లో నిలిపింది.



మాల్కమ్ టర్న్‌బుల్

'వార్త విని షాక్ అయ్యా'

మెల్‌బోర్న్: కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ బాల్ టాంపరింగ్ వార్త మొత్తం క్రికెట్ ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపింది. కనీస విలువలు మరిచిపోయి ప్రత్యర్థిని పడగొట్టాలనుకున్న ఆసీస్ క్రికెటర్ల అనైతిక చర్య మాజీలతో పాటు ఆ దేశ ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్‌ను విస్మయానికి గురిచేసింది. 'ఈ రోజు దేశ ప్రజలందరూ ఓ చేదువార్తతో నిద్రలేవాల్సి వచ్చింది. దేశం పరువుతీసేలా ఆటగాళ్లు వ్యవహరించారు. కోట్లాది మంది తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న మీరు ఇలాంటి అనైతిక చర్యలు చేయాల్సింది కాదు. మీరు చేసిన పని నన్ను షాక్‌కు గురిచేసింది. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా ఛైర్మన్ డేవిడ్ పీవర్‌తో మాట్లాడాను. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాను. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా కఠిన చర్యలకు తీసుకోవాలని సూచించాను' అని టర్న్‌బుల్ అన్నారు. ఆస్ట్రేలియా స్పోర్ట్స్‌కమిషన్(ఏఎస్‌సీ)..ఇయాన్ రాయ్, ప్యాట్ హోవర్డ్ విచారణ కోసం దక్షిణాఫ్రికా పంపనుంది.

కేప్‌టౌన్: వరుస వివాదాలతో ఆస్ట్రేలియా క్రికెటర్లు రోజురోజుకూ తమ స్థాయి దిగజార్చుకుంటున్నారు. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న ఆసీస్ మ్యాచ్ మ్యాచ్‌కూ వివాదాన్ని పెంచుతున్నదే తప్ప క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం లేదు. సిరీస్ మొదట్లో వార్నర్, డికాక్‌ల గలాటా.. మొన్నటి మొన్న రబాడతో స్మిత్ తగువులాట..తాజాగా బాల్ టాంపరింగ్. కేప్‌టౌన్‌లో మూడో టెస్ట్ మూడో రోజు ఆట సందర్భంగా బాన్‌క్రాఫ్ట్ తన ప్యాంట్ జేబులోంచి పసుపు రంగు పదార్థంతో బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నం చేశాడు. కెమెరాల్లో అడ్డంగా బుక్కవడంతో మీడియా సమావేశం పెట్టి మరీ తప్పు అంగీకరించాడు. దీనికంతటికీ కారణం తానేనంటూ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నిస్సిగ్గుగా చెప్పడంతో యావత్ క్రికెట్ ప్రపంచం ముక్కున వేలేసుకున్నది. ఆసీస్ మాజీ క్రికెటర్లు సైతం తమ ఆటగాళ్ల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఎందుకిలా..

బంతి స్వరూపాన్ని మారిస్తే అది రివర్స్ స్వింగ్ చేసేందుకు అనువుగా ఉంటుంది. బ్యాట్స్‌మెన్‌ను బోల్తా కొట్టించడం బౌలర్లకు సులువవుతుంది. కెప్టెన్ స్మిత్, బాన్‌క్రాఫ్ట్ ముందుగా ప్రణాళిక వేసుకునే బంతి స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేశారు. స్టేడియంలోని స్క్రీన్‌పై ఈ దృశ్యం కనిపించడంతో బండారం బయటపడింది. ఫీల్డ్ అంపైర్లు ప్రశ్నించినప్పటికీ బాన్‌క్రాఫ్ట్ సర్దిచెప్పడంతో ఆ తర్వాత మ్యాచ్ యధావిధిగా కొనసాగింది.

కెప్టెన్ ఔట్

బాల్ టాంపరింగ్‌ను ప్రోత్సహించి, సహచర క్రికెటర్‌తో తప్పు చేయించినందుకు ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్‌స్మిత్‌పై ఐసీసీ ఒక మ్యాచ్ నిషేధం, మ్యాచ్ ఫీజులో వంద శాతం కోత విధించింది. ఇక టాంపరింగ్‌కు పాల్పడిన బాన్‌క్రాఫ్ట్ మ్యాచ్ ఫీజులో 75 శాతం కోత, మూడు డీమెరిట్ పాయింట్లను అతడి ఖాతాలో చేర్చింది.అంతకు ముందే క్రికెట్ ఆస్ట్రేలియా.. స్మిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించగా.. వార్నర్ వైస్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. నాలుగో రోజు ఆటలో టిమ్ పెయినీ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

అయితే అంపైర్లు మ్యాచ్‌ను కొనసాగించడంపై కూడా దక్షిణాఫ్రికా మాజీలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అంపైర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

రాజస్థాన్ కెప్టెన్సీపై డైలమా

స్టీవ్ స్మిత్‌పై ఐసీసీ చర్యలు తీసుకోవడంతో ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా కొనసాగుతాడా అనేది సందేహంగా మారింది. సీనియర్ ఆటగాడైన స్మిత్‌పై ఇప్పుడే ఎటువంటి నిర్ణయం తీసుకోబోమని రాజస్థాన్ ఫ్రాంచైజీ తెలుపగా.. ఐపీఎల్ చైర్మన్ రాజీవ్‌శుక్లా సైతం వేచి చూద్దామని చెప్పారు. ఒకవేళ స్మిత్ స్వచ్ఛందంగా కెప్టెన్సీని వదులుకుని, ఆటగాడిగా కొనసాగాలని భావిస్తే.. నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి అజింక్య రహానే సిద్ధంగా ఉన్నాడని బీసీసీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు.

> సరైన వ్యక్తులు సంప్రదిస్తే కెప్టెన్సీపై ఆలోచిస్తా. స్మిత్ టాంపరింగ్‌లో పాలుపంచుకోవడం మనస్సుకు బాధ కల్గించింది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామన్న సంగతి గుర్తురెగాలి. అవసరమొస్తే జట్టుకు తిరిగి నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నా. **-క్లార్క్**

> వ్వావ్ ఐసీసీ వ్వావ్. బాల్ టాంపరింగ్ వివాదంలో మీ నిర్ణయం పూర్తిగా వివక్ష పూరితం. అన్ని ఆధారాలు ఉన్నా బాన్‌క్రాఫ్ట్‌పై ఎలాంటి సస్పెన్షన్ లేదు. కానీ 2001లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అతిగా అప్పీల్ చేసినందుకు సచిన్, సౌరవ్, శివ సుందర్, దీప్‌దాస్ గుప్తా, సెహ్వాగ్‌పై ఒక్కో టెస్ట్ సస్పెన్షన్ వేశారు. 2008 మంకీ గేట్ వివాదంలో నాపై మూడు టెస్ట్‌లు వేటు పడేశారు. వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు నిబంధనలు. **- హర్భజన్‌సింగ్**

> ఒక అంతర్జాతీయ కెప్టెన్ మోసం చేశానని అంగీకరించినా అతడిపై ఒక్క మ్యాచ్ నిషేధంతో సరిపెట్టుతారా? బాన్‌క్రాఫ్ట్‌కు 75 శాతం మ్యాచ్ ఫీజు కోత సరిపోతుందా? మోసం చేసినందుకు తీవ్రమైన శిక్షలు విధించాలి. వైస్ట్ కెప్టెన్‌తో సహా నాయకత్వ సమూహంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమేమిటి? ఐసీసీలో చాలా మార్పు రావాలి. **-మైకెల్ వాన్**



బాన్‌క్రాఫ్ట్‌ను వివరణ అడుగుతున్న అంపైర్లు

ఆకాశం నుంచి పాతాళానికి..

స్మిత్ లెగ్ స్పిన్నర్‌గా లోయర్ ఆర్డర్‌లో బ్యాట్స్‌మన్‌గా 2010లో ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఇదే ఏడాది వెస్టిండీస్‌పై వన్డేల్లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత పాకిస్థాన్‌పై టెస్టుల్లో, టీ20ల్లో తొలిసారిగా ప్రాతినిధ్యం వహించాడు. 2011లో యాషెస్ సిరీస్‌కు స్మిత్‌ను పక్కన పెట్టారు. ఇక 2013లో తిరిగి జట్టులో చోటు దక్కించుకున్న స్మిత్ బౌలింగ్ వదిలేసి పూర్తిస్థాయి బ్యాట్స్‌మన్‌గా మారిపోయాడు. భారత్‌పై మొహాలీలో 92, ఇంగ్లండ్‌పై ఓవల్‌లో సెంచరీ చేయడం అతడి కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత స్వదేశంలో ఇంగ్లండ్‌పై రెండు వరుస సెంచరీలు బాది ఆసీస్‌కు 5-0తో టెస్ట్ సిరీస్‌ను అందించాడు. అప్పటికే గాయాలపాలై సతమతమవుతున్న కెప్టెన్ మైకెల్ క్లార్క్‌కు ప్రత్యామ్నాయంగా కనిపించాడు. ఈ క్రమంలో మైకెల్ క్లార్క్ ఆటకు వీడ్కోలు చెప్పిన అనంతరం క్రికెట్ ఆస్ట్రేలియా స్మిత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. 2014-15లో భారత పర్యటనకు నాయకుడిగా వచ్చిన స్మిత్ నాలుగు టెస్టుల్లోనూ సెంచరీలు చేసి అదురగొట్టాడు. తిరుగులేని కెప్టెన్‌గా రికార్డులు కొల్లగొడుతూ క్రికెట్ ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలిచాడు. అంతేకాదు ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాట్స్‌మన్ డాన్ బ్రాడ్‌మన్‌తో స్మిత్‌ను పోలుస్తూ మాజీలంతా ప్రశంసలు కురిపించారు. అయితే ఆటలో ఎంత రాటుదేలాడో, వివాదాల్లో తలదూర్చి అంతకు మించిన అపఖ్యాతినీ గడిస్తున్నాడు.

భారత్ పైనా..

2017లో బెంగళూరులో భారత్‌తో రెండో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా స్మిత్ వివాదం రేపాడు. అతను ఎల్బీగా ఔటైనట్టు అంపైర్ ప్రకటించినప్పటికీ మైదానంలోనే నిలబడి తమ డ్రెస్సింగ్ రూమ్ వైపు చూస్తూ టెక్నికల్ సిబ్బందికి సైగలు చేయడం తీవ్ర వివాదానికి దారి తీసింది. నిజానికి బ్యాట్స్‌మన్ డీఆర్ఎస్ కోరాలంటే నాన్‌స్ట్రైకర్ సలహా తప్ప మరెవరిదీ కోరకూడదు. స్మిత్ చర్యపై భారత కెప్టెన్ కోహ్లీ తీవ్ర అభ్యంతరం తెలుపగా, తన మెదడు సరిగా పనిచేయలేదంటూ సర్దిచెప్పాడు. అది ఇరుదేశాల క్రికెట్ బోర్డుల మధ్య వివాదానికి దారితీసింది. స్మిత్‌పై చర్య తీసుకోవాలంటూ బీసీసీఐ ఐసీసీని కోరగా, ఐసీసీ పట్టించుకోలేదు. పైగా క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో జేమ్స్ సదర్లాండ్..స్మిత్‌ను వెనుకేసుకొచ్చాడు. అతడొక గొప్ప బ్యాట్స్‌మన్ అని యువ క్రికెటర్లకు ఆదర్శప్రాయమంటూ ప్రశంసలు కురిపించాడు. అయితే స్మిత్ చర్యను మాత్రం మాజీ క్రికెటర్లంతా ఖండించారు.

క్రికెట్లో చీకటి దినం

బాల్ టాంపరింగ్ కేసులో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌పై ఆసీస్ మీడియా ఏకిపారేసింది. క్రికెటర్ల ప్రవర్తన దేశానికి తలవంపులు తీసుకొచ్చిందని పేర్కొంది. ఆటగాళ్లకు జేబుల నిండా డబ్బు నింపి ఆడమని పంపిస్తే, మోసం చేశారని ద ఆస్ట్రేలియన్ పత్రిక కథనం ప్రచురించింది.

మందన, మిథాలీ చెలరేగినా..

భారత్‌కు తప్పని ఓటమి

7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు



ముంబై: సొంతగడ్డపై భారత మహిళల జట్టు పరాజయాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. బ్యాటింగ్‌లో చెలరేగినా.. బౌలింగ్ వైఫల్యంతో ముక్కోణపు టీ20 సిరీస్‌లో వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది. దీంతో ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో టీమ్‌ఇండియాపై గెలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 198 పరుగులు చేసింది. మహిళల టీ20ల్లో ఇది రెండో అత్యధిక స్కోరు. 2010లో నెదర్లాండ్స్‌పై 205/1 స్కోరు చేసిన ఆసీస్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ (188/3), ఇంగ్లండ్ (187/5) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మ్యాచ్ విషయానికొస్తే.. ఇంగ్లీష్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపెట్టిన మిథాలీ రాజ్ (43 బంతుల్లో 53; 7 ఫోర్లు), స్మృతి మందన (40 బంతుల్లో 76; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. పవర్‌ప్లేలో 52 పరుగులు చేసిన ఈ జోడీ.. తొలి 10 ఓవర్లలో 96 పరుగులు సాధించింది. ఈ క్రమంలో 25 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన మందన భారత్ తరపున ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన బ్యాట్స్‌వుమన్‌గా రికార్డులకెక్కింది. మందన ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 129 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. చివర్లో హర్మన్‌ప్రీత్ (22 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్), పూజ (10 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) చెలరేగడంతో టీమ్ ఇండియాకు రికార్డు స్కోరు సాధ్యమైంది. 199 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. టీ20ల్లో ఇది రెండో అత్యధిక లక్ష్య ఛేదన. ఓపెనర్ డానియెల్లీ యాట్ (64 బంతుల్లో 124; 15 ఫోర్లు, 5 సిక్సర్లు) అజేయ సెంచరీతో దుమ్మురేపింది. యాట్.. స్మిత్ (15)తో తొలి వికెట్‌కు 61, బీమోంట్ (23 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) తో రెండో వికెట్‌కు 96 పరుగులు జత చేసింది.

మహ్మద్ షమీకి గాయాలు

డెహ్రాడూన్: భారత పేసర్ మహ్మద్ షమీ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శనివారం డెహ్రాడూన్ నుంచి ఢిల్లీ వస్తుండగా అతను ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ట్రక్‌ను ఢీకొట్టింది. దీంతో క్రికెటర్ తలకు చిన్న గాయమైంది. వెంటనే దగ్గర్లోని దవాఖానాకు తరలించగా తలపై కుట్లు వేశారు. ప్రాణానికేమీ ప్రమాదం లేదని డాక్టర్లు తేల్చారు. ప్రస్తుతం అతను డెహ్రాడూన్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. తన భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణలతో మానసికంగా కుంగిపోయిన షమీ.. గత రెండు రోజులుగా డెహ్రాడూన్‌లోని అభిమన్యు క్రికెట్ అకాడమీ (ఏసీఏ)లో శిక్షణ తీసుకుంటున్నాడు.



ఓటమి దిశగా ఇంగ్లండ్

రెండో ఇన్నింగ్స్‌లో 132/3

తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 427/8 డిక్లేర్డ్

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి డే నైట్ టెస్టులో ఇంగ్లండ్ మళ్లీ కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే ఔటైన రూట్‌సేన రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బందులు ఎదుర్కొంది. కివీస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ (2/24) దెబ్బకు ఆదివారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 46.5 ఓవర్లలో 3 వికెట్లకు 132 పరుగులు చేసింది. మాలన్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నా డు. ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవాలన్నా ఇంగ్లండ్ ఇంకా 237 పరుగులు చేయాల్సి ఉంది. ఓపెనర్ కుక్ (2) మరోసారి నిరాశపర్చగా, స్టోన్‌మన్ (55), రూట్ (51) అర్ధసెంచరీలు సాధించారు. 6 పరుగులకే తొలి వికెట్ కోల్పోయిన జట్టును ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించి ఆదుకున్నారు. కానీ డే చివరి బంతికి రూట్‌ను ఔట్ చేసి కివీస్ మ్యాచ్‌ను చేతుల్లోకి తీసుకుంది.

బీఐఎస్‌లో సైంటిస్టు పోస్టులు

బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ (బీఐఎస్)లో సైంటిస్టు బీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- బీఈ/బీటెక్, పీజీ అభ్యర్థులకు అవకాశం
- కేంద్ర కొలువులు, పదోన్నతులకు అవకాశం
- ప్రారంభ వేతనం నెలకు రూ. 79,929/-
- ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- దరఖాస్తుకు చివరితేదీ ఏప్రిల్ 2
- ఆన్‌లైన్ ఎగ్జామ్: ఏప్రిల్ 15



వివరాలు:

వినియోగదారుల మంత్రిత్వశాఖ, వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ పరిధిలో బీఐఎస్ పనిచేస్తుంది. బంగారం, వెండి నగలకు హాల్‌మార్కింగ్, ల్యాబొరేటరీ పరీక్షలను ఈ సంస్థ నిర్వహిస్తుంది.

- పోస్టులు: సైంటిస్టు - బీ
- మొత్తం పోస్టుల సంఖ్య - 109. జనరల్ - 50, ఓబీసీ - 32, ఎస్సీ - 18, ఎస్టీ - 9 ఖాళీలు ఉన్నాయి. వీటిలో వీహెచ్ - 2, హెచ్‌హెచ్- 5, ఓహెచ్ - 2 పోస్టులు ఉన్నాయి.

విభాగాల వారీగా ఖాళీలు..

- మెకానికల్ - 21, సివిల్ -18, మెటలర్జికల్ - 10, ఎలక్ట్రికల్ - 10, ఎలక్ట్రానిక్స్ - 17, కెమికల్ - 12, ఫుడ్ టెక్నాలజీ - 5, మైక్రోబయాలజీ - 13, టెక్స్‌టైల్ ఇంజినీరింగ్ అండ్ ఫైబర్ సైన్స్ - 3 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** మైక్రోబయాలజీ సైంటిస్టు పోస్టులకు పీజీ (మైక్రోబయాలజీ) లేదా తత్సమాన కోర్సులో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. మిగిలిన పోస్టులకు బీఈ/బీటెక్‌లో కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత బ్రాంచీ ఉత్తీర్ణత.

నోట్: పై అర్హత పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు వస్తే సరిపోతుంది.

- **వయస్సు:** 2018, మార్చి 1 నాటికి 21 - 30 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఇస్తారు.
- **పేస్కేల్ :** ఏడో సీపీసీ లెవల్ 10 ప్రకారం ప్రారంభ వేతనం నెలకు రూ. 79,929/- చెల్లిస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్/సికింద్రాబాద్, విశాఖపట్నం, విజయవాడలతోపాటు దేశవ్యాప్తంగా మొత్తం 45 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ద్వారా

పరీక్ష విధానం:

- మొత్తం 200 మార్కులు. 200 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు.
- పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు.
- రీజనింగ్ - 50, ఇంగ్లిష్ లాంగ్వేజ్ - 50, సంబంధిత విభాగంలో టెక్నికల్ నాలెడ్జ్ నుంచి - 50 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ - 50 ప్రశ్నలు ఇస్తారు.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 0.25 మార్కులు కోతవిధిస్తారు.
- ఆన్‌లైన్ ఎగ్జామ్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.


ఇంటర్వ్యూ:

- ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు నివాస స్థలం నుంచి ఇంటర్వ్యూ నిర్వహించే ప్రదేశానికి రాను, పోను చార్జీలను బీఐఎస్ చెల్లిస్తుంది.
- ఎంపికైన అభ్యర్థులకు రెండేండ్ల కాలాన్ని ప్రొబేషనరీ పీరియడ్‌గా పరిగణిస్తారు.
- **పనిచేయాల్సిన ప్రదేశం:** దేశంలో ఎక్కడైనా

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 2
- **ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఏప్రిల్ 2
- **కాల్‌లెటర్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 7 నుంచి
- **ఆన్‌లైన్ ఎగ్జామ్:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** www.bis.org.in

పవర్‌గ్రిడ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీఐసీఐఎల్) ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **పోస్టు పేరు:** ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (హెచ్‌ఆర్)
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 25 (జనరల్-13, ఓబీసీ-6, ఎస్సీ-4, ఎస్టీ-2)

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీ డిగ్రీ/డిప్లొమా, ఎంబీఏ (హెచ్‌ఆర్, పర్సనల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ రిలేషన్స్), సోషల్ వర్క్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. జూలై 2018లో నిర్వహించే యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

- **వయస్సు:** 2018 జూలై 31 నాటికి 28 ఏండ్లకు మించరాదు.
- **పోస్టు పేరు:** ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (లా)
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 6 (జనరల్-4,ఓ బీసీ-1, ఎస్సీ-1)
- **అర్హత:** ఎల్‌ఎల్‌బీ/ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. క్లాట్ - 2018 (పీజీ/ఎల్‌ఎల్‌ఎం)లో ఉత్తీర్ణత సాధించాలి.

గమనిక: అభ్యర్థులు క్లాట్ 2018 రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత పవర్‌గ్రిడ్‌కు అప్లయ్ చేసుకోవాలి. ప్రస్తుతం ఫైనల్ ఎగ్జామ్స్ రాస్తున్నవారు కూడా దరఖాస్తుచే సుకోవచ్చు.

- **వయస్సు:** 2018 మే 31 నాటికి 28 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్‌ఫీ జు:** రూ. 500/-
- **పే స్కేల్:** ఏడాది వ్యవధిగల ట్రెయినింగ్ పీరియడ్‌లో రూ. 9 లక్షలు, శిక్షణ పూర్తయిన తర్వాత రూ. 15 లక్షలు.
- **ఎంపిక:** యూజీసీ నెట్ జూలై 2018, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ
- యూజీసీ నెట్/ క్లాట్-2018కు 85 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 3 శాతం, ఇంటర్వ్యూకు 12 శాతం వెయిటేజీ ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. అభ్యర్థులు మొదట యూజీసీనెట్(http://cbsenet.nic.in)కు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత పవర్‌గ్రిడ్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** యూజీసీనెట్‌కు - ఏప్రిల్ 5, పవర్‌గ్రిడ్‌కు - జూలై 31.
- **ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (లా) చివరితేదీ:** మే 31
- **యూజీసీనెట్ పరీక్ష:** జూలై 8
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

ఎన్‌టీఆర్‌వోలో 62 ఖాళీలు

నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్‌టీఆర్‌వో) వివిధ నాన్ మినిస్ట్రీరియల్ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



ఎన్‌టీఆర్‌వో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పరిధిలో పనిచేస్తున్న సంస్థ. ఈ పోస్టులు జనరల్ సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (గ్రూప్ ఏ) నాన్ గెజిటెడ్ పోస్టులు.

- మొత్తం పోస్టుల సంఖ్య-62 (జనరల్-20, ఓబీసీ-22, ఎస్సీ-14, ఎస్టీ-6)
- **పోస్టు పేరు:** సైంటిస్ట్
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్-21, కంప్యూటర్ సైన్స్-35, జియో ఇన్ఫర్మాటిక్స్-6

అర్హతలు:

- **ఎలక్ట్రానిక్స్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్, రేడియో ఫిజిక్స్ & ఎలక్ట్రానిక్స్‌లో మాస్టర్ డిగ్రీలో 6 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ & ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ & పవర్, టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ & కమ్యూనికేషన్, కమ్యూనికేషన్, ఆప్టిక్స్ & ఆప్టోఎలక్ట్రానిక్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **కంప్యూటర్ సైన్స్:** కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్, కంప్యూటర్ సైన్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **జియో ఇన్ఫర్మాటిక్స్:** జియోఇన్ఫర్మాటిక్స్/రిమోట్ సెన్సింగ్ & జియో ఇన్ఫర్మాటిక్స్‌లో మాస్టర్ డిగ్రీ/ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 56,100-1,77,500/-, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, టీఏ, ట్రావెల్ అలవెన్స్, లీవ్ ట్రావెల్ అలవెన్స్‌లు, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్స్‌లు తదితర సౌకర్యాలు ఉంటాయి.

- **ఎంపిక:** గేట్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. దరఖాస్తులను నింపేటప్పుడు నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేదీ:** ఏప్రిల్ 14
- **వెబ్‌సైట్:** http://ntro.gov.in

నేషనల్ రైస్ రిసెర్చ్‌లో

కటక్‌లోని ఐసీఏఆర్ - నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌ఆర్‌ఆర్‌ఐ)లో కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఎన్‌ఆర్‌ఆర్‌ఐ జాతీయ సంస్థ. ఇది ఐసీఏఆర్ పరిధిలో పనిచేస్తుంది. ప్రస్తుత ఖాళీలను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు.



- ప్రాజెక్టు కో ఆర్డినేటర్ -1 పోస్టు
- **జీతం:** నెలకు రూ. 40,000/- + ప్రయాణ ఖర్చులకు రూ. 10,000/- ఇస్తారు.
- **అర్హతలు:** అగ్రికల్చర్/ సంబంధిత రంగాల్లో డిగ్రీ, ఎంబీఏ (అగ్రి సంబంధిత స్పెషలైజేషన్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది) లేదా తత్సమాన అర్హతలు ఉన్నవారు.
- సీఈవో ఆఫ్ ది ఎఫ్‌పీవో - 5 పోస్టులు
- **జీతం:** నెలకు రూ. 30,000/-, ప్రయాణ ఖర్చుల కింద నెలకు రూ. 3,000/- ఇస్తారు.
- **అర్హతలు:** అగ్రికల్చర్/ అనుబంధ సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణత. ఎంబీఏ (అగ్రికల్చర్ సంబంధిత స్పెషలైజేషన్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు)
- **వయస్సు:** 40 ఏండ్లు మించరాదు
- **పై రెండు పోస్టులకు ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఏప్రిల్ 3
- గ్రాడ్యుయేట్ అసిస్టెంట్ - 1
- **జీతం:** నెలకు రూ. 15,000/-
- అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆపరేటర్ - 1
- **జీతం:** నెలకు రూ. 12,500/-
- **వయస్సు:** 40 ఏండ్లు మించరాదు. (పై రెండు పోస్టులకు)
- పై రెండు పోస్టులకు కాంట్రాక్టు వ్యవధి ఏడాది.
- **ఇంటర్వ్యూతేదీ:** ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** http://www.crri.nic.in

సీఎస్‌డబ్ల్యూఆర్‌ఐలో

సెంట్రల్ షీప్ అండ్ ఊల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్‌డబ్ల్యూఆర్‌ఐ) ఖాళీగా ఉన్న యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీఎస్‌డబ్ల్యూఆర్‌ఐ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ

ICAR-Central Sheep and Wool Research Institute

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 6
- గ్రేడ్- II యంగ్ ప్రొఫెషనల్ (వెటర్నరీ ఆఫీసర్)-1, గ్రేడ్ -I యంగ్ ప్రొఫెషనల్ (ల్యాబ్ టెక్నీషియన్ -1, ఫీల్డ్ టెక్నీషియన్ -1, ఎలక్ట్రికల్-1, కంప్యూటర్-2)
- **అర్హత:** గుర్తింపు పొందిన బీవీఎస్సీ & ఏహెచ్, బీఎస్సీ, డిప్లొమా (ఎలక్ట్రికల్), బీసీఏ, బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **వయస్సు:** 21 నుంచి 45 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** గ్రేడ్-II యంగ్ ప్రొఫెషనల్స్‌కు రూ. 25,000/-, మిగతా పోస్టులకు రూ. 15,000/-(కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** రాత పరీక్ష/ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, ఇంటర్వ్యూ తేదీన పర్సనల్ అధికారి వద్ద హాజరు కావాలి
- **ఇంటర్వ్యూ తేదీ:** ఏప్రిల్ 7, 10, 13
- **వెబ్‌సైట్:** www.cswri.res.in